ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
25-8-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 206 పేజీలు: 12 వెల: 6.50

మిస్ యూనివర్స్ ఇండియా కజియా లిజ్‌మెజో
కేంద్ర కేబినెట్ ప్రక్షాళనకు ముహూర్తం ఖరారు
9లో

# ఆన్‌లైన్ సేవలు ఇక సులభతరం

## ప్రభుత్వ శాఖల్లో సమర్థత, నాణ్యత
## సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కోసం డేటా ఇంటిగ్రేషన్
## డెంగ్యూ, మలేరియా నివారణకు హాట్‌స్పాట్ల గుర్తింపు
## ఆర్టీజీఎస్ సమీక్షలో సిఎం చంద్రబాబు


సోమవారం సచివాలయంలో జరిగిన ఆర్టీజీఎస్ సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,, ఆగస్ట్ 24, ప్రభాతవార్తప్రతినిధి:** ఏ ఒక్కరూ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే పని లేకుండా సేవలు అందించాలని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు.కృత్రిమ మేధ(ఎఐ) అసిస్టెంట్, డిజి వెరిఫై, డేటా లేక్, బ్లాక్ చెయిన్.. వంటి సాంకేతికతను వినియోగించుకుని ఆన్‌లైన్ సేవలు మరింత సులభతరం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రస్తుతం వాట్సప్ గవర్నెన్స్ మనమిత్ర ద్వారా అందిస్తున్న 1,204 సేవలకు సంబంధించి డేటా ఎంట్రీ సమాచారాన్ని మరింత సంక్షిప్తం చేయాలన్నారు. సర్టిఫికేట్స్ అప్‌లోడ్ చేసే పని లేకుండా డేటా ఇంటిగ్రేషన్ జరగాలని సిఎం స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ సమీక్షలో వివిధ శాఖల పనితీరు, పురోగతి గురించి ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖలు మరింత సమర్థత పెంచుకోవాలని, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రజలకు సేవలు అందించే విషయంలో పారదర్శకత ఉండాలన్నారు.ప్రతి అంశంపైన అధికార యంత్రాంగం శ్రద్ధ పెట్టాలన్నారు.మన ప్రభుత్వ ప్రజలకు సేవలను అత్యంత సులభతరంగా అందించాలనుకుంటున్నదన్నారు. ఈ విషయంలో ఎటువంటి నిర్వహణా లోపం ఉండకూడదన్నారు. ప్రజా ప్రయోజ నాంశాలపై అత్యంత శ్రద్ధ చూపించాలన్నారు.మనం సేవలు అందించడంలో సంస్కరణలు తీసుకుని వచ్చాం, అవి సమర్ద వంతంగా ఉన్నాయనే సంతృప్తి ప్రజల్లో స్పష్టం కన్పించాలన్నారు.

**క్రాప్ అలర్ట్‌లపై పర్యవేక్షణ..**

ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో పంటల పరిస్థితిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈసారి వ్యవసాయ దిగుబడులు సాధారణం కన్నా 20 శాతం తగ్గే అవకాశం ఉందని తెలిపారు. అదే విధంగా కృష్ణా డెల్టాకు సెప్టెంబర్ నెలాఖరు వరకు పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు అందించగలమని చెప్పారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు సమృద్ధిగా నీరందించేలా చూడాలని సిఎం ఆదేశించారు. ఇప్పటికే సాగు మొదలు పెట్టని చోట వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు ప్రోత్సహించాలని నిర్దేశించారు. రైతులకు ఎప్పటికప్పుడు క్రాప్ అలర్ట్ పంప డంతో పాటు దానిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఇందుకోసం ఎపిటిఎస్ అనలిటిక్స్ కూడా వినియోగించుకుని... అవేర్‌తో సమ న్వయం చేసుకోవాలని సిఎం అన్నారు. మంచి >>2




## మాజీ మంత్రి కారుమూరికి జ్యుడీషియల్ రిమాండ్
### చంచల్‌గూడ జైలుకు తరలింపు
### ఎపి లిక్కర్ స్కాం కేసు

**విజయవాడ.ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీ నేత, మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు హైదరాబాద్ కోర్టు 2 వారాలు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కారుమూరిని ఇడి అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఎపి మద్యం రవాణా కుంభకోణంలో కారుమూరి నిందితుడిగా ఉన్నారు.నిన్న ఆయనను అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్ నిమిత్తం హైదరాబాద్ కోర్టులో హజరు పరిచారు. కారుమూరి నాగేశ్వర రావు రిమాండ్‌పై ఇరువర్గాల న్యాయవాదులు తమ వాదనలు న్యాయస్ధానంలో విన్పించారు.. రెండు గంటలకుపైగా వాదనలు కొనసాగాయి. కారుమూరి రిమాండ్‌పై తీర్పును న్యాయమూర్తి రిజర్వ్ చేసినట్లు తొలుత ప్రకటించారు. ఈ రోజు సాయంత్రం కారుమూరికి రిమాండ్ విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది.ఆ వెంటనే కారుమూరి న్యాయవాది ఆయనకు బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేసారు. న్యాయస్ధానం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టవలసిఉంది. ఇక కోర్టు హజరు పరిచే ముందు గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన తరువాత కారుమూరిని ఇడి కోర్టులో హాజరు పరిచారు. అయితే ముందస్తు అరెస్టును ఊహించి మిత్రుడి ఇంట్లో తలదాచుకున్న కారుమూరి నాగేశ్వర రావును ఇడి అధికారులు ఆదివారం మజీద్‌బండలోని షార్క్‌హైట్స్ అపార్ట్‌మెంట్‌లో అదుపులోకి తీసుకు >>2

# ఖరగ్‌పూర్ నుంచి అమరావతి దాకా.. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే కారిడార్

**విజయవాడ, ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి తూర్పు భారతదేశంతో రవాణా అనుసంధానాన్ని మరింత పటిష్ఠం చేసేలా పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్ నుంచి అమరావతి వరకు 1,107 కిలోమీటర్ల సుదీర్ఘ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే కారిడార్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.ఈ హైవేకు అనుమతినిచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి సిఎం చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీ చొరవతో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ఆమోదం లభించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు "ఎక్స్" వేదికగా వెల్లడించారు. ప్రధాని మోదీ, కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీలకు ఎపి ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సహకారంతో రాష్ట్రానికి అవసరమైన నేషనల్ హైవేలు, హైస్పీడ్ కారిడార్లు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలను తీసుకొస్తోంది. తాజాగా రాష్ట్రానికి మరో హైస్పీడ్ కారిడార్‌కు సంబంధించి కీలక ముందడుగు పడింది. ఉత్తరాంధ్ర నుంచి అమరావతిని కనెక్ట్ చేసేలా.. పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్ టు అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నాలుగు లైన్ల హైస్పీడ్ కారిడార్ అలైన్‌మెంట్‌కు కేంద్రం నుంచి ఆమోదం వచ్చింది. నాలుగు రాష్ట్రాల్లో కలిపి ఈ కారిడార్ 1,107 కిలోమీటర్లు కాగా.. ఆంధ్రప్రదేశ్ పరిధిలో మొత్తం 457 కిలోమీటర్లు ఉంది. ఏపీలో అంచనా వ్యయం రూ.32 వేల కోట్లుగా ఉంది.. ఈ కారిడార్ గిరిజన ప్రాంతాలు, గోదావరి జిల్లాలు, అమరావతిని కనెక్ట్ చేయనుంది.ఏపీలోని 457 కిలోమీటర్ల నాలుగు వరుసల హైస్పీడ్ రోడ్ కారిడార్‌కు సంబంధించి.. సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మార్గాన్ని మోర్త్ ( కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ) ఏఏసీ (అలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ) ఆమోదించింది. ఈ కారిడార్ పశ్చిమబెంగాల, జార్ఖండ్, ఒడిశా మీదుగా ఎపి వరకు ఉంటుంది. రాష్ట్రానికి సంబంధించిన అలైన్‌మెంట్ విషయానికి వస్తే.. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, >>2

## నూకరాజు ఆత్మహత్య కేసు
# నిందితుడు సాదిక్ అరెస్టు
### మతమార్పిడి బెదరింపులపై సమగ్ర దర్యాప్తు: ఎస్పీ బిందు మాధవ్



**కాకినాడ, ఆగస్టు 24, ప్రభాత వార్త:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనా త్మకంగా మారిన పిఠాపురం పంచాయతీరాజ్ శాఖ ఎఇ టిల్ల పూడి నూకరాజు, అతని భార్య మీనా, కుమార్తె కొవ్వూరి సౌజన్య ఆత్మహత్యకు కారకుడిగా ఆరోప ణలు ఎదుర్కొంటున్న నిందితుడు షేక్ సాదిక్ ఖాన్‌ను కాకినాడ జిల్లా పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. సర్పవరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన సంచలన హత్య కేసుపై సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి బిందుమాధవ్ పలు సంచలనా త్మక విషయాలను వెల్లడించారు. కేసుతీవ్రతను దృష్టిలో ఉంచు కుని జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ప్రత్యేక చొరవతో ఆరు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. ఈ నెల 16వ తేదీన ఉదయం 10.30 నుంచి 11.30 గంటల మధ్య జగదీష్ రెడ్డి భార్య కొవ్వూరి సౌజన్య, ఆమె తల్లిదండ్రులు తిల్లపూడి నూకరాజు, మీనా, కుమారుడు రియాన్స్ కార్తికేయ రెడ్డి రాజమహేంద్రవరం వద్ద గోదావరి నదిలో జరిగిన ఘటనకు సంబంధించిన సమాచారం పోలీసుల దృష్టికి >>2

## తాగు నీటికే
# కృష్ణా జలాలు
### నీటి వాటాలపై ఇంకా నిర్ణయం తీసుకోని కెఆర్‌ఎంబి త్రిసభ్యకమిటీ
### సెప్టెంబరు 4న మరోసారి భేటీ

**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణానదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ నీటి వాటాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే వాయిదా పడింది.హైదరాబాద్ జలసౌధలో కెఆర్‌ఎంబి సభ్య కార్యదర్శి సతీశ్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. భేటీకి తెలంగాణ ఇఎన్సీ రమేశ్ బాబు, ఎపి తరపున ఇఎన్సీ నరసింహమూర్తి హాజరయ్యారు. నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి పంపిణీపై ఈ భేటీలో చర్చలు జరిపారు.ఈ వివరాలను ఎపి ఇఎన్‌సీ నరసింహమూర్తి మీడియాకు తెలిపారు. రాయల సీమ, పల్నాడు ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకుగానూ నీటి విడుదలపై చర్చించేందుకు త్రిసభ్య కమిటీని సమావేశ పర్చినట్లు వివరించారు. సమావేశంలో . శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి ఈ యేడాది మొత్తం నీటి వాడకంపై తెలంగాణ ప్రతిపాదించగా ఎపి తరపున అక్టోబర్ వరకే ప్రతిపాదించినట్లు తెలిపారు. అప్పటివరకు 47 టిఎంసిలు అడిగామని ఇందుకు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు చెప్పారు. రెండురాష్ట్రాల వాటా అంశం చర్చకు రాలేదని సెప్టెంబర్ 4న మరోసారి సమావేశమై చర్చిస్తామని ఇఎన్‌సీ నరసింహమూర్తి స్పష్టం చేశారు. ఎల్ నినో దృష్ట్యా శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి కృష్ణా జలాలను తాగునీటినే వాడుకోవాలని సూత్రప్రాయంగా నిర్ణయించామని తెలిపారు. యేడాది మొత్తం నీటి వాడకంపై తెలంగాణ ప్రతిపాదించింది. మేం అక్టోబర్ వరకే ప్రతిపాదించామన్నారు. అప్పటివరకు 47 టీఎంసీలు అడిగాం, సూత్రప్రాయంగా అంగీకరించారు. రెండు రాష్ట్రాల వాటా అంశం చర్చకు >>2


సోమవారం ముసునూరులో నూతన మొక్కజొన్న వంగడాన్ని ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తదితరులు

# సరికొత్త మొక్కజొన్న వంగడం

### ముసునూరులో ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సిఎం చంద్రబాబు
### గోర్మే పాప్‌కారన్ విదేశాలకు ఎగుమతి
### 100 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా

**ఏలూరు/ ముసునూరు, ఆగష్టు, 24 : ప్రభాతవార్త** : ఏలూరు జిల్లా ముసునూరులో గోర్మే పాప్‌కార్నికా సంస్థ ఆధ్వర్యంలో జన్యుపరంగా మార్పు చేయని (నాన్‌బిటీవీ) మొక్కజొన్న వంగడాన్ని భారత ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ గోర్మే పాప్‌కార్నికా సంస్థ ఆవరణలో సోమవారం పండుగ వాతావరణంలో జరిగిన కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబులతో కలిసి ఆవిష్కరించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ఉప రాష్ట్రపతి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి సి.పి రాధా కృష్ణన్ మాట్లాడుతూ విదేశీ హైబ్రిడ్ విత్తనాల దిగుమతులపై ఆధారపడటాన్ని >>2

## గురుకుల పాఠశాల ఉద్యోగుల
# రిటైర్మెంట్ పెంపు

**విజయవాడ.ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది అందరికీ వర్తించేలా గిరిజన సంక్షేమశాఖ జీవో 33ను జారీ చేసింది. జులై 2026 నుంచి రిటైర్ అయ్యే ఉద్యోగుల సర్వీసును కొనసాగించేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఈ వయోపరిమితి పెంపునకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కీలక షరతులను విధించింది. ఉద్యోగులు రిటైర్ అయి, తిరిగి విధుల్లో చేరే మధ్య కాలానికి ఎలాంటి వేతన బకాయిలు చెల్లించబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే అప్పటికే రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద గ్రాట్యుటీ, పెన్షన్ పొంది ఉంటే, జీవో 45 ప్రకారం వాటిని రికవరీ చేయాలని పేర్కొంది. ఈ నిర్ణయానికి అనుగుణంగా సర్వీస్ రూల్స్‌లో అవసరమైన సవరణలు చేయాల్సిందిగా గురుకులం సెక్రటరీని ప్రభుత్వం ఆదేశించింది. 2026-27 బడ్జెట్ పరిధిలోనే వ్యయం చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అవసరమైతే 28 మంది బోధన సిబ్బందికి కూడా రూ.4.12 కోట్ల అదనపు నిధుల ప్రతిపాదన చేస్తామని తెలిపింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ జీవో ఎంఎస్ నంబర్ 33ను జారీ చేసింది.

# ఇన్‌సర్వీస్ టీచర్ల కోసం స్పెషల్ టెట్ నోటిఫికేషన్ జారీ

### సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం టెట్ అర్హత సాధించేందుకు అవకాశం
### ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 24 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు

**విజయవాడ.ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగంలో కొనసాగుతున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో, తప్పనిసరి అర్హతగా మారిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను ఇన్‌సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేకంగా నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సోమవారం స్పెషల్ ఎపిటెట్ ఆగస్టు 2026 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 2011కు ముందు నియమితులై, ఇంకా టెట్ అర్హత సాధించని వేలాది మంది ఉపాధ్యాయులకు ఈ పరీక్ష ద్వారా అర్హత పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. దీనికి సంబంధించిన వివరాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా 'ఎక్స్"లో వెల్లడించారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించడం తప్పనిసరి అని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసిన విషయం తెలిసిందే. 2025 సెప్టెంబర్ 1న సివిల్ అప్పీల్ నెం.1385/2025లో ఇచ్చిన తీర్పు, ఆ తర్వాత 2026 మే 29న రివ్యూ పిటిషన్లపై వెలువరించిన ఉత్తర్వుల ప్రకారం, 2028 ఆగస్టు 31వ తేదీలోగా ఇన్‌సర్వీస్ టీచర్లు ఈ అర్హతను తప్పనిసరిగా పొందాలని సర్వోన్నత న్యాయస్థానం గడువు విధించింది. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఆచరణాత్మక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, ఈ గడువును పొడిగించింది.

అంతేకాకుండా, ఉపాధ్యాయులకు తగిన అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి టెట్ పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ప్రత్యేక టెట్ నిర్వహణకు చర్యలు చేపట్టింది.ఈ ప్రత్యేక టెట్ కేవలం 2011కు ముందు నియమితులై, ప్రస్తుతం ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఏపీ రెసిడెన్షియల్, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ సంక్షేమ సొసైటీల పాఠశాలలు, ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఇన్‌సర్వీస్ టీచర్లకు (రెగ్యులర్, మినిమమ్ టైమ్ స్కేల్) మాత్రమే వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, ఈ పరీక్షలో సాధించిన అర్హత భవిష్యత్తులో >>2

## గుంటూరు కార్పొరేషన్‌లో
# భారీగా ఎసిబి దాడులు
### 156 పనులకు సంబంధించి ఫైల్స్ స్వాధీనం
### నేడు కూడా తనిఖీలు కొనసాగే అవకాశం

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 24, ప్రభాతవార్త :** గుంటూరు నగరంలోని కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు సోమవారం మెరుపు దాడులు నిర్వహించారు. ఎసిబి డిఎస్పి ప్రతాప్ కుమార్ నేతృత్వంలో మధ్యాహ్నం 12 గంటలకు కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగానికి వచ్చిన అధికారులు సాయంత్రం 8 గంటల వరకు రికార్డులను స్వాధీనం చేసుకొని, కంప్యూటర్లు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా 2017 నుంచి 2025 వరకు కార్పొరేషన్ ఇంజనీర్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన అనేక అభివృద్ధి పనులకు సంబంధించి, సిసి రోడ్లు, డ్రైన్లు, వాటర్ పైప్ లైన్ ఇంటర్ లింకేజీ పనులు, పైప్ లైన్ లీకేజీ మరమత్తు పనులకు సంబంధించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ పనులకు సంబంధించి భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయని, కాంట్రాక్టర్లతో కొమ్మక్కై అధికారులు టెండర్ల పర్సంటేజీలు మార్చేసి భారీ అవకతవకలకు పాల్పడ్డారని వచ్చిన ఆరోపణలపై ఈ దాడులు నిర్వహించడం జరుగుతుందని ఎసిబి డి.ఎస్.పి వివరించారు. అయితే ఈదాడుల్లో భాగంగా అధికారులకు సంబంధించి లంచాల రూపేణా నగదు వంటివి దొరకలేదని, కేవలం అభివృద్ధి పనులకు సంబంధించి చేసిన అవకతవకలపై రికార్డులు, ఆన్లైన్ టెండర్ విధానం, తదితర అంశాలకు సంబంధించి పూర్తి దర్యాప్తు కొనసాగుతుందని వివరించారు.

**ఈ దాడులు నేడు కూడా కొనసాగుతాయి**

గుంటూరు కార్పొరేషన్‌లోని ఇంజనీరింగ్ విభాగంలో సోమవారం దాడులు నిర్వహించడం జరిగిందని, ఈ దాడులు మంగళవారం కూడా కొనసాగుతాయని >>2

## ఇరాన్‌లో భారీ గ్యాస్ నిక్షేపాలు!
2లో



సోమవారం ఎస్వీబిసి కార్యాలయంలో ఉద్యోగులతో ముఖాముఖి సమావేశం నిర్వహిస్తున్న బి. శ్రీధర్ వర్మ

# జాతీయస్థాయిలో ఉన్నతస్థాయికి ఛానల్

## -ఎస్వీబిసి ఛైర్మన్ శ్రీధర్‌వర్మ

**తిరుమల, ఆగస్టు 24 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీబిసిని భవిష్యత్తులో మరింత వినూత్నమైన కార్యక్రమాలతో శ్రీవారి వైభవాన్ని, భారతీయ సనాతన హైందవ ధర్మాన్ని, దేశ విదేశాల్లోని భక్తులకు చేరవేసేలా కార్యక్రమాలను రూపొందించాలని ఎస్వీబిసి ఛైర్మన్ బి.శ్రీధర్‌వర్మ అధికారులకు సూచించారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఛానల్ ప్రసారాలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఎస్వీబిసిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లాలంటే ప్రతిఉద్యోగి సమష్టిగా కృషి చేయాలని, అంకితభావంతో సేవలందించాలని శ్రీధర్ వర్మ పిలుపునిచ్చారు. శ్రీవారి వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించడమే లక్ష్యంతో సరికొత్త కార్యక్రమాలతో మరో స్థాయికి తీసుకెళ్తామన్నారు.

ఎస్వీబిసిచైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బి. శ్రీధర్ వర్మ సోమవారం సాయంత్రం ఎస్వీబిసి కార్యాలయంలో ఉద్యోగులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఉద్యోగిని వ్యక్తిగతంగా పరిచయం చేసుకుని, వాళ్లు నిర్వహిస్తున్న విధులు, బాధ్యతలు, శాఖల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎస్వీబిసి ఛానల్ ప్రసారాలపై సమీక్ష నిర్వహించిన శ్రీధర్ వర్మ, శ్రీవారి మహిమను ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులకు చేరవేయడంలో ఎస్వీబిసి విశిష్ట సేవలు అందిస్తోందని ప్రశంసించారు. భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచిన ఈ ఛానల్ ఇప్పటికే భక్తుల ఆదరణను పొందిందని పేర్కొన్నారు.

# స్పెషల్ టెట్ నోటిఫికేషన్ జారీ

>> ఎలాంటి ప్రత్యక్ష నియామకాలకు (డైరెక్ట్ రిక్రూట్‌మెంట్) ఉపయోగపడదని నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలి. ఈ స్పెషల్ టెట్‌లో ఉత్తీర్ణత సాధించడం ద్వారా కేవలం ప్రస్తుత ఉద్యోగ కొనసాగింపు, తదుపరి ప్రమోషన్లకు మాత్రమే అర్హత లభిస్తుంది. ఈ టెట్ సర్టిఫికెట్ వ్యాలిడిటీ జీవితకాలం ఉంటుంది. స్పెషల్ ఏపిటెట్ రెండు పేపర్లుగా ఉంటుంది. 1 నుంచి 5వ తరగతి వరకు బోధించే సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జిటి), ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్ మాస్టర్లు పేపర్.Iకు హాజరుకావాలి.డి.ఇఐ.ఇడీతో పాటు బిఇడి అర్హత ఉన్న ఎస్‌జిటి కూడా పేపర్ -1 రాయవచ్చు. ఇక 6 నుంచి 8వ తరగతి వరకు బోధించే స్కూల్ అసిస్టెంట్లు, టిజిటిలు, లాంగ్వేజ్ పండిట్లు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పేపర్-11 కు హాజరుకావాల్సి ఉంటుంది. ప్రాథమికోన్నత పాఠశాలల హెడ్ మాస్టర్లుగా పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు తమ సంబంధిత సబ్జెక్టులో పేపర్-11 రాయాలి. డి.ఇఐ.ఇడీతో పాటు బిఇడి రెండూ ఉన్న అభ్యర్థులు పేపర్-1, పేపర్- 11 రెండింటికీ హాజరుకావాలనుకుంటే, వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రత్యేక నోటిఫికేషన్ సోమవారం విడుదల అయింది.ఆన్‌లైన్ దరఖాస్తులు, ఫీజు చెల్లింపుకు ఈ నెల 25 నుంచి 24 సెప్టెంబర్ వరకు అవకాశం ఉంటుంది.ఆన్‌లైన్ మాక్ టెస్ట్ 25 సెప్టెంబర్ నుంచి అందుబాటులో ఉంటుంది.హాల్ టికెట్ల డౌన్‌లోడ్‌కు 5 అక్టోబర్ నుంచి పరీక్షల తేదీలు గమనిస్తే 11 అక్టోబర్ 2026 నుంచి 21 అక్టోబర్ 2026 వరకు జరుగుతాయి, 15 నవంబర్‌లో ఫలితాలు విడుదలవుతాయి.

# గంట వర్షానికే గురుగ్రామ్ అతలాకుతలం

**గురుగ్రామ్, ఆగస్టు 24:** హర్యానాలోని గురుగ్రామ్‌లో భారీ వర్షం నగరాన్ని మరోసారి అతలాకుతలం చేసింది. కేవలం గంటపాటు కురిసిన వర్షంతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ఉద్యోగస్తులు, విద్యార్థులు నరకయాతన పడ్డారు. ఇళ్లకు చేరుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. కార్యాలయాల్లో ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోమ్ చేసుకునేలా చూడాలని సూచించింది. అలాగే పాఠశాలల్లో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని ఆదేశించింది.

గురుగ్రామ్‌లో మధ్యాహ్నం 1.30 గంటల వరకు సుమారు 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది. రాజీవ్ చౌక్, ఇఫ్కో చౌక్, రైల్వే రోడ్, సెక్టార్5, ఓల్డ్ ఢిల్లీ రోడ్, మెహ్రౌలి రోడ్, బసాయ్ రోడ్ తదితర ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. భారీ వర్షంతో నగరంలోని ప్రధాన రహదారులు నీటితో నిండిపోయాయి. వరద నీటిలో వాహనాలు చిక్కుకోవడంతో పలువురు వాహనదారులు వాటిని అక్కడే వదిలి వెళ్లాల్సి వచ్చింది. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పాఠశాలల నుంచి ఇళ్లకు తిరిగి వెళ్తున్న విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లపై భారీగా నీరు నిలవడంతో బురద నీటిలో కనిపించని ఓపెన్ మ్యాన్‌హోల్స్‌లో పడకుండా ఉండేందుకు ఎత్తైన బస్‌స్టాప్‌లు, ఇతర సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. వర్షం కారణంగా ఢిల్లీజైపూర్ ఎక్స్‌ప్రెస్‌వేపై కూడా ట్రాఫిక్ తీవ్రంగా ప్రభావితమైంది. రహదారి వెడల్పుగా ఉన్నప్పటికీ వాహనాలు నెమ్మదిగా కదిలాయి. సాధారణంగా సిగ్నేచర్ టవర్ నుంచి హీరో హోండా చౌక్ వరకు సుమారు 15 నిమిషాల్లో చేరుకునే ప్రయాణానికి కనీసం 50 నిమిషాలు పట్టిందని ప్రయాణికులు తెలిపారు. సైబర్ హబ్ సమీపంలో గేట్‌వే టవర్ మెట్రో స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ఎక్స్‌ప్రెస్‌వేలోని కొంత భాగం పూర్తిగా నీట మునిగిపోయింది. దీంతో నగరంలోని ప్రధాన రహదారుల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గురుగ్రామ్‌ను మిలీనియం సిటీగా పిలుస్తారు. భారీ అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాల్స్, ప్రముఖ కంపెనీల కార్యాలయాలకు ఈ నగరం ప్రసిద్ధి. అయితే కొద్దిసేపు భారీ వర్షం కురిసినా మౌలిక వసతులు దెబ్బతినడం, రోడ్లు జలమయం కావడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాకాలంలో ఇప్పటికే వరదలకు గురయ్యే ప్రాంతంగా మారిన శీత్లా మాతా రోడ్ కూడా తాజా వర్షాలతో తీవ్రంగా ప్రభావితమైంది. ప్రతి సారి కొంత ఎక్కువ సమయం వర్షం కురిసినప్పుడు నగర మౌలిక వసతులు కుప్పకూలుతున్నాయని గురుగ్రామ్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఇరాన్‌లో భారీ గ్యాస్ నిక్షేపాలు!

**టెహ్రాన్, ఆగస్టు 24:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితులు ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న చమురు డిమాండ్ నేపథ్యంలో తాజాగా ప్రపంచ దేశాలకు ఇరాన్‌నుంచి భారీ ఉపశమనం లభిస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో యుద్ధం కారణంగా తీవ్రంగా సతమతం అవుతున్న ఇరాన్‌కు భారీ ఉపశమనం కలిగించే వార్త ఒకటి వచ్చింది. అమెరికా ఆంక్షలతోపాటు. ఇంధన ఎగుమతులపై ఆంక్షలు, యుద్ధ పరిస్థితులతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఇరాన్‌కు భారీ గ్యాస్ నిక్షేపం వెలుగులోకి రావడం ఊరటనిచ్చే పరిణామంగా మారింది. దక్షిణ ఫార్స్ ప్రావిన్స్‌కు సమీపంలోని ఓగ్యాస్ క్షేత్రంలో ఏకంగా 7.5 ట్రిలియన్ క్యూబిక్ ఫీట్లకు పైగా సహజ వాయువు ఉన్నట్లు గుర్తించినట్లు ఇరాన్ చమురు మంత్రి మొహ్సెన్ పక్నెజాద్ వెల్లడించారు. ఈ చమురు నిక్షేపాలను వాణిజ్యపరంగా వినియోగించుకోవడం ఇరాన్‌కు అంత సులభం కాదని నిపుణులు భావిస్తున్నారు. దేశీయంగా గ్యాస్ వినియోగం అధికంగా ఉండటంతో పాటు పాతబడిన మౌలిక వసతులు, విదేశీ పెట్టుబడులపై ఆంక్షలు, ఆధునిక టెక్నాలజీ వంటి సమస్యలు ఇరాన్ ఇంధన రంగాన్ని తీవ్రంగా వేధిస్తున్నాయి. తాజాగా గుర్తించిన నిక్షేపం ఈ పరిస్థితుల్లో ఇరాన్‌కు దీర్ఘకాలికంగా కీలకంగా మారే అవకాశం ఉంది. ఆ గ్యాస్‌ను వెలికితీసి మార్కెట్‌కు తీసుకురావడానికి భారీ పెట్టుబడులు, ఆధునిక డ్రిల్లింగ్ టెక్నాలజీ కావాల్సి ఉంటుంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో అంతర్జాతీయ సంస్థల నుంచి పెట్టుబడులు, టెక్నికల్ సహకారం పొందడం ప్రస్తుతం ఇరాన్‌కు సవాలుగా మారింది. తాజా ప్రకటనకు ముందు గతేడాది అక్టోబర్‌లో దక్షిణ ఇరాన్‌లోని పజాన్ గ్యాస్ ఫీల్డ్‌లో 10 ట్రిలియన్ క్యూబిక్ ఫీట్ల గ్యాస్ ఉన్నట్లు తేలింది. కనీసం 200 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు కూడా ఉన్నట్లు ఇరాన్ ప్రకటించింది. అందులో సుమారు 7 ట్రిలియన్ క్యూబిక్ ఫీట్ల గ్యాస్‌ను వెలికితీయగలమని అంచనా వేసింది. అక్కడ ఉత్పత్తి ప్రారంభించేందుకు దాదాపు 40 నెలలు పట్టవచ్చు అప్పట్లోనే ఇరాన్ అధికారులు తెలిపారు. ఇరాన్ ప్రస్తుతం తన గ్యాస్ అవసరాల్లో ప్రధానంగా ఖతార్‌తో పంచుకుంటున్న సౌత్ పార్స్ గ్యాస్ ఫీల్డ్‌పై ఆధారపడుతోంది. యుద్ధ పరిస్థితుల్లో ఈ కీలక ఇంధన మౌలిక వసతులపై దాడులు జరగడం ఆ దేశ ఇంధన రంగంపై మరింత ఒత్తిడిని పెంచింది. ఇరాన్ చమురు ఎగుమతులపై అమెరికా ఆంక్షలు మరింత కఠినంగా మారడంతో దేశానికి విదేశీ మారకద్రవ్య ఆదాయంపై ప్రభావం పడుతోంది. 2026 మార్చి నుంచి జూలై మధ్య చమురు విక్రయాల ద్వారా వచ్చిన 7.5 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్య ఆదాయాన్ని ఇరాన్ కేంద్ర బ్యాంకుకు బదిలీ చేసినట్లు స్థానిక మీడియా పేర్కొంది.

# సరికొత్త మొక్కజొన్న వంగడం

>> తగ్గించి, స్వదేశీ పరిజ్ఞానంతో ఆహార భద్రత మరియు స్వయం సమృద్ధిని సాధించడం అత్యంత కీలకమైన అంశం అన్నారు. భారతదేశం భవిష్యత్తులో పాప్‌కార్న్ దిగుమతి చేసుకోకుండా ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతోందని ప్రశంసలు అందుతున్నాయన్నారు. దేశ జీడీపీ, స్థూల విలువ జోడింపు లో వ్యవసాయ రంగం సుమారు 1/5వ వంతు వాటాను కలిగి ఉండటమే కాకుండా, 46.1 మందికి ఉపాధిని, 55 జనాభాకు జీవనాధారాన్ని అందిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోందన్నారు. ఈ క్రమంలో 8 రాష్ట్రాల్లో దాదాపు 17,500 మంది రైతులు 40,000 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తూ, ఎటువంటి అప్పుల ఊబిలో పడకుండా మంచి లాభాలు అర్జిస్తున్నారన్నారు. రైతు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎంకిసాన్, పిఎం ఫసల్ బీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డులతో పాటు మహిళా సంఘాలకు ఆధునిక సాంకేతికతను జోడించే నమో డ్రోన్ దీదీ వంటి పథకాలు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయన్నారు. అదే సమయంలో, వ్యవసాయాభివృద్ధికి సిఎం చంద్రబాబు నాయుడు రైతు బజార్లు, సహజ వ్యవసాయం వంటి విధానాల ద్వారా అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమన్నారు. దీనికితోడు భవిష్యత్ వ్యవసాయ సమృద్ధి కోసం దక్షిణ భారత నదుల అనుసంధానం మరియు అన్ని జిల్లాలకు సమగ్ర సాగునీటి సౌకర్యాల కల్పన అత్యంత ఆవశ్యకమని స్పష్టమవుతోందన్నారు. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ముసునూరులో దేశంలోనే మొట్టమొదటి నాణ్యమైన, నాన్‌జీఎమ్ఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాలను ఆవిష్కరించడం మరియు 8 రాష్ట్రాల ఉత్తమ రైతులకు సన్మానం చేయడం సంతోషకరమన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, ఆహార భద్రతకు రైతాంగమే వెన్నెముక అని, 140 కోట్ల మందికి అన్నం పెడుతూ 45 శాతం మందికి వ్యవసాయ రంగం ఉపాధి కల్పిస్తోందని గుర్తుచేశారు. వరి, గోధుమల తర్వాత మొక్కజొన్న దేశంలో 3వ అతిపెద్ద పంటగా నిలుస్తోందని, ఎల్‌నినో వంటి వాతావరణ సవాళ్లను తట్టుకునేలా పరిశోధనలు మరింత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భారతీయ వాతావరణానికి అనువైన హైబ్రిడ్ విత్తనాలను అభివృద్ధి చేసి, ఐసిఎఆర్ ప్రశంసలు పొందిన "గౌర్మెట్ పాప్‌కార్నికా" సంస్థను అభినందించారు. ఈ సంస్థ 8 రాష్ట్రాల్లోని 17,500 మందికి పైగా రైతులతో 39,500 ఎకరాల్లో సాగుచేస్తూ, గతంలో అర్జెంటీనా, బ్రెజిల్‌లకు వెళ్లే ఆదాయంలో 70 శాతం నేరుగా మన భారతీయ రైతులకు దక్కేలా చేస్తోందని, తద్వారా 100 మిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేస్తోందని కొనియాడారు. అరకు కాఫీ లాగే ఈ పాప్‌కార్న్ కూడా ప్రపంచ స్థాయి బ్రాండ్‌గా ఎదగాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. సిఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ మన రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విలువ జోడించే ప్రక్రియను చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు పిలుపునిచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియ ద్వారా ఉత్పత్తులకు విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలిగి సంపద సృష్టికి ఆస్కారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని సీఎం స్పష్టం చేశారు. ఏ ."రైతులపై ఉన్న ప్రేమ, అభిమానంతో ఏలూరు జిల్లాకు వచ్చి రైతులు పండిస్తున్న జన్యుమార్పిడి జరగని మొక్క జొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారన్నారు. గార్మె పాప్ కార్న్ సంస్థ భారత నేలపైనే దేశీయంగా జన్యుమార్పిడి జరగని విత్తనాలను రైతులతో కలిసి ఉత్పత్తి చేస్తోంది. మన నూజివీడు గడ్డ నుంచే పండే పాప్ కార్న్ మొక్క జొన్న దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతుంది. గార్మె పాప్ కార్న్ దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ఉత్పత్తి సంస్థగా అవతరించింది. ఈ సంస్థ ప్రతినిధుల్ని అభినందిస్తున్నాను. 17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ నాన్ జీఎంఓ హైబ్రిడ్ మొక్కజొన్న ఉత్పత్తి చేస్తున్నారు. నూజివీడు సమీపంలోని ముసునూరు వద్ద దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయటం సంతోషదాయకం. దేశవ్యాప్తంగా పాప్ కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉన్న గార్మె సంస్థకు అభినందనలు తెలిపారు.. యాంత్రీ కరణ, విత్తనాలు, సాగులో సాంకేతికత, రైతుల నుంచి మొక్క జొన్న కొనుగోలు ఇలా అన్నీ వ్యవస్థీకృతంగా ఉన్నాయన్నారు. ఇప్పటి వరకూ మనం కొనుగోలు చేసిన పాప్ కార్న్‌పై పెద్ద ఎత్తున బ్రెజిల్ సహా ఇతర దేశాలకు వెళ్లింది. ఇక నుంచి మన దేశంలోనే ఈ సంపద ఉంటుందని,. ఒక్క ఆసియానే కాదు గ్లోబల్ మార్కెట్ కు కూడా మన పాప్ కార్న్ ఎగుమతి కావాలన్నారు. ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ తాగేలా రైల్వే స్టేషన్లలోనూ కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతామన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన పంటలకు విలువ జోడించి ఎగుమతి చేయాలన్నదే మా లక్ష్యం. పసుపు, మిరప, మొక్క జొన్న, ఆక్వా తదితర ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌కు చేరాలి. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెస్ చేసి విలువ జోడించి ఓ మంచి బ్రాండ్‌తో అంతర్జాతీయ మార్కెట్లకు తరలిద్దాం. అప్పుడే విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుంది." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ప్రాసెసింగ్ పెరిగితేనే ఉత్పత్తులకు విలువ**

"ప్రస్తుతం మన రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న వాటిలో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చేయగలుగుతున్నాం. ప్రాసెసింగ్ పెంచితే అధిక సంపదను ఆర్జించే ఆవకాశం ఉంటుంది. ప్రత్యేకించి యువత ఈ రంగంపై దృష్టి పెట్టాలి. ప్రతి కుటుంబంలో ఓ పారిశ్రామిక వేత్త రావాలి. మన వద్ద ఉత్పత్తి అయ్యే వాటిని గ్లోబల్ ప్రాడెక్టుగా అభివృద్ధి చేయాలి. ఆహారపు అలవాట్ల అనుగుణంగా పంటలు కూడా మారాలి. నూజివీడు వద్ద ఇప్పుడు పామాయిల్, కోకో ఆక్వా లాంటి వాణిజ్య పంటలు పెరిగాయి. వ్యవసాయంతో పాటు ఉద్యాన పంటల్లో మనం అగ్రగామిగా మారాం. వచ్చే 2030 యేళ్లలో ఎలాంటి పంటలు ఉండాలి, ఎలాంటి ఆర్థిక వ్యవస్థ ఉండాలో మనం నిర్దేశించు కుందాం. రాయలసీమను కూడా ఉద్యాన పంటల హబ్‌గా మార్చేలా కార్యాచరణచేపట్టాం. ఈ యేడాది ఎల్ నినో ప్రభావం ఉన్నా గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి పంటలను కాపాడాం. చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేస్తే ఈ ప్రాంత భవిష్యత్తు కూడా మారుతుంది. వెలిగొండ ప్రాజెక్టును ఈ నెలాఖరులోనే ప్రారంభించి మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాకు నీరు ఇస్తాం. నీటి భద్రత సాధించి ప్రతి ఎకరాకూ నీరు ఇచ్చేలా చర్యలు చేపడతాం. దేశం అంతా నదుల అనుసంధానం జరిగి నీటి సద్వినియోగం జరగాలన్నది ఎన్డీఏ ప్రభుత్వ ఆలోచన. గోదావరి కృష్ణా, తుంగభద్ర, పెన్నా కావేరీ నదులను అనుసంధానించటం ద్వారా 4 రాష్ట్రాల్లో సమస్య పరిష్కారం అవుతుంది. గంగా, మహానది, గోదావరి నదుల్ని కూడా అనుసంధానించుకుంటే వేల టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోగలం. అప్పుడు దేశానికి తిరుగులేదు. నీటి భద్రత సాధిస్తే దేశ అభివృద్ధి అన్

# కృష్ణా జలాలు

>> రాలేదని తెలిపారు. సెప్టెంబర్ 4న మళ్లీ సమావేశమై చర్చిస్తామన్నారు.తొలుత ఈ నెల 13న సమావేశం అయ్యేందుకు తేదీని ఖరారు చేశారు. తర్వాత 17కు వాయిదా పడింది. ఆ సమయంలో ఏపి అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మరోసారి వాయిదా పడింది. దీంతో నేడు ఈ భేటీని నిర్వహించారు. శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నీటినిల్వలు, రెండు రాష్ట్రాల అవసరాలపై చర్చించారు. తాగునీటి కోసం చెరిసగం వాడుకోవాలని సమావేశంలో ప్రస్తావించింది. అయితే ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా సెప్టెంబర్4న మరోసారి భేటీ కావాలని నిర్ణయించారు.

# బ్రిక్స్ అధినేతల సమావేశానికి భారత్‌కు వస్తున్న జిన్‌పింగ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** ఢిల్లీలో సెప్టెంబర్‌లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలలో పాల్గొనేందుకు భారత్‌కు వస్తున్న జిన్‌పింగ్ తనవెంట మెగా ప్రతినిధి బృందాన్ని కూడా తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశాలకు సభ్య దేశాలను భారత్ ఆహ్వానించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌సైతం రాబోతున్నారు. అయితే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వస్తున్నారా లేదా అన్నది ఇప్పటి దాకా తేలలేదు. తాజాగా భారీ బృందంతో భారత్‌కు వస్తున్నట్లుగా రాయిటర్స్ తెలిపింది. డోక్లాం ఘర్షణ తర్వాత దాదాపు ఏడేళ్ల తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రాబోతున్నారు.

దీంతో బ్రిక్స్ సమావేశాలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకోనున్నాయి. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో జరగనున్నాయి. జిన్‌పింగ్ వచ్చే నెలలో బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీకి వస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ పర్యటన ముఖ్యమైనదని భారత్‌చైనా మధ్య మెరుగుపడుతున్న సంబంధాలకు సంకేతమని రాయిటర్స్ పేర్కొంది. జిన్‌పింగ్ హాజరు ఎంత ముఖ్యమైనదంటే బ్రిక్స్ సదస్సు కంటే ఆయన గురించే ఎక్కువగా చర్చ జరిగే అవకాశం ఉంది. ఇరు దేశాలు ఇటీవల కొన్ని చర్చలు జరిపాయి. ఈ సమయంలో అజిత్ దోవల్ కూడా చైనాలోనే ఉన్నారు. పలు ముఖ్యమైన చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## వారం - వర్జ్యం

25-08-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, ముఖకార్తె
తి.ద్వాదశి ఉ.6.21
న.ఉత్తరాషాఢ రా.10.49
వ.రా.3.08-తె.4.52
దు1. ఉ.8.24-ఉ.9.14
దు2. రా.11.27-రా.12.17
రాహు మ.3.00-సా.4.30 శుభ లేదు

## వార్తాఫలం

**మేషం :** దూరప్రాంత ప్రయాణాలు, వీసా పాస్పోర్ట్ వంటి అంశాలు కలిసి వస్తాయి. విందు, వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు.

**వృషభం :** ఉన్నత స్థానంలోని వారు మీ సలహాలను, సూచనలను పాటిస్తారు. జరిపే చర్చలు ఫలిస్తాయి. వ్యాపారాలు విస్తరిస్తాయి.

**మిథునం :** గణితానికి సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవడం మంచిది. తండ్రి నుండి ధనలాభం.

**కర్కాటకం :** గృహావసరాలకు గాను ధన వ్యయాన్ని అధికంగా చేస్తారు. వీసా పాస్పోర్ట్ వంటి అంశాలు కలిసి వస్తాయి.

**సింహం :** న్యాయబద్ధమైన మీ వాదనలకు సంబంధిత అధికారుల అండదండలు లభిస్తాయి. ధనాన్ని పొదుపు చేస్తారు.

**కన్య :** వ్యక్తిగత పురోభివృద్ధికి ఉపకరించే లిఖితపూర్వక ఒప్పందాన్ని సానుకూల పరచు కోగలుగుతారు. దూర ప్రయాణాలు.

**తుల :** ఉన్నత స్థానంలో ఉన్నవారు సహాయ సహకారాలను అందిస్తారు. నూతన అవకాశాలు కలిసివస్తాయి. వాటిని సద్వినియోగం.

**వృశ్చికం :** మీలో పోటీతత్వం పెంపొందుతుంది. చిన్నచిన్న విషయాలను కూడా నిర్లక్ష్యం చేయరు. తాకట్టులను విడిపిస్తారు.

**ధనుస్సు :** వృత్తి, ఉద్యోగ వ్యక్తిగత వ్యవహారాల తాలూకు బరువు బాధ్యతలు అలసటకు వత్తిడికి గురి చేస్తాయి.

**మకరం :** ప్రజా సంబంధాలు అధికంగా కలిగినటువంటి వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంటుంది. గృహనిర్మాణాల ఆలోచనలు.

**కుంభం :** రాజకీయ స్నేహాలు ఉపకరిస్తాయి. తనఖా వస్తువులను విడిపిస్తారు. ఆవేశాన్ని కలిగి ఉంటారు. కుటుంబ ప్రోత్సాహం.

**మీనం :** క్రీడారంగంలోని వారికి అనుకూలంగా ఉంటుంది. మీలో పోటీతత్వం పెంపొందుతుంది. ప్రముఖుల కలయిక.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




రాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న దృశ్యం. చిత్రంలో సిఎం చంద్రబాబు ఉన్నారు

# కారుమూరికి జ్యుడీషియల్ రిమాండ్

>> న్నారు. ఇదే కేసులో ఇప్పటికే కారుమూరి కుమారుడు సునీల్‌కుమార్‌తో పాటు వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డిని ఇడి అధికారులు అరెస్టు చేశారు. మద్యం రవాణా కాంట్రాక్టులో భారీగా అక్రమాలు జరిగినట్లు ఇడి ఆరోపణలున్నాయి.రవాణా ధరను కిలోమీటర్‌కు రూ.13 నుంచి రూ.35కు పెంచినట్లు ఇడి అధికారులు గుర్తించారు. సుమారు రూ.195.33 కోట్ల మేర అక్రమ లబ్ధి పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. సునీల్‌కుమార్ ఇంట్లో రోలెక్స్ వాచీలు, రేంజ్ రోవర్ స్వాధీనం చేసుకున్నారు. హవాలా లావాదేవీల్లో కారుమూరికి రూ.15 కోట్లు చేరినట్లు ఇడి దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. కారుమూరికి సంబంధించిన రూ.87.7 కోట్ల ఆస్తులను ఇప్పటికే ఇడి జప్తుచేసింది. ఈ కేసులో తనకు ఎలాంటి సంబంధం లేదని కావాలనే రాష్ట్ర ప్రభుత్వం తనపై కుట్రలు చేస్తోందని కారుమూరు నాగేశ్వరరావు ఆరోపిస్తున్నారు. ఇక ఈ కేసులో విచారణ జరిపిన సిట్ కోస్తాంధ్రలో రవాణా వాహనాల కోసం సుదర్శన్ కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థతో సిగ్మా సంస్థ ఒప్పందం కుదుర్చుకుందని తెలిపింది. ఈ సంస్థను నాటి మంత్రి, వైఎస్సార్సీ నేత కారుమూరి నాగేశ్వరరావు రంగంలోకి దించారని తన కుమారుడు కారుమూరి సునీల్, కోడలు కీర్తి ఆ సంస్థతో మరో ఒప్పందం చేసుకున్నట్లు సృష్టించారని గుర్తించింది. పేరుకే సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ తప్ప నిర్వహణ మొత్తం కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీలే చూసుకున్నారని సిట్ దర్యాప్తులో తేలింది. ఈడీ విచారణలోనూ ఇదే వెల్లడైంది. సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ సంస్థ వల్లు సందీప్ అనే వ్యక్తిదని సిగ్మా నుంచి ఆ సంస్థ ఖాతాల్లోకి రూ.68 కోట్లు చేరగా అందులోంచి రూ.15 కోట్లు కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీల్, కోడలు కీర్తి ఖాతాల్లోకి జమైనట్లు వెల్లడైంది. మరికొంత సొమ్ము నగదు రూపంలో వారికి అందినట్లు ఇడి గుర్తించింది. రెండు నెలల క్రితం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేసిన సోదాల్లో ఈ హవాలా లావాదేవీల ఆధారాలు, సుదర్శన్ కన్‌స్ట్రక్షన్‌తో కుదిరినట్లు చెబుతున్న ఒప్పంద పత్రాలు లభ్యమయ్యాయి. ఒప్పందపత్రం అసలైనదేనా? హవాలా లావాదేవీల ఇతర వివరాలేంటనే కోణంలో ఇడి దర్యాప్తు ముమ్మరం చేస్తోంది.

# మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కీలక ఫెసిలిటేటర్‌గా వ్యవహరించారు: ఇడి

**విజయవాడ.ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం రవాణాలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కీలక ఫెసిలిటేటర్‌గా వ్యవహరించారని ఇడి తెలిపింది. కారుమూరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఇడి ప్రకటించింది. ప్రభుత్వ ఖజానాకు రూ.195 కోట్ల నష్టం జరిగిందని కేసు నమోదైనట్లు వెల్లడించింది. మద్యం రవాణా నిబంధనలను కొన్ని సంస్థలకు అనుకూలంగా మార్చారని ఇడి స్పష్టం చేసింది. సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్స్ ఫ్రంట్ సంస్థలుగా పనిచేశాయని తెలిపింది. కారుమూరి, సునీల్, డమ్మీ సబ్ కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేశారని తెలిపింది. సుదర్శన కనస్ట్రక్షన్స్ ద్వారా నిధులు మళ్లించినట్లు ఇడి ఆరోపణలు చేసింది. కారుమూరి, కుటుంబసభ్యుల ఖాతాలకు బదిలీ చేసినట్లు దర్యాప్తులో తేలిందని స్పష్టం చేసింది. అక్రమ ఆదాయాన్ని లగ్జరీ కార్లు, ఖరీదైన వాచీలకు ఖర్చు చేశారని తెలిపింది. స్థిరాస్తుల కొనుగోలు, రాజకీయ నిధులు, వ్యక్తిగత ఖర్చులకు వాడారన్న ఇడి తెలిపింది. ఇప్పటికే రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డి, సునీల్‌కుమార్‌ను ఇడి అరెస్టు చేసింది. ఇప్పటికే రూ.37.79 కోట్ల విలువైన ఆస్తులు అటాచ్ చేసినట్లు ఇడి వెల్లడించింది. కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని ఇడి అధికారులు వెల్లడించారు.

# భారీగా ఎసిబి దాడులు

>> ఎసిబి అధికారులు స్పష్టం చేశారు. పూర్తిస్థాయి నివేదిక అందాక తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. ఇదిలా ఉంటే ఇంజనీరింగ్ విభాగంలో అధికారుల ఫోన్లను ముందుగానే స్వాధీనం చేసుకొని, ఏ అధికారిని, సిబ్బందిని బయటకు పోనీకుండా ఉంచి అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చిన ఫైళ్లు మొత్తం స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇటువంటి అవకతవకలు జరిగిన, అవినీతి కార్యకలాపాలపై, అధికారులు లంచం డిమాండ్ చేసిన వెంటనే 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం అందించాలని, సమాచారం అందుకున్న వెంటనే దాడులు చేయటం జరుగుతుందని ఎసిబి అధికారులు వెల్లడించారు. ప్రజలు లంచాలు ఇచ్చి అధికారులను ప్రోత్సహించవద్దు అని కోరారు.

# నిందితుడు సాదిక్ అరెస్టు

>> వచ్చింది. ఈ ఘటనలో రియాన్స్ ప్రాణాలతో బయటపడగా, మిగిలిన వారి ఆచూకీపై ఆందోళన నెలకొంది. ఈ ఘటనపై రాజమహేంద్రవరం టు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సూసైడ్ నోట్లు స్వాధీనం చేసుకున్నారు.సూసైడ్ నోట్ ఆధారంగా తమ మరణానికి సాదిక్ ఖాన్ వేధింపులే కారణమని, అలాగే జగదీష్ రెడ్డికి సాదిక్ ఖాన్ కెమికల్ పాయిజన్ ఇచ్చి చంపాడని పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

**మీరట్‌లో నిందితుడి అరెస్ట్..**

విశ్వసనీయ సమాచారం ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందం ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ చేరుకుంది. స్థానిక పోలీసుల సహకారంతో ఈ నెల 22న ఉదయం సుమారు 9 గంటలకు నౌచండి పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతంలో షేక్ సాదిక్ ఖాన్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం మీరట్‌లోని చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో నిందితుడిని హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్ తీసుకున్నారు. అనంతరం నిందితుడిని కాకినాడకు తీసుకొచ్చి కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**పలు కోణాల్లో కొనసాగుతున్న దర్యాప్తు..**

మృతుల సూసైడ్ నోట్లు, నిందితుడి పాత్ర, జగదీష్ రెడ్డి మరణానికి సంబంధించిన కారణాలు, అనుమానాస్పద అంశాలు, మతమార్పిడికి సంబంధించిన ఆరోపణలు, మృతులపై నిందితుడు చేసినట్లు పేర్కొన్న బెదిరింపులు తదితర అంశాలపై పోలీసులు సమగ్ర దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా మొబైల్ ఫోన్లు, డిజిటల్ ఆధారాలు, సిసిటివి ఫుటేజ్, కాల్ డేటా రికార్డులు, వైద్య రికార్డులు, బ్యాంకు లావాదేవీలు తదితర ఆధారాలను శాస్త్రీయంగా పరిశీలిస్తున్నారు.

# ఆన్‌లైన్ సేవలు ఇక సులభతరం

>> నీటి వరకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని చెప్పారు. అటు మలేరియా, డెంగీ కేసుల నివారణకు హాట్ స్పాట్‌లు గుర్తించి, నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. అయితే గత యేడాది ఇదే సమయానికి 1,361 డెంగీ కేసులు నమోదైతే... ఈ యేడాది ఇప్పటికి 401 కేసులు నమోదైనట్టు అధికారులు తెలిపారు.ప్రజారోగ్యం విషయంలో అశ్రద్ధ ఉండకూడదన్నారు.తరుణ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని మందులన్ని సిద్దంగా ఉంచుకోవాలని సిద్ధం చేసారు. మరోవైపు రాష్ట్రంలో కార్బన్ న్యూట్రల్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే రెన్యువబుల్ ఎనర్జీపై ఎక్కువ దృష్టి పెట్టాలని అధికారులకు సిఎం సూచించారు. సోలార్ రూఫ్ టాప్‌లు పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే కారిడార్

>> పోలవరం, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాలలోని..కురుపాం, పార్వతీపురం, సాలూరు, మక్కువ, అరకు, పాడేరు, చింతపల్లి, గోకవరం, కన్నాపురం, జంగారెడ్డిగూడెం, దేవరపల్లి, కామవరపుకోట, ద్వారకా తిరుమల, నూజివీడు మీదుగా ఆగిరిపల్లి దగ్గర అమరావతి ఔటర్‌రింగ్ రోడ్‌లో కలుస్తుంది.ఈ కారిడార్‌కు సంబంధించి ఐదు జిల్లాల్లో అవసరమైన భూసేకరణకు సంబంధించిన బాధ్యతల్ని జాయింట్ కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్ వంటి అధికారుల్లో ఎవరినైనా నియమించనున్నారు. ఇప్పటికే పార్వతీపురం మన్యం, తూర్పుగోదావరి జిల్లాలకు సంబంధించి భూసేకరణ అధికారులను ఎంపికచేసి గెజిట్ జారీ చేసేందుకు మోర్త్ ఉన్నతాధికారులకు ఆ వివరాలను పంపారు. త్వరలోనే మిగిలిన జిల్లాల అధికారుల పేర్లను మోర్త్‌కు పంపిస్తారు. భూసేకరణ 90 మీటర్ల వెడల్పుతో చేయనున్నారు. అలాగే గంటకు 110 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో వెళ్లేలా ప్లాన్ చేశారు. ఈ కారిడార్ మొత్తానికి ప్రాజెక్ట్ వ్యయం రూ.75,629 కోట్లు. కేంద్రం ఈ కారిడార్ ప్రాజెక్ట్‌ను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే మంజూరు చేయడంపై ఫోకస్ పెట్టింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ పశ్చిమబెంగాల్, ఒడిశాలలో కూడా అలైన్‌మెంట్‌పై స్పష్టత వచ్చాక ఖరారు చేయనున్నారు.ఖరగ్‌పూం- అమరావతి కారిడార్‌లో దాదాపు 457 కిలోమీటర్లు రహదారి ఆంధ్రప్రదేశ్ మీదుగానే వెళుతుందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఏపీకి రవాణా రంగంలో వేగవంతమైన పురోగతి సాధిస్తుందన్నారు. ఈ కారిడార్ ఏపీకి చాలా కీలకమని చంద్రబాబు అన్నారు.

# హిందూ ధర్మంపై దాడికి కుట్ర



## ఎపి బిజెపి అధ్యక్షుడు పివిఎన్.మాధవ్

**విజయవాడ, ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధర్మం, దేవాలయ వ్యవస్థలను నాశనం చేసేందుకు పెద్ద కుట్ర జరుగుతోందని, శబరిమల పవిత్రతను కాపాడటానికి అయ్యప్ప భక్తులు, హిందూ సమాజం నడుం బిగించాలని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన అయ్యప్ప గురుస్వాముల రాష్ట్ర సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, నాస్తికులు, కొందరు అన్యమతస్థులు హిందూ ధర్మంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. గతంలో తిరుమలలో ఏడుకొండలను రెండు కొండలుగా మార్చేందుకు, ఆచారాలను మార్చేందుకు ప్రయత్నాలు జరిగాయని గుర్తుచేశారు. అప్పుడు హిందూ సమాజం పోరాడి తిరుమల పవిత్రతను కాపాడుకుందని, అదే స్ఫూర్తితో ఇప్పుడు శబరిమల రక్షణకు కూడా పోరాడాలన్నారు. 'స్వామియే శరణమయ్యప్ప అంటూనే, ధర్మాన్ని నాశనం చేసే శక్తుల పీచమణిచేందుకు కూడా సిద్ధం కావాలి' అని ఆయన ఉద్బోధించారు. ఈ సమావేశంలో పాల్గొన్న టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప భక్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తా మని హామీ ఇచ్చా రు. కేరళలోని ప్ర భుత్వం మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని విమర్శించారు. గతంలో టీటీడీ నిధులపై జరిగిన చర్చను ప్రస్తా విస్తూ, 'వెంకటేశ్వర స్వామి వడ్డీ కాసుల వాడే కానీ,వడ్డీ వ్యాపారి కాదు' అని తాను అధికారు లకు స్పష్టం చేసినట్లు తెలిపారు. టీటీడీ చట్టం ప్రకారం ఇతర దేవాలయాల్లో అన్నప్రసాదం అం దించేందుకు అవకాశం ఉందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేలా మాధవ్‌తో చర్చిస్తామన్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ సహకారంతో భక్తులు లేవనెత్తిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఇది కేవలం అయ్యప్ప భక్తుల సమస్యకాదని, యావత్ హిందు వుల సమస్యగా భావించి పరిష్కారం కోసం కలిసి కట్టుగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

# కుటుంబ సభ్యుల వివాదాన్ని రాజకీయం చేస్తున్నారు: మాజీ మంత్రి జోగి రమేష్

**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** తమ కుటుంబ సభ్యుల నడుమ వివాదాన్ని రాజకీయం చేస్తున్నారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ ఆరోపించారు. తన కుటుంబంలో కుమారుడు,కోడలు మధ్య తలెత్తిన వివాదంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడు రాజీవ్, కోడలు మేఘన మధ్య ఉన్న విభేదాలను కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఒక టీడీపీ ఎమ్మెల్యే ప్రమేయం ఉందంటూ వీడియో ద్వారా ప్రకటన విడుదల చేసారు. జోగి రమేశ్ మాట్లాడుతూ, 'నా కోడలు మేఘన కుటుంబ సభ్యులు మైలవరం టీడీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కార్యాలయానికి వెళ్లారు. కేవలం నా కుటుంబాన్ని రాజకీయంగా లక్ష్యంగా చేసుకోవాలనే దురుద్దేశంతోనే ఈ వివాదంలోకి రాజకీయాలను లాగుతున్నారు' అని ఆరోపించారు. ఇది తనను, తన కుటుంబ సభ్యులను మానసిక ఇబ్బందులకు గురిచేసేందుకు జరుగుతున్న కుట్ర అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

జోగి రమేశ్ చేసిన ఆరోపణలపై మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ స్పం దించారు. ప్రజాప్రతినిధిగా తన కార్యాలయానికి ఎవరైనా రావొచ్చని, ఆ క్రమంలోనే మేఘన కుటుంబ సభ్యులు కూడా తనను కలిశారని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఈ ఆరోపణ లకు సంబంధించి పూర్తి వివరాలతో స్పష్టత ఇస్తానని ఆయన వెల్లడించారు. ఈ పరిణా మాలతో జోగి రమేశ్ వ్యక్తిగత కుటుంబ వివాదం కాస్తా వైసీపీ, టీడీపీ నేతల మధ్య పరస్పర రాజ కీయ ఆరోపణలకు దారితీసింది.

# ఎన్నికల షెడ్యూల్ పేరుతో దుష్ప్రచారం



## ఎస్ఇసి అనిల్‌చంద్ర పునేఠా

**విజయవాడ,ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** 'స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ పేరుతో దుష్ప్రచారం జరుగుతుందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారి (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్ అంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతుందన్నారు. ఈ మేరకు ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. కీలకంగా వాట్సాప్‌లో తిరిగే ఎన్నికల తేదీలను నమ్మవద్దు అని ఆయన తెలిపారు. తప్పుడు ప్రచారం చేసేవారిపై సైబర్ చట్టాల కింద కేసులు నమోదు చేస్తామన్నారు. ఇంకా ఎన్నికల ఓటరు జాబితా వెల్లడి ,రిజర్వేషన్ల కల్పన తదితరంశాలపై నిర్ణయాలు స్పష్టం జరగవలసి ఉందన్నారు. ఇవన్నీ పూర్తయిన తరువాత ఎన్నికల నిర్వహణంశం కొలిక్కి వస్తుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల సమాచారం మీడియా ద్వారానే వెల్లడిస్తామని వివరించారు. అధికారిక ప్రకటన వచ్చేవరకు ఇలాంటి వాటిని నమ్మవద్దు అని ఎస్ఈసీ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నకిలీ జీవోలు, షెడ్యూల్‌ను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్న వారిపై ఇప్పటికే సైబర్ నేర పరిధిలో ఫిర్యాదులు చేసామన్నారు. బాధ్యులను గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నిర్వహణ షెడ్యూల్ అంశంపై తమను సంప్రదించాలని ఎస్ఈసీ మీడియాకు విజ్ఞప్తి చేసారు.

# మైలవరంలో ఫేక్ ఫుడ్ ఆఫీసరు బెదరింపు

**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరంలో ఓ హోటల్‌లో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పేరుతో ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. హోటల్‌ను సీజ్ చేస్తామని, తనిఖీ సమయంలో తీసిన వీడియోలను మీడియాలో ప్రచారం చేస్తామని బెదిరింపులకు దిగాడు. డబ్బులు డిమాండ్ చేయడంతో పోలీసులను బాధితుడు ఆశ్రయించాడు. ఆధునిక టెక్నాలజీ సురక్షా 360 సీసీ టీవీ కెమెరాల ద్వారా సదరు వ్యక్తి కారును పోలీసులు గుర్తించారు. ఆ కారును స్వాధీనం చేసుకున్న సమయంలో తుపాకీ లాంటి ఒక బొమ్మ పిస్టల్‌ను గుర్తించారు. అది సిగరెట్ లైటర్ మాత్రమే అని, నిజమైన తుపాకీ కాదని పోలీసులు నిర్ధారించారు. ఫేక్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కుంభా గోవిందును పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

# ఓ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులపై కేసు నమోదు

**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులపై సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేశారు. 2023 అక్టోబర్‌లో ఈ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అప్పయమ్మ అనే వృద్ధురాలు మృతి చెందింది. అయితే అర్హత లేని వైద్యులు చికిత్స అందించడం వల్లే తన తల్లి మరణించిందని బాధితుడు కృష్ణమూర్తి కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో, విజయవాడ మూడో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు సదరు వైద్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


# ఇంద్రకీలాద్రిపై రూ.13కోట్లతో రెండో ఘాట్‌రోడ్డు



**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రం బెజవాడ ఇంద్రకీలాద్రిపై రెండో ఘాట్‌రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. ఈ గిరిపై కొలువైన కనకదుర్గమ్మ తల్లి సన్నిధికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండో ఘాట్ రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేసారు. ఈ క్రమంలో దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం, ఆర్అండ్‌బీ శాఖ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ (ఎన్ఐఆర్ఎం)సంయుక్త ఆధ్వర్యంలో రెండవ ఘాట్‌రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. కొత్త ఘాట్‌రోడ్డు నిర్మాణానికి రూ.13 కోట్లతో బడ్జెట్ అంచనాలను ఆర్అండ్‌బీ సిద్ధం చేసి దేవస్థానానికి ఇచ్చింది. త్వరలో డీపీఆర్ తయారీ బాధ్యతలను ఆర్అండ్‌బీ ద్వారా ఓ సంస్థకు అప్పగించను న్నారు. ప్రస్తుతం దుర్గా ఘాట్ ఎదురుగా ఉన్న ఘాట్‌రోడ్డును 50 ఏళ్ళ పూర్వం నిర్మించారు. అప్పటితో పోలిస్తే ఆలయా నికి వచ్చే భక్తులు, వాహనాల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఈ మార్గం తీవ్ర రద్దీని ఎదుర్కొంటోంది. హైదరాబాద్ వైపు నుంచి ఎన్‌హెచ్65 మీదుగా వచ్చే మార్గంలో కనకదుర్గ ఫ్లైఓవర్ కింద కుమ్మరిపాలెం జంక్షన్ దాటిన తర్వాత కొత్త ఘాట్‌రోడ్డు ప్రారంభం కానుంది. కొండపై ప్రస్తుతం ఉన్న 'ఓం టర్నింగ్' వద్ద కలిసేలా ప్రతిపాదనలు రూపొందించారు. దీంతో ఆలయానికి వెళ్లే వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి రానుంది. దుర్గగుడి ఈవో వి.కె. శీనానాయక్‌ను వివరణ కోరగా, రెండో ఘాట్‌రోడ్డుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆర్అండ్‌బీ, ఎన్ఐఆర్ఎం అధికారులతో ఇప్పటికే సమీక్ష నిర్వహించామని, దసరా ఉత్సవాల అనంతరం ఈ ప్రాజెక్టుపై పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తామని వెల్లడించారు.

# అభివృద్ధిని ఓర్వలేక గొడ్డలిపార్టీ అరాచకాలు

## వైసిపి నేతల అక్రమాలపై కఠినచర్యలు: మంత్రి అనగాని



**తిరుపతి,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధిదిశగా పనిచేసుకువెళుతుంటే వైసిపి గొడ్డలిపార్టీ నేతలు ఓర్వలేక అరాచకాలకు పాల్పడుతోందని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. అక్రమాలకు,అవినీతికి పాల్పడి, భూకబ్జాలు చేసిన వాళ్ళు పెద్దమనుషులుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. తిరుపతి ప్రజలు వైసిపి నేతల అక్రమాలు తెలుసుకున్నారని అన్నారు. సోమవారం మధ్యాహ్నం ఓ హోటల్‌లో మీడియా సమావేశం మంత్రి అనగాని నిర్వహించారు. తిరుపతికి సమీపంలోని దామినేడు భూములకు కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా పరిష్కరిస్తున్నామన్నారు. మఠానికి సంబంధించి నటువంటి భూములకు కూడా సమస్యల్ని పరిష్కరించేలా చూస్తున్నామన్నారు. గొడ్డలి పార్టీ నేతలకు ప్రజలు బాగుండడం ఇష్టం లేదని, కులాల మధ్య మతాల మధ్య,నాయకుల మధ్య అధికారుల మధ్య చిచ్చులు పెడుతున్నారని తీవ్రంగా మండిపడ్డారు. రాజకీయంగా దమ్ము ధైర్యంతో ఎదుర్కోవాలని,అడ్డదారుల్లో వ్యక్తిగతంగా ఎవరినీ విమర్శించొద్దని మంత్రి హితవు చేశారు. గతంలో తిరుపతిలో వైసిపి నేతలు భూములను దోచుకున్నట్టు విజిలెన్స్ విచారణలో తేలిందన్నారు. తిమ్మనాయుడుపాలెం, మంగళం ,తిరుచానూరు వివిధ ప్రాంతాలలో భూకబ్జాలు పాల్పడ్డారని ఆయన తెలిపారు. వైసిపి నేతలు చేసిన పాపాలు పండే రోజులు దగ్గరపడ్డాయని, తిరుపతి ప్రశాంతతకు భంగం వాటిల్లేలా వైసిపి నేతలు ప్రతి రోజూ ఏదో ఒక రాద్ధాంతం చేస్తున్నారని దుయ్యబట్టారు. మీలాంటి వాళ్ళు ఎంతమంది వచ్చినా తిరుపతి ప్రజలకు హాని చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని మంత్రి అనగాని ఘాటుగా హెచ్చరించారు. డిఎస్సీ పై తప్పుడు లెక్కలు చెబుతున్నారని, దుష్ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. 16,263 మందికి ఉద్యోగాలు ఇచ్చామని, తొలి సంతకం చేసింది చంద్రబాబు డిఎస్సీ పైనే అని తెలుసుకోవాలన్నారు. వైసిపికి 18 స్థానాలు ఉంటేనే ప్రతిపక్ష హోదా అనేది తెలుసుకోవాలని,రానున్న ఎన్నికల్లో పార్టీ జెండా కూడా కనిపించదన్నారు.

# పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం: హోంమంత్రి అనిత



**తిరుమల,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మహిళల భద్రతతోబాటు పోలీసుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. తిరుపతి నగరంలో నూతనంగా నిర్మించిన మహిళా పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభించుకోవడం సంతోషమన్నారు. ఆ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అవగాహన బోర్డులు కూడా ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంపొందించేలా ఉన్నాయని పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఆమె కుటుంబంతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఇక్కడ పోలీస్ కమిషనరేట్ ప్రతిపాదనల్లో ఉందని హోంమంత్రి పేర్కొంటూ పుణ్యక్షేత్రాలకు నిలయమైన తిరుపతి జిల్లాలో నేరాల శాతం బాగా తగ్గిందని, కొత్త జిల్లాల్లో నూతన మహిళా పోలీస్టేషన్ల నిర్మాణం జరుగుతోందని హోంమంత్రి అనిత తెలిపారు.

# డ్రోన్ బ్యాటరీ తగిలి హోంమంత్రికి స్వల్పగాయం

**తిరుపతి,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో అట్టహాసంగా ప్రారంభమైన అమరావతి ఛాంపియన్‌షిప్ కార్యక్రమంలో అపశృతి చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితకు ఓ డ్రోన్‌కు చెందిన బ్యాటరీ ప్రమాదవశాత్తు ఆమె చేతిపై పడటంతో స్వల్ప గాయమైంది. అమరావతి ఛాంపియన్‌షిప్ 2026 కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో ఓ డ్రోన్‌కు సంబంధించిన బ్యాటరీ ఛార్జింగ్ తగ్గిపోయింది. దాంతో ఆ డ్రోన్ కిందికి పడిపోగా, దాంట్లోని బ్యాటరీ ఊడి, నేరుగా వేదికపై ఉన్న మంత్రి అనిత కుడిచేతిపై పడింది. ఈ అనూహ్య ఘటనతో అక్కడున్న అధికారులు, భద్రతా సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే అప్రమత్తమైన తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు మంత్రి అనితకు ప్రథమ చికిత్స అందించి, గాయమైన చేతికి బ్యాండేజ్ వేశారు. చేతికి గాయమైనప్పటికీ అనిత బ్యాండేజ్‌తోనే తన ప్రసంగాన్ని పూర్తి చేశారు. ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించారు. ప్రమాదానికి కారణమైన డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సాంకేతిక లోపం వల్లే ఈ ప్రమాదం జరిగిందనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటన నేపథ్యంలో విఐపిల భద్రత, కార్యక్రమాల్లో డ్రోన్ల వినియోగంపై ఉన్న నిబంధనలను సమీక్షించనున్నట్లు తెలుస్తోంది.

# ఏషియా బుక్ ఆఫ్‌రికార్డ్స్‌లో ఎపి మల్టీస్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్

## అమరావతి ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం





**తిరుపతి/తిరుపతి క్రీడ,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి చేపట్టిన ప్రతిష్టాత్మక మల్టీ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ కార్యక్రమం నూతన రికార్డు సృష్టించింది. రాష్ట్రవ్యాప్తంగా తిరుపతి వేదికగా నిర్వహించిన ఈ క్రీడా పోటీల్లో భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం ద్వారా ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అధికారికంగా స్థానం సంపాదించింది. 175 నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రాథమిక పోటీల్లో సుమారు 2,07,000 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో సుమారు 84,000 మంది పోటీపడగా, ప్రతిభ కనబరిచిన 9,911 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 12 క్రీడా విభాగాల్లో అండర్-17, అండర్-23 కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాల, ఇంటర్మీడియట్, డిగ్రీ, యూనివర్సిటీ స్థాయిల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికితీయడమే ఈ క్రీడల పోటీల లక్ష్యంగా నిర్దేశించారు.

తిరుపతి ఎన్టీఆర్ స్టేడియం వేదికగా అమరావతి ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి, తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, క్రీడల శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ,శాప్స్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు జ్యోతిప్రజ్వలనతో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడ, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా అమరావతి ఛాంపియన్‌షిప్‌ను రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు 92లక్షల రూపాయలు ప్రైజ్ మనీతో బాటు గుర్తింపు, ప్రోత్సాహకాలు అందించనున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం సహకారంతో రాష్ట్రంలోని క్రీడా మైదానాల అభివృద్ధికి 2025లో 75కోట్లు కేటాయించారని, ఈ ఏడాది కూడా సుమారు 200-250 కోట్ల వరకు నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. వచ్చే మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతులను భారీగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. క్రీడా కోటా రిజర్వేషన్‌ను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచడంతో పాటు, డీఎస్సీ ద్వారా 382 క్రీడా కోటా పోస్టులను భర్తీ చేసి ఉపాధ్యాయ ఉద్యోగాలకు అవకాశం కల్పించినట్లు మంత్రి తెలిపారు. హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ రాష్ట్రంలోని పాఠశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మట్టిలో మాణిక్యాలైన క్రీడా ప్రతిభను తీసుకురావడంలో శాప్స్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ క్రీడలతో విద్య-విద్యతో ఉద్యోగం అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. శెట్టిపల్లిలో సుమారు 20 ఎకరాల్లో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటు కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, ఎం ఎల్ సి లు బల్లి కల్యాణ చక్రవర్తి, కంచర్ల శ్రీకాంత్, రాం భూపాల్ రెడ్డి, తిరుపతి,చిత్తూరు జిల్లాల ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, పులివర్తి నాని, ఆదిమూలం, బొజ్జల సుధీర్ రెడ్డి, నెలవల విజయశ్రీ, మురళి మెహన్, పాశం సునీల్, ఆరవ శ్రీధర్, గురజాల జగన్మోహన్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, తదితర ప్రజాప్రతి

# విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

## ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం వహించే క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి హెచ్చరించారు. ఎస్పీడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సిఎండి జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా సంస్థ పరిధిలోని 9 జిల్లాల నుంచి 56 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను విన్నవించారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో సర్వీసుల మంజూరులో జాప్యం వహించే అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని సంబంధిత నోడల్ ఆఫీసర్లను సిఎండి ఆదేశించారు. ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభాల మార్పు, ఓల్టేజ్ సమస్యలు, పేరు మార్పిడి తదితర సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే వాటిని పరిష్కరించాలని సూచించారు. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్ఏసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, ఆర్. పద్మ, ఎం. మురళి కుమార్, ఎన్. శోభా వాలెంటీనా, సిహెచ్ రామ చంద్ర రావు, కే. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, జగదీష్, భాస్కర్ రెడ్డి, హేమలత, లత, పిఆర్ఓ

# రెండో రోజు పరీక్షకు 73 శాతం హాజరు

**తిరుపతి, ఆగస్టు24ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పీడిసిఎల్ పరిధిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న నియామక పరీక్ష రెండో రోజు సోమవారం 73శాతం మంది హాజరయ్యారు. ప్రశాంత వాతావరణంలో ఈ పరీక్షలు జరిగిందని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఎస్పీడీసీఎల్ పరిధిలోని 21 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 2,427 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి వుండగా, 1,779మంది ఈ పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు.

# మృతుల కుటుంబాలకు డి.సిఎం పవన్, ఎమ్మెల్యే నానాజీ ప్రగాఢ సానుభూతి

**కాకినాడ రూరల్, ఆగస్టు 24 ప్రభాత వార్త:** సూర్యరావుపేట ఎన్టీఆర్ బీచ్ వద్ద అలల ఉధృతికి నలుగురు యువకులుగల్లంతై, ఇద్దరు మృతి చెందినఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. వారి ఆదేశాల మేరకు రెస్క్యూ బృందాలు, గజఈతగాళ్లు, మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి ఇద్దరి మృతదేహాలనువెలికితీశారు. సురక్షితంగా బయటపడిన మరో ఇద్దరు యువకులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే నానాజీ తనయుడు పంతం సందీప్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకులను పరామర్శించి, మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని సందీప్ భరోసా

# 2029లో ఆలూరు గడ్డపై టిడిపి జెండా ఎగరాలి

## స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలి


## సాగు, తాగునీటిపై ప్రత్యేక దృష్టి

## మంత్రులు నిమ్మల రామానాయుడు, సవితమ్మ



సోమవారం ఆలూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

**ఆలూరు,ఆగస్టు 24, ప్రభాతవార్త:** రాబోయే 2029 ఎన్నికలలో ఆలూరు గడ్డపై టిడిపి జెండా రెపరెపలాడాలని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ అన్నారు. సోమవారం ఆలూరులోని ఆర్ అండ్ బి అతిథి గృహం ఆవరణ నందు జరిగిన నియోజకవర్గ టిడిపి నాయకుల సమన్వయ సమావేశానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సమన్వయంతో పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆలూరు నియోజకవర్గానికి ఇన్‌చార్జి మంత్రిగా తనతో పాటు మంత్రి సవితమ్మను పంపించారని తెలిపారు. ఈ సమావేశానికి జనసేన ఇన్‌చార్జి వెంకప్ప, బీజేపీ ఇన్‌చార్జి తిమ్మప్ప, రాష్ట్ర బోయ వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బుజ్జమ్మ, ఇతర కార్పొరేషన్ల చైర్మన్లు, ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వర్లు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పాత్రికేయులకు మంత్రి నిమ్మల రామానాయుడు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ, మూడు పార్టీలు ఒకే మాటపై నడవడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇదే ఐక్యతను కొనసాగించి అత్యధిక స్థానాలలో విజయాలను సాధించాలన్నారు. 2029 ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ఇప్పటి నుంచే పటిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం ఆర్థికంగా తీవ్రంగా వెనుకబడిందని రామానాయుడు విమర్శించారు. రాయలసీమలో సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని రామానాయుడు తెలిపారు. ఆలూరు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామని, సుమారు రూ.1,607 కోట్ల విలువైన పనులను రెండేళ్లలో పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎన్నికలలోపు పనులను పూర్తి చేసి ప్రజలకు సాగు, తాగునీటి సౌకర్యం మెరుగుపరచడమే లక్ష్యమన్నారు. కర్నూలు పశ్చిమ ప్రాంతాన్ని సుభిక్షంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల మద్దతు అవసరమని రామానాయుడు కోరారు.




# విస్తృతంగా సేవా కార్యక్రమాలు: ఆవుల ఈశ్వర్ రెడ్డి

**తిరుపతి,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లాలో లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీ శ్రీనివాస సేవలు మరింత విస్తృత పరు స్తామని, పేదలను ఇతోధికంగా ఆదుకోవడమే ఈ క్లబ్ ప్రధాన లక్ష్యమన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీశ్రీనివాస చాప్టర్ నూతన అధ్యక్షుడిగా ఆవుల ఈశ్వర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ఉదయం ఓ హోటల్‌లో లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతిని ధులు విజయభాస్కర రెడ్డి, రాజారెడ్డి నేతృత్వం లో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. వెంటనే ఈశ్వర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అనం తరం లయన్స్ పిన్ గావెల్ , హామర్‌ను జోన్ ఇంచార్జ్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా లయన్ ఇంటర్నేషనల్ ప్రతినిధి రాజారెడ్డి మాట్లాడుతూ నూతన సభ్యత్వం పొం దిన సభ్యులను పరిచయం చేసి వారి విధి విధానాలను తెలియజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నో నూతన కార్యకలాపాలు నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలియజేశారు.

వార్త

యువతను మోసగించడం తేలిక. ఎందుకంటే వారు తొందరగా ఆశలు పెంచుకొని భ్రమల్లో పడిపోతారు.

న- అరిస్టాటిల్


# వంటబట్టని 'పట్ట' భద్రత

'చదివిన చదువు ఒకటైతే చేసే ఉద్యోగం వేరు' అనుకుంటూ చాలా కాలంగా నిరుద్యోగులు సద్యోగులుగా మారి కాలం గడిపేసారు. సద్యోగమంటే మంచి ఉద్యోగం. ఏమాత్రం ఉపాధి లభించినా ఎలాగోలా బతికేస్తారులే అని సరిపెట్టుకునే రోజులు పోయాయి. సాధారణ డిగ్రీలుగా పేరుపడిన బిఎ, బికాం, బిఎస్సీ కోర్సులు ప్రస్తుత పరిస్థితుల్లో కాలం చెల్లినవిగానే చెప్పుకోవాలి. అంతకన్నా మంచి విజ్ఞానం లభించే కోర్సులకు ప్రత్యేక రూపకల్పనంటూ ఏమీ లేదు. ఆర్ట్స్, సైన్స్ అని విడి విడిగా ఉండే ఆయా సబ్జెక్టులను అటు చేసి ఇటు చేసి కాంబినేషన్‌లు మార్చి కొత్త కోర్సుల రూపకల్పన జరుగుతోందే తప్ప మరో ప్రయత్నం కానరాదు. పనికి రావని ఉద్యోగ ప్రవేశాల సమయంలోనే తెలియవస్తోంది. ఆ తర్వాత మళ్లీ అనుబంధ కోర్సులు తప్పనిసరి. వాటిపై అవగాహన పెంచుకుంటేనే ఏదో ఓ ఉపాధి దొరుకుతుంది. లేదంటే అంతే. బతుకు బస్టాండ్‌లో వెళ్లదీయాల్సిందే. పూర్వం అయితే 'సత్ర భోజనం మఠం నిద్ర' అనే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడాపరిస్థితి లేదు. కఠోర శ్రమ ద్వారా విద్యావంతులై ఆపై ఉన్నత ఉద్యోగాల్లోకి వెళ్లిన వారు లేకపోలేదు. అలాంటి వారు బహుతక్కువ. అందుకనే విద్యావిధానంలో కోర్సుల్లోనూ మార్పులు రావాల్సిన అవసరం ఉందంటుంటాం. కానీ అసలు సిసలు లోపమెక్కడుందో కనిపెట్టడానికి వేగిరం పూనుకోలేం. సంస్కరణలు చేపట్టలేం. అదే జరిగితే ఉన్నత విద్యావంతులంతా ఉత్తమ ఉద్యోగ పీఠాలు ఎక్కేవారే. దానాదీనా ఇటీవల 'నీతి అయోగ్' వెల్లడి చేసిన రిపోర్టులో 'సాధారణ డిగ్రీలకు ఉపాధి దొరక్క ఉద్యోమూ దక్కదంటూ చేసిన వ్యాఖ్యానాలను బట్టి భారతీయ విద్యావిధానం డొల్లతనం అర్థమవుతోంది. భారతదేశంలో 15 నుంచి 29 ఏళ్ల మధ్య యువత 8.7 కోట్ల మంది నిరుద్యోగులుగా ఉన్నా వారి ఆర్థిక పరిస్థితుల కారణంగా వారు ఏమీ పనిచేయకుండా ఖాళీగానే ఉన్నారని నీతి అయోగ్ స్పష్టం చేసింది. వికసిత్ భారత్ కోసం 'నైపుణ్యాభివృద్ధి పునఃకల్పన 2047' పేరిట నీతి ఆయోగ్ విడుదల చేసిన పుస్తకంలో ఎన్నో ఆసక్తికర అంశాలున్నాయి. 2021లో తన 78వ జాతీయ శాంపిల్ సర్వే ఆధారంగా ఈ నివేదిక రూపుదిద్దుకుంది. దేశంలో 8.5శాతం మంది పట్టభద్రులకే వారి అర్హతకు తగిన ఉపాధి దొరుకుతోంది. మిగిలిన వారికి తగిన ప్రాక్టికల్ నైపుణ్యత లేక పోవడంతో ఉపాధి మృగ్యమౌతోంది. 2014-15 నుంచి ప్రస్తుతం వరకు 7.67 కోట్ల మందికే సరైన శిక్షణ లభించినట్లు తేటతెల్లం చేసింది. చాలా మంది తమకు ఆర్థిక స్తోమతలేక సంప్రదాయ 'డిగ్రీ' కోర్సులు చదివాకతక్కువ వేతనాలకు చిన్నాచితకా ఉద్యోగంలో చేరి కుటుంబాన్ని పోషించుకుంటూ లేక చదువుల లక్ష్యాన్ని మరచిపోతున్నారు. అదీ గత్యంతరం లేక. ఇది నిజమేకావచ్చు. కానీ ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయా?లేవా? అన్నది ప్రశ్న. యువత చదివిన చదువుల్లో పసలేదని వారి అత్తెసరు చదువులకు వాళ్లే బాధ్యులని చెప్పడమే అసలు బాగోలేదు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకున్న వారెవరూ వారి చదువులను పక్కన బెట్టడంలేదు. భవిష్యత్తుకోసం ఆరాటపడుతూనే ఉన్నారు. కానీ వాళ్ల చదువులే వాళ్లకు శాపంగా ఉన్నాయనే ధోరణిలో నివేదికల విశ్లేషణలు సమంజసం కాదు. ప్రధానంగా విద్య నేర్చుకున్న వారందరికీ ఉపాధి లభించకపోవడానికి కారణాన్ని ఆ నివేదికలో విశ్లేషిస్తూ కళాశాలల్లో బోధించే సిలబస్‌కు,పరిశ్రమల వాస్తవ అవసరాలకు మధ్య ఏమాత్రం పొంతన ఉండటం లేదన్నది నీతి ఆయోగ్ ఉవాచ. చాలా విద్యాసంస్థల్లో పాఠ్యప్రణాళికలు కాలం చెల్లినవిగా ఉండి నేటి పారిశ్రామికావసరాలకు తగినట్టుగా లేవన్నదినివేదిక సారాంశం. ఇదంతా ఇలా ఉంటే ఉద్యోగవకాశాలు పరిమితంగా ఉన్నందున కూడా నిరుద్యోగుల్లో పోటీ వలన సంక్షోభానికి కారణమని నీతి ఆయోగ్ చెబుతోంది. వారి నివేదికలో ఒక ఉదాహరణను జోడిస్తూ ఇటీవల కేవలం 55 వేల ప్రభుత్వ పోస్టుల కోసం ఏకంగా 1.86 కోట్ల దరఖాస్తులు రావడం నిరుద్యోగ సమస్య తీవ్రతను తెలియచేస్తోంది. ఇలా వృత్తి ఉద్యోగాలేమీ లేకుండా ఖాళీగా ఉన్నవారిని 'నీట్' కేటగిరిగా విభజించింది. ఈకేటగిరీలో ఉన్న 88 శాతం మంది గృహసంబంధిత 'ఇంటిపనుల్లో' నిమగ్నమై ఉన్నారని పేర్కొంది. అంటే వారెవరికీ మంచి ఉద్యోగాల శిక్షణ ఏమీలేనందున ఖాళీగా ఉన్నారని చెబుతూనే వాళ్లకు శిక్షణనిచ్చే అవకాశాలను ప్రధానంగా చర్చించింది. దేశంలోని వర్క్‌ఫోర్స్‌ను పాఠశాల విద్యార్థులో, ఉన్నత విద్య, ఫార్మల్, ఇన్‌ఫార్మల్ వర్కర్లు, 'నీట్' యువత మహిళలు అనే ఐదు విభాగాలుగా విభజించి నైపుణ్య శిక్షణ ఇవ్వాల్సిన ఆవశ్యకతను తెలియచేస్తోంది. ప్రభుత్వమే వారికి ఆర్థిక సహాయం చేయాలని సూచిస్తోంది. ఆయా రాష్ట్రాలు తమ ప్రాంతానికి అవసరమైన స్కిల్స్, నేర్పే దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలని స్పష్టం చేసింది. మార్కెట్ డిమాండ్‌కు తగినట్లుగా నేటి పట్టభద్రులు తమ నైపుణ్యాలను పెంచుకుంటేనే పేద, మధ్య తరగతి విద్యార్థులకు కాలేజీ ఫీజులు భరించడమే కష్టమౌతున్న తరుణంలో కొత్తగా కోర్సులు నేర్చుకోవడం వారి తలకుమించిన భారమౌతోంది. ఈ నేపథ్యమేవారిని ప్రభుత్వ ఉద్యోగాల కోసం వెంపర్లాడే పరిస్థితి తెస్తోంది. అవేమీ కానరాక కేవలం కాగితం 'పట్టా'లతో తృప్తి పొందుతున్నారు. ఆ తర్వాత 'పని'కి రాకుండాపోతున్నారు. ఈ దేశ యువశక్తిని సక్రమంగా వినియోగించే దిశగాఆలోచనచేసి 'పట్టా' లిచ్చే కర్మాగారాలస్థానే 'స్కిల్డ్' శిక్షణనిచ్చి ప్రభుత్వమే వారికిఉద్యో గాలివ్వడం వల్ల యువతలో నైరాశ్యం తొలగుతుంది. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 8.23 లక్షలకుపైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఇటీవలనే సమాచారం బయట కొచ్చింది. వీటిని భర్తీ చేస్తే కొంతమందికైనా కొలువులు దొరకుతాయి కదా!



యుద్ధ వినాశన కాలంలో, ఆ మారణహోమం సమయంలో ఏ అమెరికా పౌరుడు భోగభాగ్యాలను సంపాదిస్తూ మత్తెక్కి ఉండకూడదని విశ్వసిస్తాడు.

రూజ్‌వెల్ట్



రాకుమారులు యుద్ధం గురించి మాత్రమే అధ్యయనం చేయాలి. వారికి శాంతి ఓ ఆటవిడుపు. మరో యుద్ధానికి సంసిద్ధత అవడానికి అవకాశం.

మాకియవెల్లి

# సంస్కరణలే కాదు, నిత్యం నిఘా ముఖ్యం!

***ఈ మధ్యన నేరాలకు అలవాటుపడ్డవారికి సైబర్ క్రయిం తేలిక అనిపిస్తుంది! అలాంటి నేర ప్రవృత్తి ఉన్న వారికి సహకారం అందించి, తెలివితేటలతో, చేతికి మట్టి అంటకుండా డబ్బు సంపాదించే వారిసంఖ్య ఎక్కువయింది! వీరి మీద నిఘా మరింత అవసరం! రాష్ట్రాల పరిధులను దాటి జైళ్లల్లో స్నేహాలు పెంచుకొనే అనుభవజ్ఞులైన నేరస్థుల మీద జైలు అథార్టీలు, పోలీసులు ఎక్కువ నిఘా ఉంచక తప్పదు! గొలుసులు తెంపుకొని పోయేవారు, కార్లు, స్కూటర్లు దొంగిలించే వారు, మాయమాటలు చెప్పి సొమ్ము అపహరించే వారు ఇలాంటి వారికై పోలీసులు అప్రమత్తంగా వుండక తప్పదు! ఇలాంటి వారే జైలులో నేరాలు నేర్పరితనంలో నిష్ణాతులైన పాత నేరస్థుల దగ్గర శిక్షణ పొంది బయటకు వస్తారు! వారిని నిరంతరం నేరాలు చేయ కుండా అదుపులో వుంచుకోవటానికి పోలీసులు ఒక కన్నేసి వుండకతప్పదు! నేరాలు, నిఘా,నేరస్థులూ, పోలీసులూ, జైలులోపల, బయట, ఆనేర ప్రపంచమే మరో లోకం లాంటిది!***



రావులపాటి సీతారాంరావు

పోలీసుల సంస్కరణల గురించి చాలా చర్చలు దేశంలో జరిగాయి! ప్రస్తుతం మేధావులు, మీడియా ఫోకస్ పెట్టాల్సింది, జైళ్ళలో సంస్కరణల గురించి! ఈమధ్యన విచ్చల విడిగా పెరుగుతున్న నేరాల వెనక ఏం జరుగుతున్నది అని శోధిస్తే జైళ్ల ల్లో వున్న నిందితులు, నేరస్థులే 'క్రయిం' అనే అగ్నికి ఆజ్యం పోస్తున్నట్లుగా అనేక ఉదంతాలు సోదాహరణలతో సహా బయటకు రావటం దీర్ఘంగా, లోతుగా ఆలోచించాల్సిన అంశంగా కనపడుతున్నది! సంస్కరించబడాల్సిన నేరస్థులు జైళ్లల్లో వృత్తి నైపుణ్యాలకు పదును పెట్టుకుంటున్నారన్న వార్త విభ్రాంతి కలగజేయటమే కాదు ఆధునిక జీవన శైలికి అలవాటుపడినవారికి కలవరపాటు కలిగిస్తున్నది! అంతా బాగుంది, సాంకేతికంగా అభివృద్ధి పథంలో పయనిస్తున్నాం సంస్కరణలు అన్ని శాఖలలో చేపట్టాం అని చంకలు గుద్దుకుంటున్న ప్రభుత్వాలూ, సంబంధిత అధికారులూ, ఒక్క క్షణం ప్రసిద్ధి గాంచిన జైళ్ళ వైపు దృష్టి మరల్చి లోతుపాతులలోకి వెళ్తే నేర సంబంధిత నైపుణ్య చరిత్రలో దేశం ఎంతగా కూరుకొనిపోయి వుందో ఇట్టే అర్థమవుతుంది! కానీ ఆ విషయం మీద దృష్టి పెట్టే అధ్యయనపరులూ, అనుభవజ్ఞులు కనుమరుగవటంతో ఈ విషయం నివురు గప్పిన నిప్పులా వుంది! జైళ్లల్లో కొత్తగా నేరాలు ఆపాదించబడిన వారు, కొద్దిపాటి శిక్షలు పడినవారూ, పశ్చాత్తాపంతో కృంగిపోతూ, జైలు గోడలు దాటగానే బుద్ధిగా వుండాలనే మానసిక దృక్పథంతో సహజంగానే వుంటారు! నేరస్థులుగా ముద్రించబడటం అలాంటి వారిని కృంగదీస్తుంది! కొత్తగా జైలు గోడలు మధ్య అడుగు పెట్టిన వారికోసమే సంస్కరణలు విజ్ఞులు తలపోసారు! ఓపెన్ ఎయిర్ జైళ్ళు అందుకోసమే నిర్మించారు! జైలులో కృంగిపోతూ, నిరంతరం చేసిన తప్పును గురించి ఆలోచించకుండా, బయటనే ఆకాశం, ప్రకృతి, చెట్లూ, చేమలు చూస్తూ జైలు జీవితం మరిచిపోయేలా చేసే ప్రయత్నమే ఓపెన్ ఎయిర్ జైళ్ళ ప్రయోగం! సేద్యం చేయటం, పంటలు పండించటంతో పాటు చదువు కోవటం, పరీక్షలురాయటం, డిగ్రీలు సంపాదించుకొని బయటకు వచ్చి నేర ప్రవృత్తిని పూర్తిగా వదిలేసి నేర రహిత జీవితాన్ని గడిపేందుకు అవకాశాలు కల్పించాలనే ఆలోచన చాలా గొప్పది! కానీ ఎంత వరకు ప్రభుత్వాలు ఈ విషయంలో సఫలీకృతులవుతున్నారనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది! సైబర్ క్రయిం వచ్చింతర్వాత ఈ నేరాల తర్ఫీదు జైళ్లల్లోనే లభ్యపడుతున్నదనే విషయం గూడా ఈమధ్య వెలుగులోకి వస్తున్నది! 'హేబిట్యుయల్ అఫెండర్స్' పేరుతో (హెచ్.ఓస్) (పోలీసు పరిభాషలో) నిరంతరం నేరాలు చేసేవాళ్లను రికార్డుల కెక్కిస్తారు! దోషియర్ క్రిమినల్స్ (డి.సి) లాంటి గుర్తింపుతో క్రయిం రికార్డ్ బ్యూరోలలో జిల్లాలలో, రాష్ట్ర పరిధులను, దేశ పరిధులను అతిక్రమించి చేసే వారిని జాబితాల్లో నమోదు కాబడుతాయి! నేషనల్ క్రయిం రికార్డ్ బ్యూరోలో వారి చరిత్ర నిక్షిప్తపర్చ బడివుంటుంది! ఈ రికార్డులకు తోడు కొత్తగా సైబర్ క్రైం నేరస్థుల జాబితా గూడా ప్రత్యేకంగా చేర్చబడింది! హేబిట్యుయల్ అఫెండర్స్ జైళ్లల్లో కొత్తవారిని చేరదీసి, మాయమాటలతో లొంగదీసుకొని జైళ్ళ బయటకు వెళ్ళగానే ఏవిధంగా లింక్లు ఏర్పరుచుకొని నేరా లు చేయాలనే 'జ్ఞానాన్ని' వారు



ప్రసాదిస్తున్నారు! కొత్తవారు అవిధంగా బయటకు వచ్చింతర్వాత గూడా మరిన్నినేరాలు, మరింత అనుభవంతో చేయటానికి సాహసిస్తున్నారు. జైళ్ళ ల్లో నిఘా బయటకు రాగానే ఏర్పరిచే పోలీసుల నిఘాతో బాటు, జైళ్ళల్లో వుండే నేరస్థుల్లో గూడా కొందరు పోలీసు లకు ఇన్ఫార్మెంట్సుగా మారి అవసరమైన 'క్లూస్' యిచ్చే సహకారం గూడా అందిస్తున్నమాట ప్రక్కనపెడితే ఏవిధంగా జైళ్ళల్లో మరింత కట్టుదిట్టంగా ఇలాంటి నేరప్రక్రియను ఆపు చేయాలనే అంశం మీద దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్ప డింది! ఈ మధ్యన తెలంగాణా పోలీసుల దృష్టికి నేరస్థుల జైలు లింకులు కొన్ని కేసుల ద్వారా బయటకు వచ్చాయి.! ఒక నేరస్థుడు, జైలు నుంచి బయటకు రాగానే, అమాయకుడైన కారు డ్రైవర్ను పెద్ద రెంట్‌ను చెల్లించి, ఆ కారుడ్రైవర్ వాష్ రూంకు వెళ్ళినప్పుడు ఆ కారుతో ఉడాయించిన సంగతి, మరో కారును అతను దొంగిలించినప్పుడు బయట పడింది! సిద్ధిపేట పోలీసులు ఈ కేసులను పరిష్కరించటంతో జైళ్ళల్లో నేరస్థుల లింక్లు బాగా బయటకు వచ్చాయి! సుదర్శన్ అనే ఈ నేరస్థుడికి జైలులో వున్న ఒరిస్సా నేరస్థుడితో స్నేహం ఏర్పడిన తర్వాత విడుదల అయిన సుదర్శన్ ఒరిస్సాకు వెళ్ళి అక్కడ నేరస్థులతో సంబంధాలు ఏర్పరుచుకొని వివిధ రకాల నేరాలకు పాల్పడిన విషయం పోలీసుల దర్యాప్తులో తేలింది! నేరస్థుడితో జైలులో ఏర్పడిన సంబంధాలు, జైలు బయటకు వచ్చే నేరస్థుడికి బాగా ఉపయోగపడ్డాయి! కొత్తగా పెళ్ళయిన పిల్ల మంగళ సూత్రం చైన్ స్నాచర్లు తెంపుకొని పోవటంతో ఆ పిల్ల తల్లిదండ్రులు, సెంటిమెంట్ దృష్టిలో పెట్టుకొని బాధపడ్తుంటే అనుభవజ్ఞుడైన పోలీసు ఆఫీసర్ 'మీ అమ్మాయి మంగళసూత్రం తప్పక దొరుకుతుంది' అని హామీ యిచ్చి ఆ సాయంత్రాని కల్లా ఆ మంగళ సూత్రం చెక్కు చెదరకుండా తీసుకొని వచ్చి ఇవ్వగానే పిల్ల తల్లిదండ్రులు ఆ ఆఫీసర్ను దేవుడిగా భావించారు! పోలీసు ఆఫీసర్కు క్రితం రోజు రాత్రి జైలు నుంచి బయటకు వచ్చిన నేరస్థుడు మరో నేరస్థుడు ఇలాంటి దొంగతనాలలో ఆరితేరిన వాడని చెప్పిన సంగతి జ్ఞప్తికి తెచ్చుకొని తనకు ఆచూకీ ఇచ్చిన నేరస్థుడి సహకారంతో మంగళ సూత్రం దొంగిలించిన నేరస్థుడిని పట్టుకో గలిగాడు. జైలు నుంచి బయటకు వచ్చే నేరస్థుల మీద నిరంతర నిఘా అవసరం! అనుభవజ్ఞులైన క్రయిం పర్యవేక్షించే పోలీసులు చేసే పని అదే! అయితే నిఘా, ఇన్ఫా ర్మెంట్సును డెవలప్ చేసే విధానాలు, బయట మంచిగా బ్రతుకుదామని వచ్చే నేరస్థులను టార్గెట్ చేయగూడదు!. నిజానికి బయటకు వచ్చే నేరస్థుల్లో చాలామంది బుద్ధిగా బయట బ్రతుకుదామని వచ్చేవారే ఎక్కువ మంది! వారికి ఉపాధి కల్పించే అవకాశాన్ని అధికారులూ ప్రభుత్వమూ, సంస్కరణల్లో ఒక భాగంగా తీసుకోక తప్పదు! ఈమధ్యన నేరాలకు అలవాటుపడ్డవారికి సైబర్ క్రయిం తేలిక అనిపి స్తుంది! అలాంటి నేర ప్రవృత్తి వున్న వారికి సహకారం అందించి, తెలివితేటలతో, చేతికి మట్టి అంటకుండా డబ్బు సంపాదించే వారి సంఖ్య ఎక్కువయింది! వీరి మీద నిఘా మరింత అవసరం! రాష్ట్రాల పరిధులను దాటి జైళ్ళల్లో స్నేహాలు పెంచుకొనే అనుభవజ్ఞులైన నేరస్థుల మీద జైలు అథార్టీలు, పోలీసులు ఎక్కువ నిఘా ఉంచక తప్పదు! గొలుసులు తెంపుకొని పోయేవారు, కార్లు, స్కూటర్లు దొంగి లించే వారు, మాయ మాటలు చెప్పి సొమ్ము అపహరించే వారు ఇలాంటి వారికై పోలీసులు అప్రమత్తంగా వుండక తప్పదు! ఇలాంటి వారే జైలులో నేరాలు నేర్పరితనంలో నిష్ణాతులైన పాత నేరస్థుల దగ్గర శిక్షణ పొంది బయటకు వస్తారు! వారిని నిరంతరం నేరాలు చేయకుండా అదుపులో వుంచుకోవటానికి పోలీసులు ఒక కన్నేసి వుండక తప్పదు! నేరాలు, నిఘా, నేరస్థులూ,

# కృత్రిమ మేధతో మారుతున్న ఉపాధి ప్రపంచం..

డాక్టర్ మోటె చిరంజీవి

కృత్రిమ మేధ (ఏఐ) విస్తరణతో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల భవిష్యత్తుపై చర్చ మొదలైంది. నిన్నటి వరకు మనిషి గంటల తరబడి చేసిన పనిని నేడు ఏఐ కొన్ని నిమిషాల్లో పూర్తి చేస్తోంది. కంటెంట్ రచన నుంచి సాఫ్ట్‌వేర్ కోడింగ్ వరకు, కస్టమర్ సేవల నుంచి డేటా విశ్లేషణ వరకు అనేక రంగాల్లో ఏఐవినియోగం వేగంగా పెరుగుతోంది. దీంతో ఉద్యోగాలు పోతాయన్న ఆందోళన సహజమే. అయితే అసలు ముప్పు సాంకేతికతలో కాదు. దానికి అనుగుణంగా మన నైపుణ్యాలను మార్చుకోకపోవడంలో ఉంది. ఏఐ కొన్నిరకాల పునరావృత పనులను సులభంగా నిర్వహించగలదు. ఒకప్పుడు ఒక పనికి పలువురు ఉద్యోగులు అవసరమైతే.. ఇప్పుడు సాంకేతికత సహాయంతో అదే పనిని తక్కువ మంది పూర్తి చేయగలుగుతున్నారు. సంస్థలకు ఇది వ్యయ నియంత్రణ, వేగం, ఉత్పాదకతను పెంచే మార్గంగా కనిపిస్తోంది. ఫలితంగా సంప్రదాయ ఉద్యోగాల్లో మార్పులు తప్పనిసరిగా వస్తున్నాయి. అయితే ఏఐ మనిషిని పూర్తిగా భర్తీ చేస్తుందనే భయం అంతగా వాస్తవికం కాదు. యంత్రానికి సృజనాత్మక ఆలోచన, మానవీయ అనుభూతి, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకునే సామర్థ్యం పరిమితమే. ఏఐ ఇచ్చిన సమాచారాన్ని పరిశీలించి, సరైనదేదో నిర్ణయించి, దానికి మానవీయవిలువను జోడించేది మనిషే. ఏఐ వేగంగా విస్తరిస్తుండటంతో ప్రపంచ ఉపాధి రంగం పెనుమార్పులకు లోనవుతోంది. మనిషి గంటల తరబడి చేసే పనులను ఏఐఆధారిత సాధనాలు నిమిషాల్లో పూర్తి చేస్తున్నాయి. కంటెంట్ తయారీ, సాఫ్ట్‌వేర్, కస్టమర్ సేవలు, డేటా విశ్లేషణ, అకౌంటింగ్, మార్కెటింగ్ వంటిరంగాల్లో దీని వినియోగంపెరుగుతోంది. దీంతో ఉద్యోగ భద్రతపై ఆందోళన కూడా పెరుగుతోంది. అయితే ఏఐ వల్ల ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా ఎంత మందిఉద్యోగాలు కోల్పోయారన్నదానికి ఖచ్చితమైన గణాంకం లేదు. కంపెనీలు ఉద్యోగ కోతలకు ఏఐతో పాటు పునర్వ్యవస్థీకరణ, ఆర్థిక పరిస్థితులు, ఆటోమేషన్ వంటి పలు కారణాలను చూపుతున్నాయి. అమెరికాలో ఉద్యోగ కోతలను నమోదు చేసే సంస్థ మాత్రం 2023 నుంచి ఏఐను ప్రత్యేక కారణంగా నమోదు చేస్తోంది. ఆ సంస్థ తాజా గణాంకాల ప్రకారం 2023 నుంచి 2025 చివరి వరకు అమెరికాలో 71,825ఉద్యోగ కోతలప్రకటనలకుఏఐ కారణంగా పేర్కొన్నారు. ఇందులో 2025లోనే 54,836 ఉద్యోగ కోతలు ఏఐతో అనుసంధానించబడ్డాయి. అంటే కేవలం రెండేళ్ల వ్యవధిలోనే ఏఐ ప్రభావం గణనీయంగా పెరిగిందని ఈ గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వేదిక అంచనాలు మరింత ఆసక్తికరంగా ఉన్నాయి. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక, ఆర్థిక, జనాభా, పర్యావరణ మార్పుల ప్రభావంతో 9.2కోట్ల ఉద్యోగాలుకనుమరుగయ్యే అవకాశం ఉండగా, 17కోట్ల కొత్త ఉద్యోగాలు ఏర్పడవచ్చని అంచనా వేసింది. అంటే మొత్తంగా 7.8 కోట్ల ఉద్యోగాల నికర పెరుగుదల ఉండొచ్చని పేర్కొంది. అందువల్ల సమస్యఉద్యోగాలు పూర్తిగా అంతరించిపోవడమేకాదు. ఉద్యోగాల స్వరూపం మారడం. పాత నైపుణ్యాలకు డిమాండ్ తగ్గుతూ, ఏఐ, బిగ్‌డేటా, సైబర్ సెక్యూరిటీ, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సృజనాత్మక ఆలోచన, కమ్యూనికేషన్, సమస్య పరిష్కారం వంటి మానవ నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. కాబట్టి ఏఐని ఉద్యోగాల శత్రువుగా చూడటం కంటే.. దానిని ఉపయోగించగల నైపుణ్యాన్ని పెంచుకోవడమే పరిష్కారం. ●

# సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సామాన్యులకు చేరేదెన్నడు?

ఐ.ప్రసాదరావు

సుమారు 200 సంవత్సరాల బ్రిటిష్ సామ్రాజ్య పతనం కోసం 90 సంవత్సరాల సుదీర్ఘ స్వాతంత్ర్య పోరాటం చేసి ఎందరో మహానుభావులు, స్వాతంత్ర్య సమర యోధులు తమ జీవితాలను త్యాగం చేసిన ఫలితంగా 1947 ఆగస్టు 15వ తేదీన దేశానికి స్వాతంత్ర్యం సాధించుకుని నేటికి 79 సంవత్సరాలు పూర్తి చేసుకుని 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు ఘనంగా జరుపుకున్నాం. మన స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన ఆశయాలు లక్ష్యాలు స్వాతంత్య ఫలాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సామాన్యులకు అందుతున్నాయా అంటే నిస్సందేహంగా అందరికీ సమానంగా అందడంలేదు అనేది నిర్వివాదాంశం. అయితే పాలకులు త్వరలో భారత్ మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది అంటూ, 500ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతుంది అని, దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగుతోంది అని చెప్పడం విడ్డూరంగా ఉంది. అయితే 1947 నాటికి నేటికి కొన్నిరంగాల్లో అభివృద్ధి చెందిన మాట వాస్తవమే. అక్షరాస్యత యనభై శాతం సాధించాం. ఐ.టి, ఫార్మా, రక్షణ, ఉత్పత్తిలో ముందంజలో ఉన్నాము. కొంతమేరకు మౌలిక వసతులు అభివృద్ధి పరచుట జరిగింది. అంతరిక్షంలో విజయ విహారం చేస్తున్నాం. అయినప్పటికీ నేటికీ 145కోట్ల మంది భారత జనాభాలో సుమారు ఎనభై శాతం ప్రజలు ప్రభుత్వాలు అందించే ఉచిత పథకాలు, సంక్షేమ పథకాలు మీదే ఆధారపడి జీవిస్తున్నారు అని గణాంకాలు చెబుతున్నాయి. ఇటీవల సుప్రీంకోర్టు, వివిధ రాష్ట్రాల హైకోర్టులుకూడా ఈ పథకాలు పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోకొల్లలుగా దేశంలో ప్రభుత్వ పథకాలపై ఆధారపడి బ్రతుకుతున్న ప్రజలను చూసి ఆశ్చర్యపోయారు. అసలు ప్రభుత్వాలురాజ్యాంగ నిర్మాతలు ఆశించిన విధంగా అందరికీ విద్య, వైద్యం, ఆర్థిక సామాజిక న్యాయం అందిస్తున్నాయా? ప్రభుత్వ ఆధీనంలో ఉండవలసిన అనేక అంశాలు, శాఖలు ప్రైవేటీకరణ కార్పోరేటీకరణ చేస్తూ ప్రజాసంక్షేమం నుంచి ప్రభుత్వాలు పక్కకు జరుగుతూ, బడా పారిశ్రామిక వేత్తలకు, కార్పోరేట్ ప్రపంచానికి రాయితీలు ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా వారి సంపదే దేశాభివృద్ధికి సూచిక అంటూ సంబురం పడిపోతున్నారు. దేశంలో సుమారు అరవై శాతం సంపద కేవలం ఒక శాతం ధనికుల వద్ద పోగుపడటం సమంజసమేనా? పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి ఉపయోగించవలసిన ప్రజాధనాన్ని 'రైటాఫ్'లద్వారా బడా పారిశ్రామిక వేత్తలకు ధారాదత్తం చేస్తూ, ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేయడం ప్రజాస్వామ్య పాలనా? ఈ డెబ్భై తొమ్మిది సంవత్సరాల కాలంలో వివిధ పార్టీలు, ప్రభుత్వాలు అటు కేంద్రంలో, ఇటు వివిధ రాష్ట్రాల్లోపాలన కొనసాగించాయి. కేవలం ఆయా పార్టీల మనుగడకోసం, అధికారం సుస్థిరం చేసుకోవడం కోసమే ఓటుబ్యాంకు రాజకీయాలు చేసారు తప్పా దేశాభివృద్ధికి ముఖ్యంగా పేద మధ్య తరగతి ప్రజల జీవితాలు ఆర్థికంగా సామాజికంగా మెరుగు పరచడానికి, ముఖ్యంగా యువత విద్యార్థుల్లో ఆకాంక్షలను నెరవేర్చడానికి, విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి, వ్యవసాయ పారిశ్రామిక రంగాలను బలోపేతం చేయడానికి ఏమాత్రం ఇటీవల కాలంలో చిత్తశుద్ధితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయటలేదు అనేవాస్తవాన్ని మరువరాదు. అందుచేతనే ఇటీవల కాలంలో రైతులు, శ్రామికులు, ముఖ్యంగా



యువత జెన్‌జెడ్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా దేశం అభివృద్ధి చెందితే వలసలు వెళ్ళడం ఉండవు. ఏ రంగం నుంచి నిరసనలు వ్యక్తం కావుకదా!. ప్రభుత్వాలు చెబుతున్న అభివృద్ధి మాటల్లో ఏమాత్రం వాస్తవం లేదని వివిధరంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో మన దేశ ర్యాంకులు చూస్తే అర్థమవుతుంది. ముఖ్యంగా డాలర్‌తో రూపాయి మారకం విలువ రోజు రోజుకు పతనం అవుతోంది. దాదాపు 96 వద్ద అటుఇటుగా కొనసాగుతోంది అంటే మన ఆర్థికవ్యవస్థ ఎంత బలహీన పడిందో అర్థం అవుతుంది. ప్రపంచ స్థాయిలో మన దేశం ఆకలి సూచిలో హంగర్ ఇండెక్స్‌లో 102వ ర్యాంకు, పౌర స్వేచ్ఛలో 110వ ర్యాంకు, ఆరోగ్య సూచికలో 45, విద్యా సూచికలో 101, అవినీతిలో 91, పత్రికా స్వేచ్ఛలో 157, ప్రజాస్వామ్య సూచిలో 104, మానవ అభివృద్ధిసూచికలో (హెచ్ డి ఐ) 130లో ర్యాంకు, తలసరి ఆదాయంలో149వ ర్యాంకు, జెండర్ గ్యాప్‌లో 148వ ర్యాంకు, శాంతి విషయంలో 127, సంతోష సూచిలో 116వ స్థానంలో ఉన్నట్లు వివిధ అంతర్జాతీయ నివేదికలు చెబుతున్నాయి. ఇక ఎంత సంపాదించినా కనీసం తినడానికి తిండి లేక ప్రజలు అలమటిస్తున్నారు. దీనికి కారణం అధిక ధరలు దేశంలో నేడు ద్రవ్యోల్బణం 4.38శాతం పైనే కదలాడుతుంది. ఇక ప్రపంచ దేశాల్లో కన్నా అతి తక్కువ తలసరి ఆదాయం సగటున 2.35 లక్షల రూపాయలు సంవత్సరం ఆదాయంతో చాలా మంది బ్రతుకుతున్న పరిస్థితి. జూన్ 2026గణాంకాలు ప్రకారం దేశంలో నిరుద్యోగం 5.5శాతం పైబడి ఉంది. సరి కదా అరకొరగా అప్పుడు అప్పుడు ఎన్నికల్లో ఓట్లు సంపాదించుకోవడం కోసం జాబ్ క్యాలెండర్ అని చెబుతూ చేపట్టే పోటి పరీక్షలు దాదాపు అన్ని అవినీతి, పారదర్శకలేమితో జరుగుతున్న సందర్భంలో నేడు దేశంలో జన్‌జీ యువత నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వాలు జవాబుదారీతనం లేకుండా నియంతృత్వ ఆధిపత్య ధోరణితో నిరసనలు అణిచివేసేందుకు ప్రయత్నాలు చేయడం జరుగుతుంది. ఇదేనా మన స్వాతంత్ర్య సమర యోధులు, రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన ఆశయాలు. ఇకనైనా పాలకులు మారాలి. నేడు మనదేశంలో ప్రతీ సంవత్సరం 100 కోట్ల రూపాయలు పైబడి సంపాదించే అపార కుబేరులు బిలియనీర్ల సంఖ్య 576మంది అని గ్రహించాలి. అదే సమయంలో పేదవాడు మరీ పేదవాడుగా మారుతున్న పరిస్థితి. అనేకమంది రైతులు, ఉద్యోగాలు రాక నిరుద్యోగులు ప్రతీ సంవత్సరం ఆత్మహత్య చేసుకుంటున్నారు. అదే సమయంలో ప్రతీఒక్కరి నెత్తిమీద దాదాపు 1.5లక్షల రూపాయలు ప్రభుత్వ రుణం ఉందనే విషయాన్ని మరువరాదు. అభివృద్ధి పేరుతో కార్పొరేట్ వ్యక్తులు తీసుకున్న రుణాలు చెల్లించకపోవడంతో 'రైటాఫ్' పేరుతో ఈ పది సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం పది లక్షల కోట్ల రూపాయలు రద్దు చేసింది. అదే పేదవాడు, నిరుద్యోగి సామాన్య ప్రజలుఒక్క రూపాయి బాకీ ఉన్నా ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్న పరిస్థితి. అనర్హులకు కూడా ఉచిత పథకాలు, సంక్షేమ పథకాలు అమలు చేయడం శోచనీయం. ప్రతీ విషయంలో రాజకీయ జోక్యంపెరుగుతుంది. ఇకనైనా పాలకులు ప్రభుత్వాలు ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రశ్నిస్తే వారి ఆకాంక్షలను, ఆక్రందనలు పరిశీలించి పరిష్కారానికి కృషిచేయాలి. నైతికతతో, జవాబుదారీతనం ఉండటం ముఖ్యం. రాజ్యాంగ బద్ధమైన సంస్థలను స్వతంత్ర ప్రతిపత్తిగా పనిచేసే విధంగా చూడాలి. వ్యవసాయ పారిశ్రామిక రంగాలను బలోపేతం చేయాలి. నోటి మాటలతో స్వదేశీ అని కాకుండా, అందరూ స్వదేశీ వస్తువులు వాడేవిధంగా ప్రోత్సాహించాలి. ఎగుమతులు పెరగాలి. దిగుమతులు తగ్గాలి. విద్యా రంగంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెంచాలి. రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్‌కు, నైపుణ్యాభివృద్ధి పెద్దపీట వేయడం ద్వారా అభివృద్ధి చెందుతుంది. సమన్యాయం, సామాజిక న్యాయం ఆధారంగా ప్రభుత్వాలు పనిచేయాలి. ●

# ప్రజావాక్కు

### ప్రణాళిక అత్యవసరం

భారత్ వేగంగా పట్టణీకరణ చెందుతున్న వేళ, నగరాభివృద్ధిని కేవలం ఎత్తైనభవనాలు, ఎక్స్‌ప్రెస్‌వేలు, మెట్రో రైళ్లతో కొలవడం సరిపోదు. స్వచ్ఛమైన గాలి, తాగునీరు, సురక్షిత రహదారులు, సమర్థవంతమైన ప్రజారవాణా, వరదలేని వీధులు, అందుబాటులో ఉండే గృహాలు కూడా నగర ప్రగతికి కీలక ప్రమాణాలే. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం భారత పట్టణ జనాభా 2050 నాటికి సుమారు95కోట్లకు చేరవచ్చు. దీనికిఅనుగుణంగా మౌలిక సదుపాయాల ప్రణాళిక అత్యవసరం. వాతావరణ మార్పులతో పట్టణ వరదలు, తీవ్రఉష్ణోగ్రతలు, కాలుష్యం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. కాబట్టి చెరువులు, కాలువలు, పచ్చనిప్రాంతాలను రక్షిస్తూ వర్షపునీటి నిర్వహణను బలోపేతం చేయాలి. 2025 తొలి అర్థభాగంలో పరిశీలించిన 239 నగరాల్లో 122 నగరాలు జాతీయ పీఎం 2.5 ప్రమాణాన్ని మించినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది పట్టణ ప్రణాళికలో పర్యావరణానికి మరింత ప్రాధాన్యం అవసరమని స్పష్టం చేస్తోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### బోధనలో నైతిక విలువలు భాగమవ్వాలి

భర్తృహరి, భాస్కర, సుమతీ,వేమన, శ్రీ కాళహస్తి శతకాలందు సమాజంలో ఎలా నడుచుకోవాలి, పెద్దలను ఎలా గౌరవించాలి, మంచి వారి సావాసంవల్ల కలిగే ప్రయోజనాలు, చెడు వారి దూరాలు, కష్టాల్లో కూడా ధర్మం తప్పకుండా ఉండటం, ఎప్పుడూ నిజంమాట్లాడటం, నమ్మకంగాఉండటం, ఇతరుల అభిప్రాయాలను హక్కులను, వ్యక్తిత్వాన్ని గౌరవించడం, తోటివారి కష్టాలను అర్థంచేసుకుని సహాయం చేయడం, మనం చేసే పనులకు నిర్ణయాలకు మనమే బాధ్యులమని గుర్తించడం. ఇవి సమాజంలో శాంతిని, వ్యక్తుల మధ్యపరస్పరనమ్మకాన్ని పెంచుతాయి. మంచి వ్యక్తిత్వాన్ని నిర్మిస్తాయి.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

### విద్యార్థులు నడవడికను అలవర్చుకోవాలి

నేటి యువత చిన్న చిన్న విషయాలను సైతం జీవితంలో పెద్ద విజయాలుగా భావిస్తున్నారు. వారికి నచ్చింది సంపాదించడంలో ఎంతవరకైనా బరి తెగిస్తూ తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తూ ప్రాణాలు తీసుకుంటున్నయువత భారీగా పెరిగిపోయింది. కుటుంబ నేపథ్యం తెలుసుకుని

### పథకాలతో పెరుగుతున్న అవినీతి

నేడు మన దేశంలో ఆధునిక సాంకేతిక విజ్ఞానం పెరుగుతుంటే అవినీతి, అక్రమాలు తగ్గకపోగా శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్న సామెత వలె ఇంకా పెరుగుతున్నాయి. ఈ మధ్య మన రాష్ట్రంలో అవినీతి అనూహ్యంగా పెరగటానికి మరోకారణం అనుచిత జనాకర్షక పథకాలు. కొందరు స్థితి పరులు వాటిని ఆశిస్తుంటే, వారికి అనుచితలబ్ధి కల్పిస్తున్నందుకు సదరు ఉద్యోగులు డిమాండ్ చేస్తుంటే, కష్టపడకుండ వచ్చే డబ్బేనని లబ్దిదారులు ఉదారంగా ఇస్తున్న కారణంవల్ల అవినీతి బాగా పెరిగిపోయింది. కనుక ఇక ముందు ఎవరైనా ప్రభుత్వోద్యోగంలో చేరేముందు గానీ, పార్లమెంటు, శాసన సభ్యులు, న్యాయ శాఖల్లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టే ముందు గానీవారూ, వారికుటుంబీకుల ఆస్తుల వివరాలను బహిరంగంగా తెలపాలని కేంద్రప్రభుత్వం ఒక చట్టం తేవాలి. అప్పటి, ఇప్పటి ఆస్తులకి పొంతనలేని భారీతేడాఉంటే, ఆ అక్రమఆస్తులను అవినీతినిరోధకశాఖతక్షణం జప్తుచేయాలి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### తొండ ముదిరితే ఊసరవెల్లి

మందులు డాక్టరుగారి చీటి ప్రకారం ఇవ్వడం మందులు అమ్ముకునే దుకాణదారుల పని. తొండ ముదిరి ఊసరవెల్లిగా రంగులు మారుస్తుంది. మందులమ్ముకునే దుకాణాలు మందులు తయారుచేసి అమ్ముతున్నారు. ఆస్పత్రులు నడుపుతున్నారు. ప్రభుత్వం ఎంత మొత్తుకున్నా జనం చౌకయిన జనరిక్ మందులు వాడరు. ఏలనంటే డాక్టర్లు వారు మార్కెట్ చేయదలచిన మందులు రాసానతరు. జనాన్ని చైతన్యపరిచే ఉద్యమాలు ఈ దిశగా రావాలి.

- వి.ఆర్.ఆర్.ఎ. రాజు, హైదరాబాద్

### ధరలను తగ్గించాలి

ప్రస్తుత బ్లాక్ మార్కెట్ కారణంగా సిలిండర్ల అమ్మకాలు తగ్గడంతో సరఫరా గొలుసు సాధారణ స్థితికి వచ్చింది. అయితే, హోటల్స్‌లోదొరికే టిఫిన్, భోజనం, కాఫీ, టీ, ధరలు మాత్రం తగ్గలేదు. హోటల్ యజమానులు ధరలు తగ్గించకపోవటంతో వినియోగదారులు చాలా నిరాశ చెందుతున్నారు. సిలిండర్ ధరను యాభై లేదా వంద రూపాయలు పెంచినవెంటనే, ఒక రకమైన టిఫిన్, భోజనం, టీ, కాఫీ ధరలను అమాంతం పది రూపాయలు పెంచారు. సిలిండర్ ధరల తగ్గింపు హోటళ్లకు ప్రయోజనకరమైనప్పటికీ, ఇది వినియోగదారులకు చాలా భారంగా మారింది. ధరలను వెంటనే తగ్గించాలి.

-డి. వెంకటరెడ్డి, బెంగుళూరు

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

## ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కీలక బాధ్యతలపై
# విమర్శలు..!

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్24, ప్రభాతవార్త:** వర్సిటీ పరిక్షా భవన్, దూరవిద్యా కేంద్రంలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కీలక బాధ్యతలపై పలు విమర్శలు వస్తున్నాయి. ఈ రెండు కేంద్రాల నుంచి విద్యార్థులు పలు సర్టిఫికెట్‌ల కోసం వర్సిటీని సందర్శిస్తారు. ఈ



సమయంలో కొంతమంది సిబ్బంది అధికారిక ఫీజులతో పాటు అధనంగా డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు నిత్యం పరిపాటిగా మారాయి. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసే ఎటువంటి అధనపు వసూళ్ళు చేయకూడదనే నిబంధనలు ఉన్నా వాటిని పెడచెవిన పెట్టిన కొందరు సిబ్బంది అవకాశం రావడమే తడవుగా పనికానిచ్చేస్తున్నట్లు విద్యార్థుల నుంచి పిర్యాదులు వస్తున్నాయి. సర్టిఫికెట్‌ల కోసం వచ్చేవారికి ఎటువంటి అధనపు చెల్లింపులు చేయవద్దని, లంచాలు ఇవ్వవద్దని చెప్పే నాథుడే కరువయ్యారు. విద్యార్థులు కూడా ఇటువంటి వాటికి అలవాటుపడినట్లు ఉన్నారు. మనకి పని జరుగుతుందిగా అన్నట్లు ఎవరికి వారు మాకెందుకు అని మిన్నకుంటున్నారే గానీ పిర్యాదు చేసేందుకు ముందుకు రావడంలేదు. ముఖ్యంగా విద్యార్థులు చెల్లించే ఫీజుల వివరాలు నోటీస్ బోర్డులలో ప్రదర్శించాలి. అలాగే అధనపు చెల్లింపులు చేయవద్దని సైన్‌బోర్డులు ఉండాలి. అలాగే వెంటనే స్పందించే హెల్ప్‌లైన్ నెంబర్లు స్పష్టంగా ఏర్పాటుచేయాలి. ఈవిధంగా చేసి పారదర్శక పాలన ఖచ్చితంగా అమలు చేసి విద్యార్థుల నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత వర్సిటీ అధికారులపై ఉంది.

**బదిలీల్లో కొరవడిన పారదర్శకత**

ఒకే స్థానంలో ఎక్కువ సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను సీటు మార్చకుండ ఉండటం పలు అనుమానాలకు తావిస్తుంది. కొందరు 3ఏళ్ళ కంటే ఎక్కువ సంవత్సరాలు ఒకే సీట్లో మకాం వేయడం, మరికొందరు ఒటి నుంచి ఒటి విభాగానికి బదిలీ కావడం, బదిలీలలో పారదర్శకత లేకపోవడంతో ఉద్యోగుల్లో జవాబుదారీతనం తక్కువవైందనే విమర్శలు వస్తున్నాయి. వర్సిటీ అధికారులు ఈ విషయాలపై దృష్టిసారించి వర్సిటీ ప్రతిష్టకు భంగం కలుగకుండా చూడాలని మేధావులు కోరుతున్నారు.

# గుంటూరు వార్త



రెండేళ్ల అభివృద్ధి,పథకాలపై ప్రజల్లో అవగాహన 7

## గుంటూరు కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగంలో
# ఏసిబి అధికారుల మెరుపు దాడులు

**అభివృద్ధి పనుల్లో.. పైప్ లైన్ మరమత్తు పనులలో అవకతవకలపై ఆరోపణలతో ముమ్మరంగా తనిఖీలు**

**156 పనులకు సంబంధించి ఫైల్స్ స్వాధీనం**

**అధికారులను బయటకు వెళ్లకుండా బంధించి సాయంత్రం 8 : 20 గంటల వరకు కొనసాగించిన తనిఖీలు**

**నేడుదాడులు కొనసాగుతాయని తెలిపిన ఏసీబీ అధికారులు**

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 24, ప్రభాతవార్త :**

గుంటూరు నగరంలోని కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అవినీతి నిరోధక శాఖ ( ఏసీబీ ) అధికారులు సోమవారం మెరుపు దాడులు నిర్వహించారు. ఏసీబీ డిఎస్పి ప్రతాప్ కుమార్ నేతృత్వంలో మధ్యాహ్నం 12 గంటలకు



కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగానికి వచ్చిన అధికారులు సాయంత్రం 8 గంటల వరకు రికార్డులను స్వాధీనం చేసుకొని, కంప్యూటర్లు తనిఖీ చేశారు. గుంటూరు, పలనాడు జిల్లాల నుంచి వచ్చిన పదిమంది ఏసీబీ అధికారులు ఈ దాడుల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా 2017 నుంచి 2025 వరకు కార్పొరేషన్ ఇంజనీర్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన అనేక అభివృద్ధి పనులకు సంబంధించి, సిసి రోడ్లు, డ్రైన్లు, వాటర్ పైప్ లైన్ ఇంటర్ లింకేజీ పనులు,



పైప్ లైన్ లీకేజీ మరమత్తు పనులకు సంబంధించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ పనులకు సంబంధించి భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయని, కాంట్రాక్టర్లతో కొమ్మక్కై అధికారులు టెండర్ల పర్సంటేజీలు మార్చేసి భారీ అవకతవకలకు పాల్పడ్డారని వచ్చిన ఆరోపణలపై ఈ దాడులు నిర్వహించడం జరుగుతుందని ఏసీబీ డి.ఎస్.పి వివరించారు. అయితే ఈ దాడుల్లో భాగంగా అధికారులకు సంబంధించి లంచాల రూపేనా నగదు వంటివి దొరకలేదని, కేవలం అభివృద్ధి పనులకు సంబంధించి చేసిన అవకతవకలపై రికార్డులు, ఆన్లైన్ టెండర్ విధానం, తదితర అంశాలకు సంబంధించి పూర్తి దర్యాప్తు కొనసాగుతుందని వివరించారు.

**ఈ దాడులు నేడు కూడా కొనసాగుతాయి...**

గుంటూరు కార్పొరేషన్ లోని ఇంజనీరింగ్ విభాగంలో సోమవారం దాడులు నిర్వహించడం జరిగిందని, ఈ దాడులు మంగళవారం కూడా కొనసాగుతాయని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు. పూర్తిస్థాయి నివేదిక అందాక తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. ఇదిలా ఉంటే ఇంజనీరింగ్ విభాగంలో అధికారుల ఫోన్లను ముందుగానే స్వాధీనం చేసుకొని, ఏ అధికారిని, సిబ్బందిని బయటకు పోనీకుండా ఉంచి అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చిన ఫైళ్లు మొత్తం స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇటువంటి అవకతవకలు జరిగిన, అవినీతి కార్యకలాపాలపై, అధికారులు లంచం డిమాండ్ చేసిన వెంటనే 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం అందించాలని, సమాచారం అందుకున్న వెంటనే దాడులు చేయటం జరుగుతుందని ఏసీబీ అధికారులు వెల్లడించారు. ప్రజలు లంచాలు ఇచ్చి అధికారులను ప్రోత్సహించవద్దు అని కోరారు.

# కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారుల నిరక్ష్యం...
## ఒక కూలి కార్మికుడి నిండు ప్రాణం విలవిల...!

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 24,ప్రభాతవార్త :**

" గుంటూరు కార్పొరేషన్ టౌన్ ప్లాన్ విభాగం అధికారుల పర్యవేక్షణ నిరక్ష్యం... భవన నిర్మాణ యజమానుల అత్యుత్సాహంతో అడ్డగోలుగా అవినీతి అక్రమాలు పెరిగిపోతున్నాయనే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి." గుంటూరు కార్పొరేషన్ తూర్పు నియోజకవర్గం కొత్తపేటలో జరిగిన ఒక భవన నిర్మాణ పనుల సమయంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ దుర్ఘటనతో నగర ప్రజలు కార్పొరేషన్ అధికారుల పనితీరునే ప్రశ్నిస్తుంది. కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ నుంచి ప్లాన్ తీసుకోకుండా ( జీరో ప్లాన్ ) తో నిర్మాణాలు చేపట్టడం.. ప్లాన్ కు విరుద్ధంగా భవన నిర్మాణాలు నిర్మించడం... కార్పొరేషన్ లైసెన్స్ ఇంజనీర్ల నుంచి.. సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు... బిల్డింగ్ ఇన్స్పెక్టర్లను వసుళ్ళ రాజాలుగా మార్చేసి అధికార యంత్రాంగం లంచాల రూపేనా లక్షల లక్షలు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నగర పరిధిలో యదేచ్ఛగా అనధికారికంగా



అక్రమ నిర్మాణాలు జరిగిపోతున్న అటువైపు అధికారులు కన్నెత్తి చూడకపోవటంపై ఆ విభాగం అధికార యంత్రాంగం ఏ స్థాయిలో అక్రమ సంపాదన తమ జేబులు నింపుకుంటున్నారో అని విమర్శలు వినిపిస్తున్నాయి.





ఇదిలా ఉంటే ఆదివారం రాత్రి కొత్తపేటలోని పాత అభిలాష్ హోటల్ ఎదురు..ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో భవన నిర్మాణ పనుల సమయంలో జరిగిన ఒక దుర్ఘటనలో మట్టి పనులు చేసే కూలి కార్మికులు కరెంటు షాక్ తో కోమాలోకి వెళ్లిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి..!

గుంటూరు నగరంలోని కొత్తపేట శివాలయం వెళ్లే రోడ్ లో ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ పక్కనే ఖాళీ స్థలంలో భవన నిర్మాణ పనులు హడావుడిగా చేపడుతున్నారు. గత నెల రోజుల నుంచి పగలు రాత్రి తేడా లేకుండానే ఆ స్థలంలో భవన నిర్మాణ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. నెహ్రూ నగర్ కు చెందిన ఒక సిమెంట్ వ్యాపారి అక్కడ భవనాన్ని నిర్మిస్తున్నట్టు స్థానికులు వెల్లడించారు. ఇదిలా ఉంటే రోడ్డుపైనే భవన నిర్మాణం మెటీరియల్ అంతా పోసి పనులు చేపట్టడమే కాకుండా జెసిబి సహాయంతో సెల్లార్ నిర్మాణ పనులు సర్వేగంగా చేస్తున్నారు. ఈ పనులు జరిగే నేపథ్యంలో గుంటూరు నగరంలోని అడవి తక్కెలపాడు సమీపంలో ఉన్న స్వర్ణ భారతి నగర్ నుంచి కూలీ పనులు చేసే నిమిత్తం కార్మికులు పనులలో నిమగ్నమయ్యారు. ఈనెల 23వ తేది ఆదివారం రాత్రి జెసిబి సహాయంతో పాటు, కూలి కార్మికులు కూడా హడావుడిగా మట్టి తొలగించే పనులు, పోస్టులు నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు. అయితే ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో స్వర్ణ భారతి నగర్ కు చెందిన కార్మికుడు పనులు చేసే క్రమంలో విద్యుత్ మీటర్ నుంచి వచ్చిన వైర్లు తగిలి కరెంటు షాక్ తో కుప్పకూలి పడిపోయాడు. ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోపోవటం, బురద మట్టిలో నిరక్ష్యంగా కరెంటు వైర్లు ఉండటం కారణంగా ఆ కూలీ కార్మికుడు షాక్కు గురై పడిపోవడంతో అతని భార్యతో పాటు సహచర కూలీలు ఒక్కసారిగా కేకలు పెడుతూ పరుగులు తీశారు. వీరి కేకలు విన్న పాద చారులు, వాహన చోదకులు హుటా హుటిన అక్కడికి చేరుకొని కరెంటు షాక్ కు గురై బురదలో పడిపోయిన కార్మికుడిని రోడ్డుపైకి

**కొత్తపేట ఎన్ఆర్ఐ స్కూల్ పక్కనే అర్ధరాత్రి హడావుడిగా జెసిబితో " సెల్లార్ నిర్మాణ పనులు "**

**భవన యజమానుల అత్యుత్సాహం వల్ల కరెంటు షాక్‌తో కోమాలోకి వెళ్లిన కార్మికుడు**

**కోమాలోకి వెళ్ళిన కూలి కార్మికుని హుటాహుటిన ఆసుపత్రికి తరలించిన స్థానికులు**

**ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన... సోమవారం బిల్డింగ్ నిర్మాణ పనులు ఆపేసిన యాజమాన్యం**

**అసలు బతికే ఉన్నాడా... మృతి చెందాడా అనే సందిగ్ధ పరిస్థితి**

**" సెల్లార్ నిర్మాణకు అనుమతులు ఉన్నాయా..లేవా..! అంటూ ప్రజల అనుమానం**

తీసుకొని వచ్చారు. అప్పటికే ఆ కూలి ఉలుకు పలుకు లేకుండా నిత్య వంగపడిపోయి ఉన్నాడు. మా మామను కాపాడండి అంటూ బాధితుడు భార్య కన్నీటి పర్యంతం అయింది. అక్కడికి చేరుకున్న అనేకమంది అతని గుండెపై ఒత్తడం, కాళ్ల చేతులపై రాపిడి చేయటం ఇంటి పనులు చేపట్టినప్పటికి ఎటువంటి చలనం లేకుండా నిజ్జీవంగా పడిపోయి ఉండటంతో వెంటనే అటుగా వచ్చే ఒక ఆటోను ఆపి హుటా హుటిన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పనులు రాత్రి, పగలు తేడా లేకుండా పనులు చేపడుతుంటే కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు పర్యవేక్షణ నిర్వహించకుండా నిద్రమత్తులో ఉన్నారనే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

**అసలు బతికే ఉన్నాడా...?**

కరెంటు షాక్ కు గురై ఎటువంటి చలనం లేకుండా నిత్యవంగా పడి ఉన్న ఆ కార్మికున్ని ఆసుపత్రికి తీసుకొని వెళ్లాలని ఆత్రుతతో ఒక ఆటోలో ఎక్కించుకొని సంఘటన స్థలం నుంచి మూడు వంతెనల కు వెళ్లే మార్గం వైపు తీసుకొని వెళ్లారు. అక్కడ పనిచేసే కొంతమంది కార్మికులు కూడా తమ ద్విచక్ర వాహనాలు తీసుకొని కొంత దూరం వరకు ఆటో వెళ్లిన మార్గం వైపు వెళ్లి వాళ్లు కనిపించలేదంటూ తిరిగి వెనక్కి వెళ్లారు. ఏదైనా ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొని వెళ్లారా, లేదంటే గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వెళ్లారా అనేది స్పష్టంగా తెలియలేదని వారు వెల్లడించారు. అసలు బతికే ఉన్నాడా లేదా కూడా తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఈ సంఘటన జరగటంతో ఆ స్థలం వద్ద జరుగుతున్న నిర్మాణ పనులను భవన నిర్మాణ యజమానులు అర్ధాంతరంగా ఆపివేశారు. ఆ కార్మికుడు బతికే ఉన్నాడా లేదో తెలియాల్సి ఉంది. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి ఆధారాలు కూడా ఆ పనులు జరిగే స్థలం పక్కనే ఉన్నటువంటి స్కూల్ సీసీటీవీ కెమెరాలలో రికార్డు అయ్యాయని కూడా ప్రజలు వెల్లడిస్తున్నారు. ఏదేమైనా అధికారుల బాధ్యతారాహిత్యం, భవన యజమానులు సమయం సందర్భం లేకుండా, అర్ధరాత్రి సమయాల్లో ఇష్టం వచ్చినట్లు పనులు చేపట్టడంపై నగర ప్రజల నుంచి ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సంఘటనకు సంబంధించి అధికార యంత్రాంగం విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# వర్షంలోనూ వెనక్కి తగ్గని జూడాలు

**-15వ రోజుకు చేరిన రాష్ట్రవ్యాప్త సమ్మె. - గుంటూరులో కొనసాగిన శాంతియుత నిరసన**

**గుంటూరు మెడికల్, ఆగస్టు 24 (ప్రభాతవార్త):**

ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాష్ట్రవ్యాప్త సమ్మె సోమవారం 15వ రోజుకు చేరుకుంది. మూడో దశలో భాగంగా 8వ రోజు కూడా జూనియర్ వైద్యులు తమ ఆందోళనను కొనసాగించారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన పీజీ వైద్యులు, వైద్య శిక్షణార్థులు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని పర్యవేక్షణాధికారి




కార్యాలయం సమీపంలో శాంతియుతంగా నిరసన చేపట్టారు.

ఆందోళనలో భాగంగా సుమారు 15 మంది పీజీ వైద్యులు స్వచ్ఛందంగా మారుతూ చేపట్టే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఉదయం నుంచే తమ న్యాయబద్ధమైన డిమాండ్లకు మద్దతుగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. రోజంతా ఆందోళన కార్యక్రమాలు కొనసాగాయి.

**వర్షాన్ని లెక్కచేయని నిరసన**

ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నప్పటికీ జూనియర్ వైద్యులు, వైద్య శిక్షణార్థులు వెనక్కి తగ్గలేదు. వర్షంలోనే నినాదాలు చేస్తూ తమ డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా నిలిచారు. ప్రభుత్వం ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, సమస్యల పరిష్కారంలో చోటుచేసుకున్న జాప్యం, తదుపరి కార్యాచరణపై వారు పరస్పరం చర్చించుకున్నారు.

**రోగుల సేవే తమ తొలి బాధ్యత**

ఆందోళనలో పాల్గొన్న వైద్యులు తమ విధుల్లో భాగంగా ఎదుర్కొంటున్న బాధ్యతలు, సవాళ్లను వివరించారు. రోగుల సంరక్షణలో ఎదురైన అనుభవాలు, అత్యవసర పరిస్థితుల్లో అందించిన వైద్య సేవలు, శిక్షణ సమయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరస్పరం పంచుకున్నారు. వైద్య వృత్తి పట్ల, రోగుల పట్ల తమకు ఉన్న అంకితభావాన్ని ఈ సందర్భంగా మరోసారి చాటిచెప్పారు.

**చర్చల ద్వారానే పరిష్కారం కోరుతున్న జూడాలు**

తమ ఆందోళన శాంతియుత ప్రజాస్వామ్య పద్ధతిలోనే కొనసాగుతుందని జూనియర్ వైద్యులు స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ న్యాయబద్ధమైన డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకుని, సమస్యకు త్వరితగతిన సామరస్యపూర్వక పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు ఆందోళనను కొనసాగిస్తూ, చర్చల ద్వారా సమస్య పరిష్కారం కావాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.

# చట్టం ముందు తప్పు చేసిన వారు శిక్షార్హులే : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, ఆగస్టు 24,ప్రభాతవార్త :** వైఎస్సార్సీపీ నాయకులు మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్టును రాజకీయ కక్ష సాధింపుగా చిత్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి విమర్శించారు. సోమవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడారు.

**లిక్కర్ స్కామ్‌లో చట్టం తన పని తాను చేసుకుంటోంది**

గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో రాష్ట్రంలో జరగని అక్రమం, జరగని కుంభకోణం లేదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆరోపించారు. సంక్షేమ పథకాల అమలు నుంచి రేషన్ బియ్యం పంపిణీ వరకు, లిక్కర్ విధానాల నుంచి ప్రభుత్వ విభాగాల వరకు ప్రతిచోటా అవినీతి రాజ్యమేలిందన్నారు. లిక్కర్ స్కామ్‌పై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వచ్చినప్పటికీ అప్పటి ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను పూర్తిగా నిరక్ష్యం చేసిందన్నారు. నేడు ఆ అక్రమాలపై విచారణ జరుగుతుండగా, చట్టం తన పని తాను చేసుకుంటోందని పేర్కొన్నారు.

**ఈడీ అరెస్టు – సుప్రీంకోర్టు కూడా బెయిల్ నిరాకరణ**

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును లిక్కర్ స్కామ్‌లో కీలక పాత్ర పోషించారనే ఆరోపణల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసిందన్నారు. ఈ కేసులో ఆయన కుటుంబ సభ్యుల ప్రమేయంపై కూడా విచారణ జరుగుతోందని తెలిపారు.

ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం చేసిన ప్రయత్నాలను సుప్రీంకోర్టు తిరస్కరించిందని, దేశంలోని అత్యున్నత దర్యాప్తు సంస్థ అయిన ఈడీ మరియు అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాలను కూడా వైఎస్సార్సీపీ రాజకీయ కోణంలో చూపడం విచారకరమన్నారు.

**రాజకీయ కక్ష కాదు – చట్టపరమైన చర్య**

కారుమూరి నాగేశ్వరరావు అరెస్టును రాజకీయ కక్ష సాధింపుగా చిత్రీకరించడం పూర్తిగా అవాస్తవమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. తప్పు చేసిన వారు ఎవరైనా శిక్షార్హులే. చట్టం ముందు అందరూ సమానమే. ప్రభుత్వం ఎవరినీ ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేయడం లేదు. కానీ అవినీతి చేసిన వారిని చట్టం వదిలిపెట్టదు" అని గళ్ళా మాధవి అన్నారు.

**కులం కార్డు చూపించి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం**

వైఎస్సార్సీపీ నాయకులు తమ అక్రమాలను సమర్థించుకోవడానికి ప్రతిసారీ కులం కార్డును ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. ఒక వ్యక్తి అవినీతి ఆరోపణలతో అరెస్టు అయితే దానిని బీసీలు, ఎస్సీలు, బడుగు బలహీన వర్గాలపై దాడిగా చిత్రీకరించడం దురుద్దేశపూర్వక రాజకీయమని విమర్శించారు. అక్రమాలకు పాల్పడిన వ్యక్తిని కేవలం అతని కులం ఆధారంగా రక్షించే ప్రయత్నం చేయడం ప్రజా స్వామ్యానికి ప్రమాదకరం. చట్టపరమైన చర్యలను కుల కోణంలో చూడటం సరికాదు" అని అన్నారు.



**బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అత్యధికంగా కృషి చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఎప్పటికప్పుడు బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు మరియు ఇతర వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తోందని తెలిపారు. వైఎస్సార్సీపీ పాలనలో బడుగు బలహీన వర్గాలపై జరిగిన అన్యాయాలను ప్రజలు మరచిపోలేదన్నారు. ఇప్పుడు అదే పార్టీ నాయకులు తమ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ఆ వర్గాల పేర్లు ఉపయోగించడం సిగ్గుచేటని విమర్శించారు.

**లిక్కర్ స్కామ్ బాధిత మహిళలకు సమాధానం చెప్పాలి**

లిక్కర్ విధానాల కారణంగా వేలాది కుటుంబాలు నష్టపోయాయని, అనేక మంది మహిళలు తమ కుటుంబ పెద్దలను కోల్పోయారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. లిక్కర్ స్కామ్ వల్ల నష్టపోయిన కుటుంబాలను పరామర్శించకుండా, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని మాత్రమే పరామర్శించడం వైఎస్సార్సీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు.

**ప్రజలు అన్నీ గమనిస్తున్నారు**

వైఎస్సార్సీపీ నాయకులు ప్రతి అరెస్టును రాజకీయ కక్షగా, ప్రతి చట్టపరమైన చర్యను కుట్రగా చిత్రీకరిస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని గళ్ళా మాధవి అన్నారు. అయితే ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, గత ఎన్నికల్లో ఇచ్చిన తీర్పే దానికి నిదర్శనమని పేర్కొన్నారు.

**పారదర్శక పాలనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో పారదర్శక, అవినీతి రహిత పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సుపరిపాలనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మీరు చేసిన పాపాలకు రాజకీయాన్ని అడ్డం పెట్టుకోవద్దు. చట్టం తన పని తాను చేసుకుంటుంది. ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు మానుకుని, చట్టపరమైన ప్రక్రియను గౌరవించాలి" అని వైఎస్సార్సీపీ నాయకులకు హితవు పలికారు.

# నిరుద్యోగులకు ఉద్యోగ భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్సీఆలపాటి

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 24(ప్రభాతవార్త):** నిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం ఇంటింటి ప్రచారంలో భాగంగా సోమవారం పట్టణంలోని 33,34 వార్డులలో కూటమి నాయకులతో కలిసి పర్యటించి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించి ప్రజల నుండి వినతులను స్వీకరించిన శాసన మండలి సభ్యులు, తెనాలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఆలపాటి రాజేంద్రప్రసాద్. ఈ సందర్భంగా రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు రాష్ట్రాన్ని



అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బిజెపి నేతల సహకారంతో రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకువచ్చి యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించటానికి తీవ్రంగా కృషి చేస్తున్నారని ప్రజలు కూడా గమనించి కూటమి ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్, వసంతం అశోక వర్ధన్, 33,34 వార్డుల నాయకులు, పార్టీ నాయకులు రావి చిన్ని,, కోగంటి రోహిత్, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, జొన్నాదుల మహేష్, డా. వేమూరి శేషగిరిరావు ,తదితరులు పాల్గొన్నారు.

**కుల గణన చేపట్టకుంటే జెన్ జీ తరహా ఉద్యమమే : కేసన శంకరరావు** 10



## దుర్గిలో నాణ్యత ప్రమాణాల పరిశీలన



**దుర్గి, ఆగస్టు24 ప్రభాతవార్త** ప్రజారోగ్య రక్షణ ధ్యేయంగా సోమవారం దుర్గి మండల కేంద్రంలోని బేకరీలో పల్నాడు జిల్లా ఆహార భద్రతా అధికారి (ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్) కె.వి. సుబ్బారావు విస్తృత తనిఖీలు నిర్వహించారు. కేకులు, స్వీట్లు తదితర బేకింగ్ ఉత్పత్తుల తయారీ విధానాన్ని, వాడుతున్న ముడి పదార్థాల నాణ్యతను ఆయన స్వయంగా పరిశీలించారు. నిర్దేశిత ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనలు పాటిస్తూ, పూర్తి పరిశుభ్రమైన వాతావరణంలో వినియోగదారులకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలని బేకరీ యాజమాన్యాలకు అవగాహన కల్పించారు. ఆహార పదార్థాల నాణ్యతను మరింత ఖచ్చితంగా నిర్ధారించుకోవడానికి కొన్ని నమూనాలను (శాంపిల్స్) సేకరించి ల్యాబ్ పరీక్షల నిమిత్తం పంపారు. ల్యాబ్ నివేదికలు వచ్చిన అనంతరం నాణ్యతలో ఏవైనా లోపాలు ఉంటే, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు సదరు యాజమాన్యాలపై కేసులు నమోదు చేసి భారీ జరిమానాలు విధిస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## సిమెంట్ కర్మాగారం క్వార్టర్స్‌లో దొంగల హల్చల్

**రెండు గృహాల్లో భారీ చోరీ**



**రెంటచింతల, వార్త ఆగస్టు 24 :** సత్రశాలలోని పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ క్వార్టర్స్ లో నివాసముంటున్న ఇద్దరు ఉద్యోగుల గృహాల్లోకి దొంగలు చొరబడి సమీపంలో వున్న తాళాలను తీసుకుని బీరువా డోర్లు తీయడానికి ప్రయత్నించి విఫలం కావడంతో వెనుదిరిగిన లేదని ఇనుపరాడ్లతో పగులకొట్టి బీరువాను తెరిచి బంగారు ఆభరణాలు, నగదును దోచుకెళ్లిన సంఘటన ఆదివారం రెంటచింతల మండలంలోని జెట్టిపాలెం గ్రామం పరాశక్తి సిమెంట్ కర్మాగారం లో జరిగింది. సేకరించిన వివరాలిలా ఉన్నాయి. వింజా శ్రీనివాసరావు తన కూతురుకు ఇంజనీరింగ్ సీటు కోసం భీమవరం పట్టణానికి కుటుంబసభ్యులతో కలసి వెళ్ళారు. అలాగే మద్దిగిన్ని మోహనరెడ్డి మోహనరెడ్డి వెళ్లగా వారి సమీపమని ఊరెళ్ళింది. ఇంటి తలుపులు తెరచివున్నాయని పక్కవారింట్లోళ్ళు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో బాధితులు సోమవారం ఇంటికి వచ్చి చూసే సరికి డోర్లు తెరిచి ఉండడంతోపాటు బీరువా పగలకొట్టి వస్తువులన్నీ చెల్లా చెదురుగా మంచం మీద వేయడంతో భయాందోళనకు లోనయ్యారు. క్వార్టర్స్ వెనుక నుంచి ఇంట్లోకి చొరబడి దొంగతనం చేశారు. శ్రీనివాసరావు బి12/3 గృహంలో రూ. 4 లక్షల నగదు,60 గ్రాముల బంగారం,మద్దిగిన్నిమోహనరెడ్డి బి12/6 క్వార్టర్లో రూ.1.50 లక్షల నగదు,50 గ్రాముల బంగారం అపహరణకు గురయ్యాయి. గత 18 ఏళ్లల్లో ఫ్యాక్టరీ క్వార్టర్స్ ఈ స్థాయిలో చోరీ జరగడం ఇదే ప్రథమం.. సోమవారం రాత్రి పొద్దుపోయాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫ్యాక్టరీలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఎవరెవరు ఏ ఏ ఉద్యోగాలు చేస్తున్నారో దానిపై ఎస్ఐ సిహెచ్ నాగార్జున దృష్టి పెట్టి కూపీలాగుతున్నారు.

## శ్రీ సిమెంట్ మైనింగ్ కార్యకలాపాలు నిలిపివేయాలి

**కాచవరం గ్రామస్తుల ఆందోళన**



**కారంపూడి..వార్త ఆగస్టు 24 :** శ్రీ సిమెంట్ కర్మాగారం మైనింగ్ కార్యకలాపాలను నిలిపివేయాలని మండలంలోని కాచవరం గ్రామస్తులు సోమవారం మైనింగ్ వద్ద ఆందోళనకు దిగారు. శ్రీ సిమెంట్ యాజమాన్యం మొండి వైఖరిని విన్నాడాలని అన్నారు. ఫ్యాక్టరీ మైనింగ్ తో గృహాలు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఫ్యాక్టరీ నుండి మా గ్రామాన్ని కాపాడాలని వాంఛ అన్నారు. గ్రామస్తులు ఆందోళనకు దిగడంతో తాసిల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఆర్ఐ వేము ల శ్రీనివాసరావు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. యాజమాన్యానికి, గ్రామస్తులకు ఎలాంటి వివాదం లేకుండా చూసుకోవాలని అన్నారు. గ్రామస్తులు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీని తాసిల్దార్ కు అందజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను సానుకూలంగా పరిష్కారం అయ్యే విధంగా చూస్తామని తెలపటంతో గ్రామస్తులు ఆందోళన విరమించుకున్నారు.

**గ్రామానికి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం ..**
**అసిస్టెంట్ జనరల్ మేనేజర్ లక్ష్మీ నారాయణ...**

కాచవరం గ్రామానికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని , వారి కోరిన హామీలు కొన్ని నెరవేర్చామని శ్రీ సిమెంట్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ లక్ష్మీ నారాయణ అన్నారు. గ్రామ అభివృద్ధికి సకరించామని, ముగ్గురు వ్యక్తులకు కూడా ఉద్యోగాలు కల్పించి పర్మినెంట్ చేయడం జరిగిందని తెలిపారు. అర్హత ఉన్నవారికి ఉద్యోగ కోసం కల్పిస్తామని యాజమాన్యానికి కొంత సమయం కావాలని ఆయన అన్నారు."

## జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా గోపి



**అమరావతి.( ఆగస్టు 24 ప్రభాతవార్త )** భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ గా గోపి ఎన్నికైన సందర్భంగా మంగళగిరి రూరల్ ఏవి బ్రహ్మం శాలువా కప్పి సత్కరించారు. ప్రజా సేవకై పాటుపడుతూ, ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తూ ముందుకు సాగాలని గోపికి సూచించారు. పదవులు అంటే అలంకారం కాదని ప్రజాసేవ అంకితం కావాలని గోపితో మాట్లాడారు. ప్రజల కోసం, వారి అభివృద్ధి కోసం అహర్నిశలో పనిచేసి మంచి పేరు తెచ్చుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని గోపికి సూచించారు.

## దేపంగి వారి పుష్పాలంకరణ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గజ్జల



**రాజుపాలెం, ఆగస్టు 24 (ప్రభాతవార్త):** రాజుపాలెం మండలం పెద్ద నెమలిపురి గ్రామంలో దేపంగి శౌరయ్య, కీర్తిల కుమార్తె మిధున పుష్పాలంకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి హాజరై మిధునను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మిధునకు భవిష్యత్తులో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో వేపూరి శ్రీనివాసరావు, ప్రత్తిపాటి కోటేశ్వరావు,రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ, వార్డు స్థాయిలకు చెందిన పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ

**టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దరువూరి నాగేశ్వరరావుకు ఘన సత్కారం**



**సత్తెనపల్లి, ఆగస్టు 24 (ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణంలో శ్రీ శ్రీ ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ ఉత్సవాలను బేడ బుడగ జంగాల సంక్షేమ సంఘం, కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

**టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడికి సత్కారం**

ఈ వేడుకలకు తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు దరువూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు కొత్తూరి పెద సాంబయ్య, గంధం శ్రీరాములుతో పాటు భక్తులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేయడానికి దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, బేడ బుడగ జంగాల సంక్షేమ సంఘం సభ్యులు, నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

## సత్తెనపల్లిలో యోగా శిక్షణ తరగతులు

**యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం.. ఆరోగ్యకరమైన జీవనశైలికి బాట**



**సత్తెనపల్లి (ఆగస్టు 24, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణంలోని శుభం కళ్యాణ మండపంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు."ఆరోగ్యమే మహాభాగ్యం" అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలనే ఉద్దేశంతో ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటి సాధనల ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా నేర్చుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని తెలిపారు. వేదిక: శుభం కళ్యాణ మండపం, సత్తెనపల్లిశిక్షణ అంశాలు: యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానంఆరోగ్యకరమైన సమాజం–ఆనందమైన జీవితం లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ యోగా శిక్షణ తరగతులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు."రోజూ యోగా చేద్దాం.. ఆరోగ్యంగా, ఆనందంగా జీవిద్దాం."

# మురుగు నీటిలోనే.. బీసీ కాలనీ ప్రజల బతుకులు..!

**రోడ్లు లేవు.. కాలువలు లేవు.**
**పోలేపల్లి బీసీ కాలనీలో నరకయాతన**
**చిన్నారుల ఆరోగ్యంపై ఆందోళన**
**ఎన్నికల వేళ హామీలు**
**ఆ తర్వాత ప్రజల సమస్యలు గాలికొదిలిన నేతలు**
**స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడిచినా**
**అభివృద్ధికి నోచుకోని బీసీ కాలనీ**
**సిమెంట్ రోడ్లు,మురుగు కాలువలు నిర్మించి ప్రజలకు**
**ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి**







**దుర్గి,ప్రభాతవార్త ఆగస్టు 24:**పల్నాడు జిల్లా,దుర్గి మండలం,పోలేపల్లి గ్రామంలోని బీసీ కాలనీ ప్రజల పరిస్థితి చూస్తే అభివృద్ధి యుగంలోనూ ఇంకా వెనుకబడిన ప్రాంతాలు ఉన్నాయనే విషయం స్పష్టంగా తెలుస్తోంది.కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ జీవనం సాగిస్తున్నారు.స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలకు పైగా గడిచినా,ఎన్నో ప్రభుత్వాలు మారినా,ఎన్నో హామీలు వినిపించినా ఈ కాలనీ ప్రజల సమస్యలకు మాత్రం ఇప్పటికీ శాశ్వత పరిష్కారం కనిపించడం లేదు.కాలనీలో ప్రధాన సమస్య సిమెంట్ రోడ్లు,మురుగు కాలువలు లేకపోవడమే.ఇళ్ల ముందు నుంచి ప్రవహించాల్సిన మురుగు నీరు రహదారులపైనే నిల్వ ఉండడంతో ప్రజలు ప్రతిరోజూ దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.ఇంటి నుంచి బయటకు రావాలంటే మురుగు నీటిలోనే నడవాల్సిన పరిస్థితి నెలకొంది.చిన్నపిల్లలు,వృద్ధులు,మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.మురుగు కాలువలు లేకపోవడంతో ఇంటి వద్దే నీరు నిల్వ కాకుండా ప్రజలు స్వయంగా గుంతలు తవ్వుకుని వాటిలో మురు గునీటిని చేరుస్తున్నారు.అయితే ఆ గుంతలే ఇప్పుడు దోమల పెంపక కేంద్రాలుగా మారిపోయాయి.నిల్వ ఉన్న నీటిలో వేల సంఖ్యలో దోమలు,ఈగలు పెరిగిపోతుండటంతో ప్రజలు ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారు.కాలనీలో తరచూ జ్వరాలు,విరోచనాలు, వాంతులు,చర్మవ్యాధులు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.డెంగ్యూ,మలేరియా, టైఫాయిడ్ వంటి ప్రమాదకర వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు,గర్భిణీలు, వృద్ధుల ఆరోగ్యం పట్ల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రాత్రి వేళల్లో దోమల బెడద మరింత తీవ్రంగా ఉంటోందని,ఇంట్లో ప్రశాంతంగా కూర్చోవడం కూడా కష్టంగా మారిందని కాలనీ వాసులు చెబుతున్నారు.విద్యుత్ పోయిన సందర్భాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని పేర్కొంటున్నారు.వర్షాకాలం వస్తే ఈ కాలనీ ప్రజల కష్టాలు రెట్టింపవుతున్నాయి.రోడ్లు లేకపోవడంతో వర్షపు నీరు,మురుగునీరు కలిసి కాలనీ మొత్తం చెరువును తలపించేలా మారిపోతుంది.అడుగు పెట్టినా బురద,చుట్టూ మురుగు నీరు కనిపిస్తుండటంతో ప్రజలు బయటకు వెళ్లడానికి కూడా భయపడుతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, ఉద్యోగాలకు వెళ్లే వారు కూడా తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు.అత్యవసర వైద్య పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రికి తరలించడం కూడా కష్టసాధ్యంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. వర్షం పడిన రోజుల్లో అంబులెన్స్ సైతం కాలనీలోకి సులభంగా చేరుకోలేని పరిస్థితులు ఉన్నాయని వాపోతున్నారు.ఈ సమస్యలపై ఎన్నోసార్లు గ్రామ పంచాయతీ అధికారులకు,సంబంధిత శాఖలఅధికారులకు,ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించినప్పటికీ ఫలితం కనిపించలేదని కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు.ఎన్నికల సమయంలో మాత్రమే నాయకులు వచ్చి అభివృద్ధి హామీలు ఇస్తారని,ఓట్లు పూర్తయ్యాక తమ సమస్యలను పూర్తిగా మరిచిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.బీసీ కాలనీలో నివసిస్తున్న ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత అని స్థానికులు పేర్కొంటున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీని ప్రత్యక్షంగా సందర్శించి సమస్యలను పరిశీలించాలని కోరుతున్నారు.వెంటనే సిమెంట్ రోడ్లు నిర్మించడంతో పాటు శాశ్వత మురుగు కాలువలను ఏర్పాటు చేసి పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.అభివృద్ధి,సంక్షేమం గురించి పెద్దఎత్తున ప్రచారం జరుగుతున్న ఈ రోజుల్లో పోలేపల్లి బీసీ కాలనీ ప్రజలు మాత్రం కనీస సౌకర్యాల కోసం ఎదురుచూడాల్సి రావడం బాధాకరం.ప్రజల ఆరోగ్యం, భద్రత,జీవన ప్రమాణాలకు సంబంధించిన ఈ సమస్యపై సంబంధిత అధికారులు ఎంత త్వరగా స్పందిస్తారో, పోలేపల్లి బీసీ కాలనీ ప్రజల కష్టాలకు ఎప్పుడు ముగింపు పలుకుతారో వేచి చూడాల్సి ఉంది.ఖిఖిఅభివృద్ధి అందరికీ అంటున్న ప్రభుత్వాలు. ..మురుగు నీటిలో జీవిస్తున్న పోలేపల్లి బీసీ కాలనీ ప్రజల బతుకులను ఎప్పుడు గమనిస్తాయి? ప్రజల ఓట్లు తీసుకున్న నాయకులు...వారి కష్టాలు కూడా వినిపించుకుంటారా? లేక మరో ఎన్నికల వరకు ఇదే దుస్థితి కొనసాగుతుందా?ఖిఖివేచి చూడాలి

# రెండేళ్ల నమ్మకం సంక్షేమం

**అభివృద్ధిపై ఇంటింటి ప్రచారం**



**రాజుపాలెం ఆగస్టు 24 (ప్రభాతవార్త):** రాజుపాలెం మండలం ఉప్పలపాడు గ్రామంలో నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం.. సంక్షేమం.. అభివృద్ధి" ఇంటింటి ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేసి చూపించామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతోందన్నారు.ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గర్వంగా వివరించే అవకాశం కలిగిందన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు కూడా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, మండల టీడీపీ కన్వీనర్ అంచుల నరసింహారావు, మండల జనసేన పార్టీ కన్వీనర్ తోట నరసయ్య, పులిబండ్ల సాంబశివరావు, శనగపూల వెంకయ్య, తోట శ్రీనివాసరావు, కుందూరు పేతురు, వాసా వెంకటేశ్వర్లు, అంకాల ప్రభుదాస్, పెద్దింటి శ్రీనివాసరావు, నల్లబోతు వాసు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ వార్డు స్థాయిలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



**రాజుపాలెం, ఆగస్టు 24 (ప్రభాతవార్త):** రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో ఇర్ల నాగరాజు కుమారుడు భాను ప్రసాద్ వివాహ వేడుకకు తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, మాజీ రాష్ట్ర మంత్రివర్యులు సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, పూజల వెంకట కోటయ్య, అంచుల నరసింహారావు, గుర్రాల జగన్మోహన్ రావు, ఒర్సు శ్రీహరి, ఒర్సు శ్రీనివాసరావు, పులిబండ్ల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## అధ్వానంగా పారిశుద్ధం మురికి కాలువల్లో నిలువ చేరిన మురుగునీరు

**నాలుగు రోజుల నుండి విధులకు**
**బహిష్కరించిన పారిశుద్ధ్య కార్మికులు**



**కారంపూడి..వార్త ఆగస్టు 24 :**మండల కేంద్రమైన కారంపూడిలో పారిశుద్ధం అధ్వానంగా మారింది. ప్రధాన వీధులు, దేవాలయాలు, ముఖ్య కోడలు, బస్టాండ్ సెంటర్లో ఎక్కడి చెప్తా అక్కడే ఉంది. మురికి కాలువలలో మురుగు నీరు నిల్వ చేరింది. గత రెండు రోజులు ఉండి కురుస్తున్న వర్షాలకు చెత్తాచెదారం నుండి దుర్వాసన వెదజల్లుతుంది. వర్షపు నీరు మురికి కాలువలో చేరడంతో మురుగు నీరు రోడ్లపై పాడుతుంది. పారిశుద్ధ్య కార్మికులు తమ జీతాలు చెల్లించాలని గత నాలుగు రోజులు నుండి విధులకు బహిష్కరించారు. 16 నెలల జీతాలు చెల్లించాలని గతంలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాకు తెలిపారు. స్పందించిన ఆమె విచారణ చేసి జీతాలు చెల్లించాలని జిల్లా పంచాయతీ అధికారి ని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి కారంపూడి విచ్చేసి పారిశుధ్య కార్మికులతో చర్చించారు. తక్షణమే పారిశుధ్య కార్మికులకు బ్యాంకు ఖాతాలు ఏర్పాటుచేసి వారి ఖాతాలో జీతాలు చెల్లించే విధంగా చూడాలని జులై 27వ తేదీన పంచాయతీ అధికారులను ఆదేశించారు. అధికారులు జీతాలు చెల్లించకపోవడంతో ఆగస్టు 10వ తేదీన సమ్మె నోటీసును పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. ఆగస్టు 15వ తేదీన బస్టాండ్ సెంటర్లో సమ్మెకు దిగారు. అధికారులు పారిశుద్ధ్య కార్మికులతో చర్చించి మూడు నెలల జీతాలు ఇచ్చే విధంగా ఒప్పందం కుదిరింది. ఈనెల 19వ తేదీన జీతాలు చెల్లించకపోవడంతో 21వ తేదీ నుండి కార్మికులు సమ్మె బాట పడ్డారు. పరిశుద్ధ కార్మికులు విధులకు రంగ పోవడంతో పట్టణంలో పారిశుద్ధం లోపించినట్లు అయింది.

**దోమలు విలయతాండవం..**

పారిశుద్ధ్య కార్మికులు గత నాలుగు రోజులుగా విధుల్లో కి రాకపోవడంతో మురికి కాల్వలో మురుగనీరు నిల్వ చేరింది. దీంతో దోమలు భలే తాండవం చేస్తున్నాయి. రెండు రోజులు గా కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు మురుగు కలలో చేరి దుర్వాసనతో, దోమల బారిన పడవలసి వస్తుందని పట్టణ వాసులు అంటున్నారు.

## దీపాలదిన్నెపాలెం వద్ద ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి



**సత్తెనపల్లి(ఆగస్టు 24, ప్రభాతవార్త)::** పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం దీపాలదిన్నెపాలెం సమీపంలో ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు.ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడటంతో డ్రైవర్ వాసు (55) ట్రాక్టర్ కింద ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రొక్లెయిన్ సహాయంతో ట్రాక్టర్‌ను తొలగించి డ్రైవర్‌ను బయటకు తీశారు.అయితే అప్పటికే వాసు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# దారి కాశి దోచారు



**పెదకూరపాడ(ఆగస్టు 24, ప్రభాతవార్త)::** పెదకూరపాడు రాత్రి వేళల్లో మంచినీళ్లు తాగేందుకు వచ్చిన వారిని షాపులు మూసివేసారని హాలు సెంటర్లో షాపులు ఉంటాయి అన్ని దొరుకుతాయని నమ్మబలికి నీళ్లు ఇప్పించి ఫోన్ పే చేయించి పాస్వర్డ్ గుర్తించి వారి వద్ద ఉన్న ఫోను లాక్కుని అందులో ఉన్న 70000 నగదును వేరే వ్యక్తికి ట్రాన్స్ఫర్ చేసిన ఘటన పెదకూరపాడులో చోటుచేసుకుంది. సీఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం అక్బర్, చందు నా యక్, సుభాని, మైల రాజేష్, అస్లాం ఖాన్, శివ మణికంఠ అనువార్లు దారి కాశి ఫోన్ పే ద్వారా దోపిడీ చేశారని తెలిపారు. ఎస్సై అల్లు రెడ్డి కానిస్టేబుల్ యానాది చేకచక్యంగా నిందితులను అదుపులోకి తీసుకొని విచారించి తగు చర్య నిమిత్తం కోర్టు సోమవారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సిఐ తెలిపారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే తగు చర్యలు తప్పవని సిఐ సూచించారు. యువత చెడు అలవాట్లు ఉన్నాయి దారితో పిడీలు చోరీలకు పాల్పడుతున్నారని అలాంటి వారిని సహించేటీది లేదని పోలీసు నిఘానేత్రం ఎల్లవేళలా పనిచేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అల్లు రెడ్డి బీసీలు మురళి యానాది హెడ్ కానిస్టేబుల్ రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు .

## దుర్గి మండల రైతులకు అలర్ట్

**పంటల బీమాకు ఆగస్టు 31 ఆఖరి తేదీ**

**దుర్గి,ఆగస్టు 24, ప్రభాతవార్త** దుర్గి మండలంలోని ప్రతి రైతుకు ఫార్మర్ ఐడీ తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారి వై. అమిర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, పంటల కొనుగోలు సేవలు పొందడానికి ఈ గుర్తింపు సంఖ్య ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.మరోవైపు, 2026 ఖరీఫ్ సీజన్ పంటల బీమా నమోదుకు ఆగస్టు 31 వరకు మాత్రమే గడువు ఉందని, కేవలం వారం రోజులు మాత్రమే సమయం మిగిలి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావం, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల పంట నష్టం జరిగితే ఆర్థిక రక్షణ పొందడానికి చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.ప్రీమియం వివరాలు (ఎకరాకు):మిరప: ..360/వరి: ..80/కంది: ..40/ఆగస్టు 31 తర్వాత గడువు పొడిగింపు ఉండదని, రైతులు తక్షణమే బీమా నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి వై. అమిర్ రెడ్డి సూచించారు.

## పీఆర్సీ కమిటీని వెంటనే ప్రకటించాలి



**అచ్చంపేట, ఆగస్టు 24 (ప్రభాత వార్త):** పీఆర్సీ కమిటీ కాలపరిమితి మూడు సంవత్సరాలు పూర్తయినప్పటికీ నేటికీ కమిటీని ఏర్పాటు చేయకపోవడం సరికాదని ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి, ఎమ్మెల్సీ అభ్యర్థి సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు అన్నారు. సోమవారం పల్నాడు జిల్లా అచ్చంపేట మండలంలోని పలు ఉన్నత పాఠశాలలను సందర్శించిన ఆయన ఉపాధ్యాయులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోగా పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిటీ ఏర్పాటు నాన్‌ఫైనాన్స్ అంశమైనప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. వెంటనే 30 శాతం ఐఆర్ విడుదల చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు సంబంధించిన రూ.30,500 కోట్ల ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయులను కేవలం విద్యాబోధనకే పరిమితం చేయాలని, బోధనకు ఆటంకం కలిగిస్తున్న వివిధ రకాల యాప్‌లను తొలగించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే చర్యలకు ప్రభుత్వం స్వస్తి పలకాలని సూచించారు. సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.రాబోయే శాసనమండలి ఎన్నికల్లో ఉపాధ్యాయ, ఉద్యమ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబును అఖండ మెజారిటీతో గెలిపించాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేసే నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఏఐఎస్టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ అనిల్‌కుమార్, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.ఏ మండీ, జిల్లా ఆర్థిక కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని, రాఘవ, అచ్చంపేట మండల అధ్యక్షుడు జి.గంగయ్య, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, బత్తుల సాంబశివరావు, ఇంతియాజ్, ఖుద్దూస్, అజీజ్, సుభాని, సుధీర్, రామాంజనేయులు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భవిరిశెట్టి మణిదీపిక కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ గజ్జల



**సత్తెనపల్లి (ఆగస్టు 24, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణం 20వ వార్డు వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ భవిరిశెట్టి మణిదీపిక కుమార్తె రేవతి ప్రమాదవశాత్తు లిఫ్ట్‌లో ఇరుక్కుపోయి మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని రేవతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ఈ విషాద సమయంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ, వార్డు పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గిలో జ్ఞాన జ్యోతి 2వ విడత శిక్షణ కార్యక్రమాలు

**దుర్గి,(ఆగస్టు 24, ప్రభాతవార్త):** దుర్గి మండల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు సోమవారం జ్ఞాన జ్యోతి రెండో విడత శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగేంద్రం తెలిపారు.అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులను ఏ విధంగా ఆకర్షించాలి, వారికి ఆటపాటలతో విద్యను ఎలా బోధించాలి అనే అంశాలపై మెరుగైన శిక్షణ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## పిన్నెల్లిలో ఇంటింటికి తెలుగుదేశం




**పిడుగురాళ్ల, ఆగస్టు 24 ప్రభాతవార్త :** మాచవరం మండలంలోని పిన్నెల్లి ఎస్సీ యానాది కాలనీలో సోమవారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, యువనేత యరపతినేని నిఖిల్‌బాబు పర్యవేక్షణలో తాళ్లూరి అమరనాథ్ ఆధ్వర్యాన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత గుంటూరు దస్తగిరి, వై రామిరెడ్డి, వింతల అన్నారావు, రాయపాటి చిన దానయ్య, బూత్ ఏజెంట్లు బూసి గంగులు, యేసుపొంగు చంద్రశేఖర్, వినుకొండ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన మద్దుకూరి రవీంద్రకు పలువురి అభినందనలు

**చిలకలూరిపేట, ఆగస్టు24, ప్రభాతవార్త :**



ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన మద్దుకూరి రవీంద్ర బాబు గారికి విప్లవ అభినందనలు తెలియజేసిన వారు ఏఐటీయూసీ అధ్యక్షుడు పేలూరి రామారావు, ఏఐటీయూసీ నాయకులు తన్నీరు వెంకటేశ్వర్లు, సీనియర్ సీపీఐ నాయకులు నాయుడు శివ కుమార్, సీనియర్ అడ్వకేట్ వెంకటేశ్వర రావు గారు, సీపీఐ నాయకులు గాత్రం భగత్ సింగ్ గారు, సీపీఐ నాయకులు బొంతా భగత్ సింగ్, సీపీఐ మాజీ ఇంచార్జి సుబ్బాయమ్మ గారు ఏఐటీయూసీ నాయకులు షేక్ ఖాదర్ గారు అభినందనలు తెలిపారు. ఆరాధ్యుల రామకృష్ణ మాజీ ఏఐటీయూసీ కార్యదర్శి

## పోలింగ్ స్టేషన్లు తగ్గించొద్దు..

## ఐదు పోలింగ్ కేంద్రాల్లోనే ఎన్నికలు నిర్వహించాలని వినతి



**నరసరావుపేట, ఆగస్టు 24, ప్రభాతవార్త :**రానున్న పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ స్టేషన్ల సంఖ్యను తగ్గించకుండా గతంలో మాదిరిగానే ఐదు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించాలని గ్రామానికి చెందిన పేద, బడుగు వర్గాల ప్రజలు కోరారు. ఈ మేరకు జిల్లా అధికారులకు తమ అభ్యంతరాలను సోమవారం తెలియజేశారు.గ్రామంలో గతంలో 16 వార్డులకు సంబంధించి ఐదు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరిగేవని వారు తెలిపారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో నాలుగు వార్డులకు, మండల పరిషత్ ఉర్దూ స్కూల్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దళితవాడ, మండల పరిషత్ ఎలిమెంటరీ స్కూల్ హిందూ, మండల పరిషత్ స్కూల్ ఎస్సీ కాలనీలో మిగిలిన వార్డులకు పోలింగ్ జరిగేదని పేర్కొన్నారు.అయితే ఈసారి గ్రామ సచివాలయంలో ఆగస్టు 23న వెలువడిన అనెక్చర్-1 డ్రాఫ్ట్ జాబితా ప్రకారం కేవలం మూడు పోలింగ్ కేంద్రాల్లోనే ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిసిందని తెలిపారు. జిల్లా పరిషత్ హైస్కూల్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దళితవాడలో మాత్రమే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.గ్రామంలో మొత్తం 9,968 మంది ఓటర్లు ఉన్నారని, పోలింగ్ కేంద్రాలను తగ్గించడం వల్ల ఓటర్లు అధిక దూరం వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో దొమ్మా హనుమయ్య, సూరబత్తుల శ్రీను, తెలగనీడి సాంబయ్య, ఆదం,బాబు,లక్ష్మీనారాయణ, సల్మాన్, మక్కేన నాగరాజు, తాళ్లపోగు మాణిక్యం, బిల్లా షైదా, ఖాదర్ రసూల్, మహమ్మద్ ఖాసిం, గురజాల జానీభాష, బిల్లా అల్లాబుడే తదితరులు ఉన్నారు.

## హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన తోనే నియంత్రణ



**నరసరావుపేట క్రైమ్, ఆగస్టు 24 (ప్రభాతవార్త):**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ విభాగం, హాండ్స్ ఆఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ సంస్థ ఆధ్వర్యంలో నరసరావుపేట ఏరియా హాస్పిటల్‌లో హెచ్ఐవి/ఎయిడ్స్, మత్తు పదార్థాల వినియోగం విరమణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్ కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ అంకినీడు ప్రసాద్ పాల్గొన్నారు. ఆసుపత్రిని సందర్శించిన ప్రజలకు హెచ్ఐవి వ్యాప్తి చెందే విధానాలు, నివారణ చర్యలు, సుఖవ్యాధులు, ప్రధాన లక్షణాలు, నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. హాండ్స్ ఆఫ్ కంపాషన్ ప్రాజెక్టు డైరెక్టర్ టి. ఆనంద్ బెంజిమెన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్వహిస్తున్న రెండు నెలల ఐఈసీ కార్యక్రమం గురించి వివరించారు.అవగాహన, తగిన జాగ్రత్తలతోనే హెచ్ఐవి/ఎయిడ్స్‌ను నియంత్రించగలమని, వివక్షత లేని ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ప్రాజెక్టు మేనేజర్ మీరా సాహెబ్ మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్‌పై పూర్తి సమాచారం కోసం 1097 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. హెచ్ఐవి బాధితుల పట్ల వివక్ష చూపకుండా వారితో సమానంగా జీవించాలని, మూఢనమ్మకాలను విడనాడాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ హెచ్ఐవి స్థితిని తెలుసుకోవడం బాధ్యతగా భావించాలని, హెచ్ఐవి/ఎయిడ్స్ చట్టం2017పై అవగాహన పెంచుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో ప్రాజెక్టు సిబ్బంది వాసవి, రజని, జయలక్ష్మి, శివరాజు, జ్యోతి రాణి, షాహన్ష బాజీ, ప్రసన్న, విజయ రజని తదితరులు పాల్గొన్నారు.

## ఇండోనేపాల్ ఏరోస్కేట్బాల్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన కేరిడ్జ్ విద్యార్థి



**నరసరావుపేట టౌన్, ఆగస్టు 24, ప్రభాతవార్త:**
నరసరావుపేట కేరిడ్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మోక్ష రామ్ చరణ్ నేపాల్‌లోని పోఖరాలో జరిగిన 1వ ఇండోనేపాల్ ఏరోస్కేట్బాల్ ఛాంపిన్‌షిప్ 202627లో భారతదేశం తరఫున పాల్గొని ఐదు పతకాలు సాధించాడు. ఆగస్టు 17 నుంచి 22 వరకు జరిగిన పోటీల్లో వివిధ స్పీడ్ స్కేటింగ్ విభాగాల్లో ప్రతిభ కనబరిచి ఒక స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్య పతకాలను సొంతం చేసుకున్నాడు.మోక్ష రామ్ చరణ్ విజయంపై కేరిడ్జ్ ఇంటర్నేషనల్ ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు. క్రీడలతో పాటు చదువులోనూ విద్యార్థులు రాణించేలా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో డైరెక్టర్ కొమటనేని నాసరయ్య, ప్రిన్సిపాల్ జి. బర్నబాస్, క్యాంపస్ ఇన్చార్జి కోట బాపూజీ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని మోక్ష రామ్ చరణ్‌ను అభినందించారు.

## నేత్రదానంతో మరొకరి జీవితంలో వెలుగులు



**నరసరావుపేట టౌన్, ఆగస్టు 24, ప్రభాతవార్త:**పల్నాడు జిల్లాలో 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు.డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల్లో నేత్రదానం (కార్నియా దానం)పై అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు, అవగాహన శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. మరణానంతరం కళ్లను దానం చేయడానికి ప్రజలను ప్రోత్సహిస్తామని, మన నేత్రాలు మరొకరి జీవితంలో వెలుగును ప్రసాదించవచ్చని పేర్కొన్నారు.జిల్లా అంధత్వ నియంత్రణ అధికారి డాక్టర్ ఆలా భువనేశ్వరి మాట్లాడుతూ ఒక వ్యక్తి దానం చేసిన రెండు కార్నియాలతో ఇద్దరు అంధులకు చూపు కల్పించవచ్చని తెలిపారు. మరణించిన నాలుగు నుంచి ఆరు గంటల్లోపు నేత్రాలను సేకరించడం ఉత్తమమని, అప్పటివరకు కార్నియా తేమ కోల్పోకుండా కళ్లపై తడిచేసిన దూది ఉంచాలని సూచించారు. ఎయిడ్స్, క్యాన్సర్, హెపటైటిస్ బి, సి, రక్తంలో ఇన్ఫెక్షన్ ఉన్నవారు మినహా మిగతా వారు వయసు, లింగ భేదం లేకుండా నేత్రదానం చేయవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక శాఖ అధికారి నీలకంఠం, ఆఫీస్ సూపరింటెండెంట్లు రామ్మోహన్, రామకృష్ణ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## ఆధ్యాత్మిక సేవా స్రవంతి నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



**నరసరావుపేట టౌన్ , ఆగస్టు 24 ప్రభాతవార్త ::** ఆధ్యాత్మిక సేవా స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వ్యవస్థాపకులు జల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, ప్రతిభావంతులైన 11 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2,000 చొప్పున మొత్తం రూ.22,000 ఆర్థిక సహాయం అందించారు.అనంతరం ఆధ్యాత్మిక సేవా స్రవంతి 2025 26సంవత్సరాల కు నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా చౌడం చంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా బండి కొండారెడ్డి, కోశాధికారిగా పబ్బతి నాగపద్మిని, చీఫ్ ఆర్గనైజర్‌గా వేజండ్ల సామ్రాజ్యం, కోఆర్డినేటర్‌గా గద్దె భవాని ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపాన్ని వివిధ సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాల కోసం ఉచితంగా వేదికగా అందిస్తున్నారని తెలిపారు.కార్యక్రమానికి స్పాన్సర్లుగా జల్లి నరేంద్రకుమార్, ధర్మపత్ని శ్రీదేవి రూ.15,000, నాగారపు గురుస్వామి, వెంకటరమణ రూ.10,000, మండవ వెంకటరత్నం, సీతామహాలక్ష్మి రూ.10,000 చొప్పున సహకారం అందించారు.విశిష్ట అతిథులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, మేళ్లచెరువు వీరాంజనేయులు, ఎస్ఎస్ఎన్ కళాశాల ఉపాధ్యక్షులు బత్తుల మురళి, గౌరు శ్రీనివాసరావు, వంకాయలపాటి రవి, సాతులూరి శ్రీనివాస్, వెల్లంపల్లి కేశవరావు, మండవ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్ల అభివృద్ధి..పథకాలపై ప్రజల్లో అవగాహన

**వారి సమస్యల పరిష్కారానికే ఇంటింటికీ తెలుగుదేశం**

**ప్రత్తిపాటి సాతులూరులో ఇంటింటికీ తెలుగుదేశం నిర్వహించిన ప్రత్తిపాటి**



**చిలకలూరిపేట, ఆగస్టు 24, ప్రభాతవార్త:** ప్రారంభమై నెలరోజులుగా సాగుతున్న ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమానికి లభిస్తున్న అపూర్వ ప్రజాదరణ ఏమాత్రం తగ్గలేదని, పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమయ్యేలా, ప్రభుత్వ పథకాలు, రెండేళ్ల అభివృద్ధిని వారికి వివరించేలా టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. రెండేళ్ల అభివృద్ధిని ప్రజలకు వివరించడంతో పాటు.. పథకాలపై అవగాహన ప్రజా సమస్యల పరిష్కారం దిశగా చేపట్టిన సరికొత్త కార్యక్రమం ఇంటింటికీ తెలుగుదేశమని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.సోమవారం ఆయన నాదెండ్ల మండలం సాతులూరులో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కాటి అంకమ్మ తల్లి దేవాలయాన్ని సందర్శించిన ప్రత్తిపాటి.. అక్కడ నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం రూ.25 లక్షల జిల్లాపరిషత్ నిధులతో చేపట్టిన డ్రైన్ల నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ.. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ.. కూటమిప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి, పాలనా విజయాల్ని వారికి వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల్ని ఉద్దేశించి ప్రత్తిపాటి మాట్లాడారు.సమర్థులైన పాలకు లతోనే ప్రజలకు సుపరిపాలన.. రాష్ట్రానికి అభివృద్ధితెలు గుదేశం అధినాయకత్వం ఆలోచనలు.. విధానాలు..ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు.. ప్రజలకు అందించే అభివృద్ధి.. పలు సందర్భాల్లో దేశానికే మార్గదర్శకంగా, స్ఫూర్తిగా నిలిచిందని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. సమర్థులైన పాలకుల అనుభవం.. ఆలోచనలు కార్యరూపం దాలిస్తే ప్రజలకు ఎటువంటి జవాబుదారీ, పారదర్శక సుపరిపాలన అందుతుందో చెప్పడానికి కూటమిప్రభుత్వ రెండేళ్ల పాలనే నిదర్శనమన్నారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ.. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వారి అభిప్రాయాలు, ఆలోచనలు తెలుసుకుంటూ.. వారి సమస్యలు పరిష్కరిస్తూ నెలరోజులుగా టీడీపీ శ్రేణులు సాగిస్తున్న కార్యక్రమం విశేషమైన ప్రజాదరణ చూరగొంటోందని ప్రత్తిపాటి చెప్పారు. ఇంటింటికీ తెలుగుదేశం ద్వారా ఎక్కడికక్కడ స్థానిక సమస్యల పరిష్కారం.. ప్రజావసరాలు.. మౌలిక వసతుల కల్పనకు కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాయకులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లడం ద్వారా.. ప్రజాస్వామ్యంపై వారికున్న నమ్మకం మరింత బలపడుతుందని ప్రత్తిపాటి తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జార్వర్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, టీడీపీ నాయకులు నార్నే కోటయ్య స్వామి, జంపని వసంతరావు, నందిగాం శివయ్య, నార్నే శ్రీను, కమ్మ శ్రీను, ఐనవోలు రాధా, భయ్యన శ్రీను, మాధవ రావు, శివ సత్యం, సైదా, చెన్నకేశవులు, చుండీ అనిల్, ఈధర సాంబశివరావు, నల్లమోతు హరిబాబు, వజ్జ సింగయ్య, పోపూరి మస్తాన్ రావు, పుల్లా రెడ్డి, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు వ్యక్తం.

## అమృత్ పథకం మొదటి, రెండో దశ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు**



**చిలకలూరిపేట, ఆగస్టు 24, ప్రభాతవార్త:** అమృత్ 1లో 2014-19 మధ్య చేపట్టిన మంచి నీటి పైప్‌లైన్ పనులు అసంపూర్తిగా ఉండటంతో ప్రజలు 8 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారని మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లారు.రోడ్లు తవ్వి పైపులు వేయకపోవడం, గుంతలు పూడ్చకపోవడం, పైప్‌లైన్ లీకేజీలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.అమృత్1 పాత పనులు పూర్తిచేసిన తర్వాతే కొత్త పనులు అప్పగించాలి అని ప్రత్తిపాటి కోరారు.అమృత్1, అమృత్2 పనులు సకాలంలో పూర్తయ్యేలా గుత్తేదారు సంస్థకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తామని మంత్రి నారాయణ హామీ ఇచ్చారు.టిడ్కో లబ్ధిదారుల్లో సుమారు 1,500 మందికి బ్యాంకు రుణాల సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.అర్హులైన టిడ్కో లబ్ధిదారులకు రుణాలు మంజూరయ్యేలా బ్యాంకర్లతో మాట్లాడతామని, రిజిస్ట్రేషన్ సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.టిడ్కో గృహాల్లో ఒక్క ఇల్లు కూడా ఖాళీగా ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు.ఖాళీగా ఉన్న ఇళ్లను అవసరమైతే తక్కువ అద్దెకు ఇచ్చేలా చూడాలని, అద్దెదారుల పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు.టిడ్కో గృహ సముదాయం, పరిసర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో పోలీస్ గస్తీకి సమన్వయం చేయాలని సూచించారు.పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రజల అసంతృప్తిని ఎమ్మెల్యే ప్రత్తిపాటి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.చెత్త సేకరణ, తరలింపు, వీధుల శుభ్రత, మురుగుకాల్వల నిర్వహణలో నిర్లక్ష్యం సహించేది లేదని స్పష్టం చేశారు.క్లోరినేషన్, దోమల నివారణ, మురుగునీటి నిల్వలు తొలగింపు వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.మున్సిపల్ కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. పట్టణాభివృద్ధి, ప్రజా సమస్యలపై మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి సమీక్ష సమావేశం నిర్వహించారు.

## బీసీలపై అక్రమ అరెస్టులను ఖండించిన వైఎస్సార్ సీపీ బీసీ సెల్‌నాయకులు



**రొంపిచర్ల,ఆగస్టు 24 ప్రభాతవార్త:** :వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీ నేత కారుమూరి నాగేశ్వరరావుతో పాటు బీసీ వర్గాలకు చెందిన నాయకులపై జరుగుతున్న అక్రమ అరెస్టులను వారు తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే వైఎస్సార్‌సీపీ నాయకులు, బీసీ వర్గాలపై కేసులు, అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. బీసీల హక్కులను కాపాడేందుకు వైఎస్సార్‌సీపీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. అక్రమ అరెస్టులు, వేధింపులను తక్షణమే నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సిద్దాడపు గాంధీ, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కుందుర్తి గురువాచారి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముత్రిపూడి రాంబాబు, మాచవరం మండల జడ్పీటీసీ సభ్యుడు జోనెబోయిన శివ యాదవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు గార్లపాటి స్వామి, శ్రీనివాసరావు, తోట వీరయ్య, జంగం కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## లంచాల విజయలక్ష్మిపై వెంటనే తొలగించాలి!



**నరసరావుపేట టౌన్, ఆగస్టు2 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో నీటి సంఘాల పనుల బిల్లుల విషయంలో అక్రమ వసూళ్లు, అధికారుల వేధింపులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ రొంపిచర్లకు చెందిన నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు జిల్లా కలెక్టరేట్ లో ఫిర్యాదు చేసి, కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రొంపిచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు పల్లెల నాగిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, సంతగుడిపాడు ఓఎన్ఎం డివిజన్‌కు చెందిన ఎఫ్ఏసీ డీఈ విజయలక్ష్మిపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికైన నీటి సంఘాల అధ్యక్షులను ఇబ్బందులకు గురిచేస్తూ, పనుల బిల్లుల కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. రిటైర్డ్ ఏఈ వెంకట్రావు ద్వారా ఒక్కో ఎం.బుక్‌కు రూ.8 వేల చొప్పున వసూలు చేశారని అన్నారు. గోగులపాడు నీటి సంఘం అధ్యక్షుడు అంకపరావుకు సంబంధించిన సుమారు రూ.4 లక్షల పనులకు మూడు ఎం.బుక్‌లు తయారు చేసి రూ.21 వేలు తీసుకున్నారని నాగిరెడ్డి ఆరోపించారు. అంతేకాక ండా పనుల బిల్లుల కోసం 4 అడ్వాన్స్‌గా తీసుకున్నప్పటికీ, బిల్లులు చేయకుండా జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై గతంలోనే జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడి దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు చర్యలు లేవని తెలిపారు. అవినీతి ఆరోపణలపై సమగ్ర శాఖాపరమైన విచారణ చేపట్టి, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిణిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ వద్ద డబ్బులు డిమాండ్ చేసినట్లు వాయిస్ మెసేజ్‌లు, ఫోన్‌పే లావాదేవీలకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే రిలే నిరాహార దీక్ష చేపడతామని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు కూడా సిద్ధమని నీటి సంఘాల అధ్యక్షులు హెచ్చరించారు. అవినీతి ఆరోపణలపై ఉన్నతస్థాయి విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

## బీసీలకు అధికారంలో భాగస్వామ్యం34 శాతం రిజర్వేషన్లతో చరిత్రాత్మక నిర్ణయం

**చిలకలూరిపేట, ఆగస్టు 24, ప్రభాతవార్త:** నాదెండ్ల మండలం సాతులూరులో సోమవారం బీసీలతో కలిసిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల గంగాధర్ మాట్లాడుతూ... బీసీలకు సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత కల్పించే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని గంగాధర్ అన్నారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ముఖ్యమంత్రి శాసనసభలో ప్రకటించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో బీసీలు కోల్పోయిన 16 వేలకు పైగా స్థానిక సంస్థల పదవులను తిరిగి బీసీలకు దక్కేలా చేయడం సామాజిక న్యాయానికి నిదర్శనమన్నారు. బీసీలకు ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించడం భిక్ష కాదని, అది వారి భాగస్వామ్యమని...బీసీల హక్కుల కోసం కేవలం మాటలు కాకుండా, వారికి చట్టబద్ధమైన హక్కు కల్పించాలన్న ముఖ్యమంత్రి సంకల్పాన్ని అభినందనీయమన్నారు. ప్రతి బీసీ కుటుంబం గర్వంగా చెప్పుకునేలా రిజర్వేషన్లు తీసుకొస్తున్నామని చెప్పడం ద్వారా సామాజిక న్యాయానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. సామాజిక న్యాయం-బీసీల సాధికారత-సమగ్ర ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు శ్రీకారం చుట్టడం ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు సుస్థిర పాలనకు నిదర్శనమని గంగాధర్ పేర్కొన్నారు. బీసీల్లోని అన్ని కులాలకు సమాన న్యాయం జరిగేలా ఎన్నికల రిజర్వేషన్లను అమలు చేయాలని ముఖ్యమంత్రికి గంగాధర్ విజ్ఞప్తి చేశారు.

## గడపగడపకు టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే



**నరసరావుపేట, ఆగస్టు 24, ప్రభాతవార్త:** ఉమ్మడి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన నమ్మకం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం 14వ వార్డులో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. కంభంపాలెంలోని కడియాల వెంకటేశ్వరరావు హాస్పిటల్ వద్ద, తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం నుంచి ఈ కార్యక్రమం కొనసాగింది.ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు గడపగడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజలు తమ వంతు మద్దతు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో కూడా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం ఖాయమని, నరసరావుపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయాన్ని సాధిస్తుందని ఎమ్మెల్యే అరవిందబాబు ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నాగస రపు సుబ్బరాయగుప్త, వైస్ చైర్మన్ షేక్ మీరావలి, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి రాయల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ


**అడిషనల్ ఎస్పీ**




**నరసరావుపేట క్రైమ్, ఆగస్టు 24 ప్రభాతవార్త ::**ప్రతిభావంతులైన విద్యార్థులకు క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ ద్వారా నగదు బహుమతులు అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమం కింద ఎంపికైన ఎనిమిది మంది ఉత్తమ విద్యార్థులకు ఒక్కొక్కరికి స్కాలర్‌షిప్ కింద రూ.10,000 మరియు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థి దశ జీవితంలో అత్యంత కీలకం అని అన్నారు. విద్యార్థి విద్యతోపాటు క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల అలవర్చుకోవాలని అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు సంస్థలు చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ రీజినల్ మేనేజర్ వి.కుటుంబరావు, రీజనల్ మేనేజర్ మక్బూల్ బాషా, ఏరియా మేనేజర్ సాంబయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## 22వ వార్డులో రెండేళ్ల నమ్మకం సంక్షేమం,అభివృద్ధి ఇంటింటి ప్రచారం

**కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే కన్నా**





**సత్తెనపల్లి (ఆగస్టు 24, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణంలోని 22వ వార్డులో నిర్వహించిన రెండేళ్ల నమ్మకం-సంక్షేమం-అభివృద్ధి ఇంటింటి ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే కన్నా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల నుంచి స్పందనను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేసి చూపించామని తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు.ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గర్వంగా ప్రజలకు వివరించే అవకాశం లభించిందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి చేరవేయాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు.కూటమి నాయకులు, కార్యకర్తలు కూడా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కన్నా సూచించారు.కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, వార్డు స్థాయిల్లోని కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిశోధన,ఆవిష్కరణల వైపు యువత అడుగులు వేయాలి

### -ఎల్‌ఈఓఎస్ మాజీ డైరెక్టర్ జేపి కమలాకర్ -విజ్ఞాన్స్‌లో ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు

**పొన్నూరు, ఆగస్టు 24,ప్రభాతవార్త:** యువత అంతరిక్ష సాంకేతికతపై ఆసక్తిని పెంపొందించుకుని పరిశోధన, ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని ఇస్రోలోని ల్యాబొరేటరీ ఫర్ ఎలక్ట్రో ఆప్టికల్ సిస్టమ్స్(ఎల్‌ఈఓఎస్)మాజీ డైరెక్టర్ జేపి కమలాకర్ పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం,



వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్-స్పేస్, సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెపి కమలాకర్ మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో ) భవిష్యత్ అంతరిక్ష అన్వేషణలో మరింత ప్రతిష్టాత్మకమైన మిషన్లకు శ్రీకారం చుడుతోందని తెలిపారు. చంద్రుడు, అంగారక గ్రహం, సూర్యుడు వంటి ఖగోళ వస్తువులపై పరిశోధనలతో పాటు మానవ సహిత అంతరిక్ష యాత్రలు, భూమి పరిశీలన, కమ్యూనికేషన్, నావిగేషన్ వంటి రంగాల్లో ఇస్రో చేపడుతున్న మిషన్లు దేశ అంతరిక్ష సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయనున్నాయని వివరించారు. చంద్రుడిపై మరింత లోతైన పరిశోధనలు, గ్రహాల ఉపరితలం, వాతావరణ పరిస్థితుల అధ్యయనం, అంతరిక్షంలో జీవన అవకాశాల అన్వేషణ వంటి అంశాలపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు కొనసాగుతున్నాయని తెలిపారు. మరో ముఖ్య అతిథి ఇస్రో స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ డీఆర్ఎం సముద్రయ్య మాట్లాడుతూ...ఉపగ్రహ సాంకేతికతలో ఆప్టికల్ పేలోడ్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో ఆప్టికల్ పేలోడ్స్‌లో అధిక రిజల్యూషన్, మెరుగైన ఇమేజ్ క్వాలిటీ, ఖచ్చితమైన డేటా సేకరణ సామర్థ్యం గణనీయంగా పెరిగిందన్నారు. మల్టీస్పెక్ట్రల్, హైపర్‌స్పెక్ట్రల్ ఇమేజింగ్ వంటి సాంకేతికతల ద్వారా వ్యవసాయం, వాతావరణం, నీటి వనరులు, అటవీ ప్రాంతాలు, విపత్తుల నిర్వహణ తదితర రంగాల్లో విలువైన సమాచారాన్ని పొందవచ్చన్నారు. భవిష్యత్తులో ఆప్టికల్ పేలోడ్ డేటాను కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, బిగ్ డేటా అనలిటిక్స్‌తో అనుసంధానం చేయడం ద్వారా అంతరిక్ష డేటా వినియోగంలో మరింత విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయని పేర్కొన్నారు. అనంతరం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థుల్లో అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించే ఉద్దేశంతో క్విజ్, జస్ట్ ఏ మినిట్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన విజేతలకు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ పావులూరి సుబ్బారావు, ఎస్‌డీఎస్‌సీ మాజీ డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ శేషగిరిరావు, ఆయా విభాగా డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

### -తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్

**పొన్నూరు, ఆగస్టు 24,ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ కోరారు. స్థానిక కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొంటారని, సమస్యలు పరిష్కరించుకోవడం సులభమవుతుందన్నారు. పిజీఆర్ఎస్‌కు వివిధ సమస్యలకు సంబంధించి నాలుగు అర్జీలు అందినట్లు చెప్పారు. వాటిలో పంచాయితీరాజ్‌శాఖు సంబంధించి రెండు అర్జీలు, సర్వేకి సంబంధించి ఒక అర్జీ, మునిసిపల్ శాఖకు సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు చెప్పారు. పరిష్కారం నిమిత్తం అర్జీలను ఆయా శాఖలకు పంపినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ షేక్ కరీముల్లా, ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, డిప్యూటీ ఎంపిడిఓ వేముల శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి దూపం రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం ఛైర్మన్‌గా తుమ్మల ఆనందబాబు

**పొన్నూరు, ఆగస్టు 24,ప్రభాతవార్త:** బాపట్ల జిల్లా, చెరుకుపల్లి మండలం, కావూరులో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవాలయానికి నూతన ధర్మకర్తల మండలిని దేవాదాయధర్మాదాయశాఖాధికారులు ఏర్పాటు



చేసినట్లు కార్యనిర్వహణాధికారి కావూరి శ్రీనివాసబాబు తెలిపారు. నూతన కమిటి చేత సోమవారం దేవాలయ ప్రాంగణంలో ప్రమాణస్వీకారం చేయించారు. ధర్మకర్తల మండలి అధ్యక్షుడిగా తుమ్మల ఆనందబాబు, సభ్యులుగా తలశిల సుబ్బారావు, ఆలపాటి వాణి, రాజుపాలెం రాధాదేవి, చెరుకూరి శ్రీనివాసు, నార్నెపాటి హేమ, యలవర్తి వరలక్ష్మి, బర్మా ప్రభాకరరావు, ఎక్స్ అఫిషియో సభ్యుడుగా అర్చకస్వామి కర్రి వెంకట దుర్గా మారుతీ శర్మ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటి ఛైర్మన్ తుమ్మల ఆనందబాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా నియమించినందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని, దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంతోపాటు భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పించి, గ్రామంలో ఆధ్యాత్మికత ఉట్టిపడే విధంగా చూస్తానన్నారు. కమిటి సభ్యులందరమూ ప్రణాళికాబద్ధంగా దేవాలయాన్ని ఏ విధంగా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్ళాలో ఆ విధంగా ముందుకు సాగుతామన్నారు. అభివృద్ధికి దాతలు, గ్రామస్తులు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. నూతన కమిటి చేత రేపల్లె డివిజన్ దేవాదాయధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.కుమారబాబు ప్రమాణస్వీకారం చేయించారు. నూతన కమిటీని గ్రామస్తులు సుఖవాసి వాసు, నాగళ్ళ గోపాల్ దంపతులు, తుమ్మల శైలేష్‌బాబు, లక్ష్మీనారాయణ, తుమ్మల గోపీచంద్, కొయ్యలమూడి శ్రీనివాసరావు, వట్టికూటి శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

# పంచాయితీ ఎన్నికలకు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు

### -ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు

**పొన్నూరు, ఆగస్టు 24,ప్రభాతవార్త:** త్వరలో జరగబోయే పంచాయితీ ఎన్నికలకు సంబంధించిన కసరత్తును ప్రారంభించినట్లు ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలను స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో వివరించారు. పంచాయితీ ఎన్నికల్లో భాగంగా ప్రసుత్తం మండలంలోని 29గ్రామాలకు వార్డుల విభజన పోలింగ్ స్టేషన్ల ఏర్పాటును పూర్తి చేసి



ప్రకటించడం జరిగిందన్నారు. వీటిపై అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 26వ తేదీ లోపు వ్రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. మండలంలోని 29గ్రామాలకు సంబంధించి మొత్తం 282వార్డులు ఉన్నట్లు చెప్పారు. బ్రాహ్మణకోడూరు గ్రామంలో-12, ఆరెమండ-10, నందూరు-12, పచ్చలతాడిపర్రు-10, మన్నవ-10, ఉప్పరపాలెం-10, వల్లభరావుపాలెం-8, మునిపల్లె-10, చింతలపూడి-14, మామిళ్ళపల్లి-12, వడ్డిముక్కల-10, వెల్లలూరు-10, ములుకుదురు-12, ఆలూరు-10, కొండముది-8, దొప్పలపూడి-10, జూపూడి-10, జడవల్లి-8, మాచవరం-12, గోళ్ళమూడిపాడు-8, తాళ్ళపాలెం-6, కసుకర్రు-10, పెదపాలెం-10, కట్టెంపూడి-10, గాయంవారిపాలెం-8, చిన ఇటికంపాడు-8, దండమూడి-8, పెద ఇటికంపాడు-8, సీతారామపురం-8 వార్డులున్నట్లు చెప్పారు. ఒక్కో వార్డు, ఒక్కో పోలింగ్ స్టేషన్‌గా పరిగణించడం జరుగుతుందన్నారు.

# భక్తిశ్రద్ధలతో ఆరాదనా మహోత్సవాలు

**పొన్నూరు, ఆగస్టు 24,ప్రభాతవార్త:** మండల పరిధి కట్టెంపూడి శ్రీ నాగే ంద్రస్వామి దేవాలయం ఎదురుగా కొలువై ఉన్న శ్రీ షిరిడి సాయి, భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి మందిరంలో సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఆరాధనా మహోత్సవాలు జరిగాయి. తొలుత శ్రీ సా ్వమివార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి హారతి, నైవేద్యాలను సమర్పించారు. భజన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం పెద్ద ఎత్తున అన్న ప్రసాదవితరణ కార్యక్రమం జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కొల్లిపర సాంబశివరావు,పబ్బిశెట్టి త్రినాధ గుప్తా నేతృత్వంలో వాలంటీర్లు ఏర్పాట్లు చేశారు.



# కార్యకర్త మృతి పార్టీకి తీరనిలోటు

### -వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

**పొన్నూరు, ఆగస్టు 24,ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొండముది గ్రామానికి చెందిన వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ క్రియాశీలక కార్యకర్త బోయిన శ్రీధర్ మృతి పార్టీకి తీరని లోటని వైకాపా సమన్వయ ్కర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. బోయిన శ్రీధర్ గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న అంబటి మురళీకృష్ణ కొండముది గ్రామానికి వచ్చి కార్యకర్త



భౌతిక కాయంపై పూలమాలలు ఉంచి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీధర్ అంత్యక్రియల్లో అంబటి మురళీకృష్ణ పాల్గొని పాడెమోసి స్మశానం వరకు కన్నీటితో కార్యకర్తను సాగనంపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు మునిసిపల్ మాజీ డిప్యూటీ ఫ్లోర లీడర్ బోయిన శివనాగరాజు, మాజీ సర్పంచి బోయిన శివ శంకర పద్మారావు, వైకాపా పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ నాజర్, చక్కా హారీష్ తదితరులున్నారు.

# సిసి రహదారి నిర్మాణానికి శంఖుస్థాపన

**నిజాంపట్నం, ఆగష్టు 24, ప్రభాతవార్త :** రహదారులు అభివృద్ధికి చిహ్నాలని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు కొలసాని రాము అన్నారు. సోమవారం మండలంలోని కూచినపూడి శివారు పుర్లమెరకలో మండల పరిషత్ నిధులతో నిర్మించనున్న సిసి



రహదారికి ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఈ కార ్యక్రమంలో ఎల్లయ్య, రామారావు, కార్యదర్శి మల్లీశ్వరి, వెంకటేశ్వరరావు, బుజ్జాయి తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన రహీంసాహెబ్ కవితాగానం

**పొన్నూరు, ఆగస్టు 24,ప్రభాతవార్త:** మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని గుంటూరుకు చెందిన ముస్లీం రచయితల సంఘం నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆర్టీసీ కండక్టర్ షేక్ రహీంసాహెబ్‌కు ప్రశంసాపత్రం అందుకున్నారు. మిలాద్ నబీ అనే కవితా గానంతో సాహితీ కవులను అలరింపచేశారు. రహీంసాహెబ్ కవితాగానం విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం జరిగిన కార్యక్రమంలో మురసం జాతీయ వేదిక అధ్యక్షుడు షేక్ హాకీమ్, గర్తుపురి బషీర్‌లు షీల్డ్, శాలువా, ప్రశంసాపత్రాలతో రహీంసాహెబ్‌ను ఘనంగా



సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యవ ంండలి అధ్యక్షుడు గని సుబానీ, జానీబాషా, నజీర్, జావేద్, సుబ్రహ్మణ్యం, ఫ్రాన్సిస్, తెలుగు, ఉర్దూ కవులు పాల్గొన్నారు. ఉత్తమ పురస్కారం పొందిన రహీంసాహెబ్‌ను డిపో మేనేజర్ మోహన్‌కృష్ణయాదవ్, ఆర్టీసి కార్మికులు, ఉద్యోగులు అభినందించారు.

# శిక్షణలో నేర్చుకున్నవాటిని అమలు చేయాలి

**నిజాంపట్నం, ఆగష్టు 24, ప్రభాతవార్త :** ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తల కోసం ఏర్పాటు చేసిన జ్ఞానజ్యోతి 120 రోజుల శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను గ్రామాల్లో అమలు చేయాలని ఎంఇఓ శేషుగోపాలం అన్నారు. సోమవారం ఆయన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అవార్డులు



పొందిన ఎంఇఓ 2 శేషుగోపాలంను, అంగన్‌వాడీ కార్యకర్త మేరిమణిని ఐసిడిఎస్ సిబ్బంది సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ అనసూయ, సూపర్‌వైజర్ స్వరూపరాణి, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోంది

### ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

**ప్రత్తిపాడు (పెదనందిపాడు), ఆగస్టు 24, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగుతోందని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. పెదనందిపాడు మండలంలోని పాలపర్రు గ్రామంలో సోమవారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రెండేళ్ల నమ్మకం - సంక్షేమ విజయాలు, ప్రజా పాలన-ఇంటింటికీ అభివృద్ధి కార్యక్రమాన్ని పార్టీ



శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు, కార్మికులతో సహా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. గ్రామ స్థాయిలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతోందని వెల్లడించారు. నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామస్తులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అన్నపర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు మౌలిక వసతులు పాఠశాల పరిసరాలను నిశితంగా పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి విద్యాభ్యాసం, సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. నేటి విద్యార్థులు రేపటి సమాజానికి నాయకులని తెలిపారు. నందిపాడు మండలం టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ కాంద్రు ప్రసాద్ వారి వివాహ రిసెప్షన్ కు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కూటమి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ స్థాయి నాయుకులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్తి పంటలో గులాబీ పురుగు నివారణపై అవగాహన సదస్సు

**ప్రత్తిపాడు, ఆగస్టు 24, ప్రభాతవార్త :** ప్రత్తి పంటలో ఫిరమోన్ ట్రాప్స్ ద్వారానే గులాబీ రంగు పురుగును నివారించవచ్చని వ్యవసాయ శాఖ ఏడిఏ ఎన్.మోహన్రావు తెలిపారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ల్యాంప్ స్వచ్ఛంద సంస్థ, కెవైఆర్డి మరియు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు గులాబీ రంగు కాయతోలుచు పురుగు యాజమాన్య పద్ధతులపై ఒకరోజు శిక్షణ కార్యక్రమము జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త ఏ.మనోజ్ హాజరై మాట్లాడుతూ..గులాబీ రంగు పురుగు నివారణకు పూత దశ నుండి ఎకరానికి నాలుగు నుండి ఆరు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీనిద్వారా గులాబీ రంగు కాయ తోలుచు పురుగు ఉధృతిని అంచనా వేసుకొని పురుగుమందులు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. తొలిదశలో ఈ పురుగు నివారణకు ఐదు శాతం వేప గింజల కషాయం మరియు ఎకరానికి



రెండు లేదా మూడు పక్షిస్థావరాలు ఏర్పాటు చేసుకోవడం, ఎండాకాలంలో లోదుక్కులు వేసుకోవటం, మిగిలిన పంటల మోడ్లను గొర్రెలను మేపించడం లాంటి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వివరించారు. గులాబీ పురుగు తొలిదశలో స్పైనోర్టోమ్, క్యూరాక్రాన్, ఇండాకసీ కార్బ్, ఏమమేక్టిన్ బెంజోఎట్ లాంటి మందులను పిచికారీ చేసుకోవాలని సూచించారు. పురుగు చివరి దశలో సింథటిక్ పైరిత్రాయిడ్స్ అయినా సైపర్ మేత్రిన్, లేమ్డా సహాలుత్రిన్ లాంటి మందులను వాడుకోవాలని తెలిపినారు. మరో అతిథి ఏడిఏ మోహన్ రావు మాట్లాడుతూ..ప్రత్తి మరియు ఇతర పంటలు వేసుకున్న రైతులు వెంటనే గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి పంట నమోదు చేసుకోవాలని, దీని ద్వారానే రైతులకు ఎరువులు, పంట నష్టపోయినచో ప్రభుత్వం అందించే నష్టపరిహారానికి అర్హులని, కాటన్ కార్పొరేషన్ ఇండియా వారికి ప్రత్తి మద్దతు ధరకు పంటలను అమ్ముకోవచ్చని తెలిపినారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జె.వాసంతి, ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్, టి.మధుసూదనరావు, అధ్యక్షులు కెవైడిటి అఖిల్, అసిస్టెంట్ మేనేజర్, ప్రమోద్ అసోసియేట్, వ్యవసాయ సిబ్బంది షేక్ సుభాని, గ్రామ వ్యవసాయ సహాయకులు నాగేశ్వరావు, హకీమ్ గౌస్, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

# రేపల్లెలో వంద పడకల వైద్యశాల ఏర్పాటు చేయాలి

**రేపల్లె, ఆగస్టు 24, ప్రభాతవార్త:** రెవెన్యూ డివిజన్ కేంద్రమైన రేపల్లెలో 100 పడకల వైద్యశాల ఏర్పాటు చేయాలని రేపల్లె పట్టణ ఆదర్శ వేదిక ప్రతినిధులు సోమవారం రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవికి వినతిపత్రం సమర్పించారు.పాముకాటు,క్రిమి సంహారక మందు సేవించిన వ్యక్తులు తీరప్రాంతంలోని 35 కి.మీ దూరం నుండి రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు వెళ్తే ప్రాథమిక స్థాయి వైద్యం మాత్రమే అందుతున్నదని,ఆరోగ్య పరిస్థితి విషమించడంతో దూరంగా ఉండే గుంటూరుకు పంపే పరిస్థితి కారణంగా దారిలోనే మృత్యువాతపడతున్నారని ప్రతినిధులు పేర్కొన్నారు.ఉన్నతమైన వైద్యం అందుబాటులో ఉంటే ప్రజల ప్రాణాలకు ముప్పువాటిల్లదని తెలిపారు.డయాలసిస్ చేయించుకోవాలంటే తెనాలి,అవనిగడ్డ డయాలసిస్ సెంటర్లపై ఆధారపడాల్సి వస్తున్నందున రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు.రేపల్లె ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చర్యలు



తీసుకోవాలని,అధికారులు స్పందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఆదర్శ వేదిక అధ్యక్ష కార్యదర్శులు బి.వెంకట మోహనరావు,యడ్లపల్లి కిషోర్‌బాబు, జి.నాంచారయ్య, జె.కళ్యాణి, ఎ.పూర్ణ శ్రీలక్ష్మి,కె.కోటేశ్వరరావు, కె.ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్‌కి 7 అర్జీలు

**రేపల్లె, ఆగస్టు 24, ప్రభాతవార్త:** పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు 7 అర్జీలను ఆర్డీవో బి.శ్రీదేవికి అందజేశారు.పొలంలో ఏర్పాటు చేసిన



విద్యుత్ స ్తంభాలను తొలగించాలని,శానిటరీ పథకం కింద చెల్లించాల్సిన బకాయిలు మంజూరు చేయాలని,సిసి రోడ్ నిర్మాణం జరుగుతున్నందున సైడ్ కాల్వల నిర్మాణాన్ని చేపట్టాలని,రైస్ కార్డులో పేరు చేర్పించాలని,కల్వర్టు,సిమెంట్ రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని,ఇంటిపై ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని,ఇంటి స్థలంలో మున్సిపాలిటీ రహదారి నిర్మాణం జరిగినందున పరిహారం చెల్లించాలని కోరుతూ జంపని,అరవపల్లి,పేటేరు,నల్లూరిపాలెం, గొరిగపూడి,ౘ ౖతేపల్లి,రేపలె ్ల మున్సిపాలిటీకి చెందిన ప్రజలు అర్జీలు సమర్పించారు.వీటిని పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్డీవో శ్రీదేవి వెల్లడించారు.

# ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

**నగరం, ఆగస్టు 24, ప్రభాతవార్త:** నూతన విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం, స్నేహ భావాన్ని పెంపొందించుకోవాలని ఎస్. వి .ఆర్.ఎం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి అన్నారు. సోమవారం కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ ,సమయపాలన, మంచి నడవడిక నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత అలవరచుకోవాలని సూచించారు. ఈ



సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు కళాశాలలో అందిస్తున్న విద్య క్రీడా మిగతా అవకాశాలు సద్వినియోగపరుచుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయ సూచనలను పాటిస్తూ తల్లిదండ్రులు ఆశయాలను నెరవేర్చే విధంగా కష్టపడి చదవాలని సూచించారు. విద్యార్థులు మంచి వ్యక్తిత్వం, క్రమశిక్షణ, మానవతా విలువలు పెంపొందించుకోవాలని తెలిపారు. అనంతరం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభను ప్రోత్సహిస్తూ నగదు బహుమతులు అందజేశారు. ఇంటర్మీడియట్ ఇన్చార్జి ప్రిన్సిపల్ డిజి నాయుడు రెడ్డి మాట్లాడుతూ కళాశాలలోకి నూతనంగా వచ్చిన విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి. శ్రీనివాస్, కళాశాల సూపరింటెండెంట్ అమరేష్ రెడ్డి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# షావుకారు జానకి మృతికి అభ్యుదయ కళా సమితి నివాళి

**తెనాలి ఆగస్ట్ 24(ప్రభాతవార్త):** ప్రముఖ సినీనటి,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పద్మశ్రీ అవార్డు గ్రహీత షావుకారి జానకి, సినీ ప్రేక్షకుల హృదయాలలో చెరగని ముద్ర వేశారని వక్తలు శ్రద్ధాంజలి ఘటించారు. తెనాలి గాంధీనగర్ ఇస్కఫ్ సమావేశ హాలులో అభ్యుదయ కళా సమితి తెనాలి ఆధ్వర్యంలో సోమవారం జానకి సంస్మరణ సభ జరిగింది. ఈసందర్భంగా ఈమనిహైస్కూల్ ఉపాధ్యాయులుటి .పాపారావు మాట్లాడుతూ,ఏడు దశాబ్దాలకు పైగా సాగిన సుదీర్ఘ ప్రస్థానంలో తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో నటించార న్నారు.ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎంజీఆర్, శివాజీ గణేషన్ వంటి దిగ్గజ నటుల సరసన కథానాయకగా నటించడం తో పాటు తదనంతరం తల్లి, అమ్మమ్మ, నాన్నమ్మ వంటి విభిన్న పాత్రలోనూ తన సహజ నటనతో ప్రేక్షకులను మెప్పించారని ఆమె స్ఫూర్తితో నేటితరం ముందుకు సాగాలని జోహార్లు అర్పించారు. ఇస్కఫ్ జిల్లా నాయకురాలు చల్లగాని శ్రీదేవి మాట్లాడుతూ, జానకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి పలు సంస్థల నుండి పలు అవార్డులు, నంది అవార్డులు, జీవిత సాఫల్య పురస్కారాలు పొందారన్నారు. సాయిమంగావెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కంకిపాటి రమేష్ కుమార్ మాట్లాడుతూ, షావుకారు చిత్రంతో జానకి నటించి అద్భుత విజయం సాధించి ఆ సినిమా పేరు ఆమెకు శాశ్వత ఇంటి పేరుగా మారడం ఆమె నటనకు తార్కాణమని పేర్కొన్నారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ఏనటికి దక్కని అరుదైన గౌరవం జానకికి దక్కిందన్నారు. సినిమాల్లో నటిస్తూనే వందలాది నాటకాల్లో వివిధ పాత్రల్లో నటించి ప్రజా చైతన్యం కోసం



కృషి చేశారన్నారు. సినీ నటిగానే కాక అనాధాశ్రమాలకు పేద ప్రజలకు జీవితాంతం తన సహాయ సహకారాలు అందించిందన్నారు. సభ ప్రారంభంలో ఆమె చిత్రపటానికి కళాకారులు, సాహితీ సాంస్కృతిక విభాగాల ప్రముఖులు పూలమాలవేసి స్మృత్యంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో ఇస్కఫ్ జిల్లా ఆద్యక్షులు బొల్లిముంతకృష్ణ, బెల్లంకొండ వెంకట్, ఓ.మార్కండేయులు ,దేవరపల్లి నీలాంబరం, చందుఅనురాధ, కన్నెగంటి వెూనిక, చింపయ్య, లక్కరాజు లక్షణరాజు తదితరులుపాల్గొన్నారు.

# దాణా పంపిణీ

**తెనాలి ఆగస్ట్ 24(ప్రభాతవార్త):** తెనాలి పట్టణ ముస్లిం మైనారిటీ నాయకుడు, శ్రీ శివ లింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి సభ్యుడు, షేక్ మీరావలి జన్మదినం సందర్భంగా సోమవారం,శ్రీ శివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవా సమితి అధ్యక్షులు కుర్రా శ్రీను ఆధ్వర్యంలో,తెనాలి బుర్రిపాలెం రోడ్డు లో వున్న గోశాల నందు గోవులకు మేత,



దాణా పంపిణీ తదుపరి స్థానిక రైల్వేస్టేషన్ వద్ద శ్రీ శివలింగేశ్వరస్వామి భక్తబృందం అన్నదానం కేంద్రం వద్ద పేదలకు వృద్ధులకు, వికలాంగులకు, నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమము నిర్వహించారు.ఈ కార్యక్రమంలో,షేక్. కాలేషా,జె.బి.జిలాని,కుంపటి దావీదు, యన్.ఆర్.కె.శర్మ,భాషా, అన్నం గణపతి,పాశం వెంకటేష్, కె.రవిశంకర్, రాజేష్, విజయ్,మునిపల్లి వంశీ,బి. పోతురాజు,మరియు సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

# డ్రైవర్‌కు గుండెపోటుతో ఇంజనీరింగ్ కళాశాల బస్సుకు ప్రమాదం

**గుంటూరు విద్య ఆగస్టు 24 ప్రభాతవార్త :** ఏటుకూరు రోడ్డు సమీపంలోని ఒక ఇంజనీరింగ్ కళాశాల 2బి రూటు బస్సు ఎస్వీఎన్ కాలనీ పాయింట్ వద్ద విద్యార్థులను ఎక్కించుకుని వెళుతున్న సమయంలో కరూర్ వైశ్యా బ్యాంక్ సమీపంలో బస్ డ్రైవర్ కు అకస్మాత్తుగా గుండె నొప్పి రావడంతో స్టీరింగును నియంత్రించలేక రోడ్డు ప్రక్కనే ఉన్న ఎలక్ట్రికల్ స్తంభానికి బస్సు ఢీ కొంది. ఈ అకస్మాత్తు పరిణామానికి స్థానికులు వెంటనే అప్రమత్తమై డ్రైవర్ను సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో బస్సు లో ఉన్న ఎవరికి కూడా ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

25-8Pg5:25-8Pg5.qxd 24/Aug/26 10:49 PM Page 1



# ప్రజారక్షకుల భద్రత మన బాధ్యత



## నిరసన తెలిపే హక్కు హింసగా మారకూడదు..
## పోలీసులపై భౌతిక దాడులు ప్రజాస్వామ్య విరుద్ధమే
## ప్రజల భద్రత కోసం పోలీసులు చేసే త్యాగాలను గుర్తించాలి

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** ఏ ప్రజాస్వామ్య వ్యవస్థ సజావుగా పనిచేయాలన్నా నిరసన తెలిపే హక్కు, భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ, వ్యవస్థలో జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసే హక్కు అత్యంత కీలకం. పౌరులకు తమ సమస్యలను గళమెత్తి చెప్పే, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే, మార్పు కోసం డిమాండ్ చేసే ప్రాథమిక స్వేచ్ఛ ఉంది. అయితే, చట్టబద్ధమైన పౌర నిరసన హింస, విధ్వంసం, చట్టవ్యతిరేక చర్యలు, ప్రజా శాంతి భద్రతలను కాపాడే పోలీసులపై ప్రత్యక్ష దాడులుగా మారినప్పుడు పరిస్థితి తీవ్రంగా మారుతుంది. ఢిల్లీలో ఇటీవల ఉద్రిక్తతలుతీవ్రరూపం దాల్చి, రాళ్లు రువ్వడం, బారికేడ్లను ధ్వంసం చేయడం వంటి ఘటనల్లో 100 మందికి పైగా పోలీసు సిబ్బంది గాయపడటం తీవ్రంగా పరిగణించాల్సిన అంశం. ఇది కేవలం నిరసన కాదు. చట్టబద్ధమైన సమాజ వ్యవస్థను కాపాడేందుకు విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ సిబ్బందిపై జరిగిన హింసాత్మక దాడిగా చూడాల్సి ఉంటుంది. యూనిఫాం వెనుక ఉన్న మానవీయ కోణంపోలీసు వ్యవస్థను కేవలం ప్రభుత్వ ప్రతినిధులుగా లేదా నిరసనకారులకు అడ్డుగా నిలిచే వ్యక్తులుగా చూడటం సరికాదు. హెల్మెట్లు, రక్షణ కవచాలు ధరించి విధులు నిర్వహించే ప్రతి పోలీసు వెనుక ఒక మనిషి ఉంటాడు. వారు తల్లులు, తండ్రులు, కుమారులు, కుమార్తెలు. ప్రతిరోజూ తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తూ, తమ కుటుంబాల వద్దకు సురక్షితంగా తిరిగి వెళ్లాలని కోరుకునే వారే. కొన్ని వారాలుగా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ భద్రతా సిబ్బంది ఎంతో సహనం, వృత్తి నైపుణ్యం, సంయమనంతో వ్యవహరించారు. దూషణలు, ఎగతాళి, నినాదాలు ఎదురైనా శాంతి భద్రతలను కాపాడే తమ బాధ్యతను నిర్వర్తించారు. అయితే పోలీసులపై భౌతిక దాడులకు దిగడం మాత్రం ప్రజాస్వామ్య నిరసనకు సంబంధించిన అన్ని హద్దులను దాటడమే. న్యాయం కోసం పోరాడుతున్నామనే పేరుతో అల్లకల్లోలాన్ని సమర్థించే ప్రమాదకర ధోరణి ఇటీవలి కాలంలో కనిపిస్తోంది. అయితే వ్యవస్థలో జవాబుదారీతనం కోరుతూ అదే సమయంలో ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం, పోలీసులపై దాడులు చేయడం, రోడ్లపై పూర్తిస్థాయి అరాచక పరిస్థితులు సృష్టించడం ద్వారా నిజమైన మార్పు సాధ్యం కాదు. సమాజం ఒక సామాజిక ఒప్పందంపై ఆధారపడి ఉంటుంది. ప్రజలు సామూహిక ప్రయోజనం కోసం రూపొందించిన చట్టాలను పాటించాలి. ప్రభుత్వం ప్రజలను రక్షిస్తూ న్యాయాన్ని అమలు చేయాలి. గుంపులు బారికేడ్లను కూల్చి పోలీసు బలగాలపై దాడి చేసినప్పుడు ఈ సామాజిక ఒప్పందాన్నే దెబ్బతీసినట్టవుతుంది.

**భిన్నాభిప్రాయాలకు గౌరవం అవసరం:**

జవాబుదారీతనం పారదర్శకత, చర్చ, చట్టపరమైన వ్యవస్థల ద్వారా సాధించాలి. భౌతిక బెదిరింపులు, గుంపుల ఆధిపత్యం ద్వారా కాదు. చట్టబద్ధ వ్యవస్థను ధ్వంసం చేస్తూనే ప్రభుత్వ సంస్థల నుంచి జవాబుదారీతనం కోరడం పరస్పర విరుద్ధమైన చర్య. జవాబుదారీతనం సాధించాలంటే ముందుగా చట్టబద్ధమైన వ్యవస్థ, క్రమశిక్షణ అవసరం. రాజధాని భద్రతను కాపాడటం పోలీసుల బాధ్యనిరసనలు పద్ధతి ప్రకారం నిర్వహించే కార్యక్రమాల నుంచి పోలీసు బలగాలపై ప్రణాళికాబద్ధమైన దాడులుగా మారినప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోతుంది. అది ఇక సాధారణ నిరసన కాదు. ప్రజల భద్రత, జాతీయ భద్రత, చట్టబద్ధ పాలనకు ప్రత్యక్ష ముప్పుగా పరిణమిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో నగర భద్రతను, ప్రభుత్వ మౌలిక వసతులను, అమాయక ప్రజలను కాపాడాల్సిన చట్టపరమైన, నైతిక బాధ్యత పోలీసు వ్యవస్థపై ఉంటుంది. పోలీసులు ఘర్షణను కోరుకోరు. ప్రజా భద్రతకు స్పష్టమైన ముప్పు ఏర్పడినప్పుడు స్పందించాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది అదుపు తప్పిన హింస, అల్లకల్లోలం నుంచి సామాన్య ప్రజలను కాపాడటం పోలీసుల ప్రాథమిక బాధ్యత. బారికేడ్లను రక్షించడం, హింసకు పాల్పడుతున్న వారిని అడ్డుకోవడం ద్వారా స్థానికంగా మొదలైన అల్లర్లు విస్తృత విధ్వంసానికి దారితీయకుండా నిరోధించవచ్చు.

**చట్టబద్ధ పాలన పరిరక్షణ:**

పోలీసులపై ఎలాంటి శిక్ష లేకుండా హింసకు పాల్పడేందుకు అనుమతిస్తే, చట్టం కంటే బలప్రయోగమే పైచేయి అనే ప్రమాదకర సందేశం వెళ్తుంది. ఇది చట్టంపై ఆధారపడే ప్రతి పౌరుడి భద్రతకు ముప్పుగా మారుతుంది. పోలీసు, భద్రతా సిబ్బందికి మన మద్దతు అవసరంభద్రతా బలగాలపై హింసను సాధారణ చర్యగా అంగీకరించడాన్ని సమాజం స్పష్టంగా తిరస్కరించాలి. ప్రభుత్వ విధానాలను విమర్శించడం, నిర్ణయాలను ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కు. అయితే చట్టాన్ని అమలు చేసే బాధ్యతలో ఉన్న పోలీసు సిబ్బందిపై భౌతికంగా దాడి చేయడంమాత్రం నేరం. సమాజంగా మనం పోలీసు, భద్రతా సిబ్బందికి అండగానిలవాలి. ఉద్రిక్త పరిస్థితుల్లో వారు ప్రదర్శించిన సంయమనాన్ని గౌరవించాలి. ప్రజల భద్రత కోసం వారు చేస్తున్న త్యాగాలను గుర్తించాలి. శాంతిభద్రత లను కాపాడే తమ విధులను ఎలాంటి అనవసర హింసా భయం లేకుండా నిర్వర్తించే పరిస్థితిని కల్పించాలి. పరస్పర గౌరవం, చట్టబద్ధత, శాంతియుత నిరసనల ద్వారానే నిజమైన పురోగతి, న్యాయం, సంస్కరణ సాధ్యమవుతాయి. ప్రజలను రక్షించే వారిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజానిదే.



# కేంద్ర కేబినెట్ ప్రక్షాళనకు ముహూర్తం ఖరారు!
## 20 మంది మంత్రులపై వేటు లేదా శాఖల్లో మార్పు?

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే కేంద్ర కేబినెట్ ప్రక్షాళన చేసేందుకు సిద్ధమైన ప్రధాని మోడీ వివిధ కారణాలతో అది కాస్తా వాయిదా వేసుకున్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా జాతీయ స్థాయిలో ఒక్కసారిగా పెనుమార్పులు సంభవించాయి. అదే సమయంలో వీటి ప్రభావం త్వరలో జరిగే మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై పడేలా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ముందుగా బిజెపి జాతీయ కార్యవర్గంలో మార్పులు చేర్పులు చేసిన మోడీ ఇప్పుడు తన కేబినెట్ ప్రక్షాళనకు సిద్దమవుతున్నారు. ఈ మేరకు ముహుర్తం కూడా ఖరారైనట్లు తెలుస్తోంది. దేశంలో మారిన పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యతల్ని మార్చుకోవడంతో పాటు తిరిగి జనంలో విశ్వాసం పెంచుకోవడానికి ప్రధాని మోడీ ప్రయత్నిస్తున్నట్లు ఢిల్లీ వర్గాల సమాచారం. ముఖ్యంగా రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు వీలుగా కేబినెట్లో మార్పులు చేసుకోవాలని మోడీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఈసారి కేబినెట్ మార్పులు కచ్చితంగా జాతీయ స్థాయిలో కీలక సంకేతాలు ఇచ్చే విధంగా ఉంటాయని చెప్తున్నారు. ఇప్పటికే కేబినెట్ ప్రక్షాళనకు రంగం సిద్దంచేసుకున్న ప్రధాని మోడీ అందులో భాగంగానే ఇద్దరు మంత్రులకు రాజ్యసభ కొనసాగింపు ఇవ్వలేదు, అలాగే మరో ముగ్గురిని ఎన్నికలు జరిగేరాష్ట్రాలకు ఇన్‌ఛార్జ్‌లుగా పంపారు. ఇప్పుడు కేబినెట్లో మిగిలిన మంత్రుల్లోనూ పలువురికి ఉద్వాసన పలికేందుకు సిద్దమవుతున్నట్లు తెలుస్తోంది. మరికొందరు శాఖల మార్పు తప్పనిసరిఅవుతోంది. ఇందులో ప్రధానంగా వినిపిస్తున్న పేరు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్. ఆమెను వేరే శాఖకు పంపి, ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌ను ఆర్థికమంత్రిగా నియమించే అవకాశముంది. అలాగే రెగ్యులర్ విద్యాశాఖ మంత్రిని కూడా నియమించే అవకాశం ఉంది. పలు కీలక శాఖల్లోనూ మార్పులు ఉంటాయని తెలుస్తోంది. ఇలా చూస్తే మొత్తం మీద 20 మంది మంత్రుల వరకూ వేటు లేదా శాఖలమార్పు ముప్పు ఎదుర్కొంటున్నట్లు ఢిల్లీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. ఇందులో భాగంగా పలువురు జూనియర్ మంత్రులపై వేటుపడొచ్చని చెప్తున్నారు. లేదా వేరే శాఖలకూ పంపే అవకాశం ఉంది. అలాగే ఎన్నికలు జరిగే యూపీ, గుజరాత్, పంజాబ్ నుంచి కొత్త మంత్రులు కేబినెట్లోకి రాబోతున్నారు.

# మిస్ యూనివర్స్ ఇండియాగా కజియా లిజ్‌మెజో





**జైపూర్, ఆగస్టు 24:** కేరళకు చెందిన 19 యేళ్ల కజియా లిజ్ మెజో మిస్ యూనివర్స్ ఇండియా 2026 కిరీటం దక్కించుకుంది. జైపూర్‌లోని జీ స్టూడియోస్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలేలో ఆమె విజేతగా నిలిచింది. దేశవ్యాప్తంగా పోటీపడిన 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి టైటిల్ సొంతం చేసుకుంది. మిస్ యూనివర్స్ ఇండియా 2025 విజేత మానికా విశ్వకర్మ ఆమెకు కిరీటం అలంకరించారు. దీంతో నవంబర్‌లో ప్యూర్టోరికోలో జరిగే 75వ మిస్ యూనివర్స్ పోటీలో భారత్ తరఫున కజియా ప్రాతినిధ్యం వహించనుంది. కిరీటం దక్కిన అనంతరం కజియా ఆనందం వ్యక్తం చేసింది. ఈ కిరీటం కోసం మూడేళ్లకు పైగా కష్టపడ్డానని తెలిపింది. తన సొంత రాష్ట్రం కేరళకు ఈ విజయాన్ని తీసుకెళ్లడం ఎంతో గర్వంగా ఉందని చెప్పింది. 19 ఏళ్ల వయసులో ఇంత పెద్ద వేదికపై నిలవడానికి ఎంతో ధైర్యం అవసరమైందని కజియా పేర్కొంది. తనపై తనకు నమ్మకం పెంచుకోవడం అతిపెద్ద సవాలుగా భావించానని తెలిపింది. భారత్‌కు మిస్ యూనివర్స్ కిరీటం తీసుకురావడమే తన తొలి లక్ష్యమని కజియా చెప్పింది. తాను చేసే ప్రతి పనిలో భారత్, కేరళకు ప్రాతినిధ్యం వహించాలనుకుంటున్నట్లు తెలిపింది. విజేతను ఎంపిక చేసిన జడ్జింగ్ ప్యానెల్‌లో మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్, ఉర్వశి రౌతేలా, రియా సింఘా, పర్యావరణవేత్త ప్రగ్యా కపూర్ ఉన్నారు. సెలీనా జైట్లీ కూడా జడ్జిగా వ్యవహరించారు. వైష్ణవి గణేశ్ తొలి రన్నరప్‌గా నిలిచింది. ఆమెకు మిస్ ఇంటర్నేషనల్ ఇండియా 2026 టైటిల్ దక్కింది. అనుశ్రీ సాతవ్లేకర్ రెండో రన్నరప్‌గా నిలిచింది. తేజస్విని శ్రీవాస్తవ మూడో రన్నరప్, అనుభా వశిష్ఠ్ చౌదరి నాలుగో రన్నరప్‌గా నిలిచారు.



# విద్యార్థినులతో కలిసి ప్రిన్సిపల్ జలకాలాటలు
## సస్పెండ్‌చేసిన సెకండరీ విద్యాశాఖ

**ఆల్వార్, ఆగస్టు 24:** విద్యార్థినులతో కలిసి నీళ్లలో అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్‌పై అధికారులు వేటు వేశారు. విద్యార్థినులతో ఆయన జలకాలాటలు ఆడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌కావడంతో, విద్యాశాఖ అతడిని సస్పెండ్ చేసింది. ఈ ఘటన రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లాలో చోటుచేసుకుంది. అల్వార్ జిల్లాలోని ఒక ప్రభుత్వ సీనియర్ సెకండరీ పాఠశాల ప్రిన్సిపాల్ లాల్‌చంద్ మీనా, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సుమారు 200 మంది విద్యార్థులను పిక్నిక్‌కు తీసుకెళ్లారు. వీరిలో 11, 12వ తరగతి చదువుతున్న బాలికలు కూడా ఉన్నారు. పాఠశాలకు సమీపంలోని ఓ డ్యామ్ వద్దకు వెళ్లిన వీరంతా నీటిలో ఆడుకున్నారు. ఈ క్రమంలో ప్రిన్సిపాల్ లాల్‌చంద్ మీనా కూడా విద్యార్థులతో కలిసి నీళ్లలోకి దిగారు. విద్యార్థినుల ముందే దుస్తులులేకుండా నీటిలో ఈదినట్టుగా ఉన్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో విస్తృతంగా వ్యాపించింది. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి విద్యార్థినుల పట్ల ప్రిన్సిపాల్ ప్రవర్తించిన తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వీడియో ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వారు వెంటనే స్పందించారు. ప్రభుత్వ ఉద్యోగి ప్రవర్తనా నియమావళిని మీనా ఉల్లంఘించారని నిర్ధారించారు. ఈ మేరకు బికనీర్ సెకండరీ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రిన్సిపాల్ లాల్‌చంద్ మీనాపై శాఖాపరమైన విచారణకు కూడా ఆదేశించింది. ప్రస్తుతం ఈ ఘటనపై విచారణ కొనసాగుతోంది.

# యేడాదికి మూడు ఉచిత ఎల్పీజీ సిలిండర్లు
## ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం



**చెన్నై, ఆగస్టు 24:** తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ సోమవారం పలు సంక్షేమ పథకాలను ప్రకటించారు. యేడాదికి మూడు ఉచిత ఎల్పిజి సిలిండర్లు అందించే పథకంతో పాటు ట్రాన్స్ జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. అన్నపూర్ణి సూపర్ సిక్స్ పేరుతో గ్యాస్ సిలిండర్ల పథకం అమల్లోకి రానుంది. 2027 సంక్రాంతి నుంచి దీనిని ప్రారంభించనున్నారు. యేటా రూ.2.5 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. అర్హులైన కుటుంబాలు కొనుగోలు చేసే మూడు గ్యాస్ సిలిండర్ల ఖర్చును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఈ పథకానికి ఏటా సుమారు రూ.4వేల కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులతో గ్యాస్ కొరత, ధరల పెరుగుదల కుటుంబాలపై అదనపు భారాన్ని మోపాయని విజయ్ తెలిపారు. మహిళల ఉచిత బస్సుప్రయాణ పథకం పరిధిని ప్రభుత్వం విస్తరించింది. ఇకపై సాధారణ బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్, ఎల్ఎస్ఎస్, డీలక్స్ బస్సుల్లోనూ మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. జిల్లాల మధ్య నడిచే బస్సుల్లోనూ ఈ సదు పాయం కల్పించ నున్నారు. వెట్రి పయనం పేరుతో అక్టోబర్ 2 నుంచి ఈవిస్తరణ అమల్లోకి వస్తుంది. ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు విజయ్ ప్రకటించారు. చెన్నై సమీపంలోని పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టుపై విజయ్ మరో సారి తనవ్యతిరేకతను స్పష్టంచేశారు. ప్రాజెక్టుతో ప్రభావిత మయ్యే కుటుంబాల పక్షాన నిలుస్తామని చెప్పారు. ప్రత్యామ్నాయ ప్రాంతాలను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాలను గుర్తించినట్లుతెలిపారు. ప్రస్తుత మీనంబాక్కం, చెన్నై విమానాశ్రయంలోని కొత్త టెర్మినల్5 నిర్మించనున్నట్లు కూడా ప్రకటించారు.

# హెచ్‌వన్-బి, ఒపిటిలపై షాకింగ్ ఫీజులు!
## అమెరికాకు వెళ్లే కల కలగానే మారుస్తున్న ట్రంప్





**వాషింగ్టన్, ఆగస్టు 24:** అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడయ్యాక భారతీయులకు ఏదో విధంగా నిత్యం షాకులు తగులుతూనే ఉన్నాయి. ఇదే క్రమంలో తాజాగా భారతీయులకు మరో షాక్ ఇచ్చేందుకు ట్రంప్ సర్కార్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా హెచ్1బీ వర్క్ వీసా, ఎఫ్1 ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లపై కొత్త ఫీజుల్ని ప్రవేశపెట్టేందుకు అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రతిపాదనలు ప్రస్తుతం వైట్ హౌస్ బడ్జెట్ విభాగం పరిశీలనలో ఉన్నాయి. అమెరికా తాజా నిర్ణయం వల్ల అక్కడికి వెళ్లాలనుకునే లక్షలాది మంది భారతీయులపై ఆర్థిక భారం భారీగా పెరిగే అవకాశం ఉంది. అమెరికాలో 2024 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన హెచ్1బీ వీసాలలో దాదాపు 71 శాతం భారతీయులకే దక్కాయి. ఈ నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం తీసుకోబోయే ఫీజుల పెంపు నిర్ణయం నేరుగా మన ఐటీ నిపుణులపై తీవ్ర ప్రభావం చూపనుంది. న్యూయార్క్‌కు చెందిన ప్రముఖ ఇమ్మిగ్రేషన్ లా సంస్థ ఫ్రాగోమెన్ ప్రకారం, ఇప్పటికే ఈ ప్రతిపాదనల ముసాయిదా యూఎస్ బడ్జెట్ విభాగానికి చేరింది. గతంలో ట్రంప్ ప్రభుత్వం హెచ్1బీ వీసా పిటిషన్లపై ఏకంగా లక్ష డాలర్ల ఫీజు విధించాలని ప్రయత్నించగా, కోర్టు దాన్ని తిరస్కరించింది. దాంతో ఇప్పుడు హోంల్యాండ్ సెక్యూరిటీ మరో ప్రత్యామ్నాయ మార్గంలో ఫీజులు పెంచేందుకు చట్టపరమైన సన్నాహాలు చేస్తోంది.

మరోవైపు విద్యార్థుల విషయానికి వస్తే, ఉన్నత విద్య పూర్తి చేసిన తర్వాత ఉద్యోగం చేసుకునేందుకు ఉపయోగపడే ఎఫ్1 ఓపీటీ దరఖాస్తులపై కూడా ఈ పెరిగిన ఫీజుల ప్రభావం పడనుంది. ఈ ఫీజుల్ని కూడా భారీగాపెంచవచ్చని సమాచారం. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఒపిటి దరఖాస్తుకు 470 డాలర్లు, పేపర్ రూపంలో అయితే 520 డాలర్లు చెల్లించాల్సి ఉంది. సాధారణంగా హెచ్1బీ వీసా రుసుములను కంపెనీలే భరిస్తాయి. కానీ ఓపీటీ ఫీజులను విద్యార్థులే స్వయంగా చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుఖర్చులు భారీగా పెరిగితే భారతీయ విద్యార్థుల ఉన్నత చదువులపై, ఆ తర్వాతి ఉపాధి అవకాశాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. అమెరికాలో స్థిరపడేందుకు చాలా కాలంగా ఉన్న ఎఫ్1 నుండి హెచ్1బీ మార్గం మరింత వ్యయ భరితంగా మారనుంది. తుది నోటిఫికేషన్ వచ్చే వరకు ఫీజు ఎంత పెరుగుతుందనే దానిపై పూర్తి స్పష్టత రాదు.

# భర్తను హత్యచేసి, పొట్టనుచీల్చి పేగులు సంచిలోకి
## ఇంటియజమాని చూడటంతో ఆత్మహత్యాయత్నం

**కురుక్షేత్ర, ఆగస్టు 24:** హర్యానాలోని కురుక్షేత్రలో అత్యంత దారుణమైన, ఒళ్లు గగుర్పొడిచే ఘటన వెలుగులోకి వచ్చింది. భర్తను కిరాతకంగా హత్య చేసిన ఓ మహిళ, అతని శరీరాన్ని ఛిద్రం చేసింది. ఈ క్రమంలో ఇంటి యజమానికి అడ్డంగా దొరికిపోవడంతో భయంతో టెర్రస్‌పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసుల వివరాల ప్రకారం, పీహోవా రోడ్డులోని రాజ్ ప్యాలెస్ సమీపంలో రాజేశ్, విమలా దేవి దంపతులు ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజేశ్ స్థానికంగా ఓ వాటర్ ట్రేడింగ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో వీరిద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.

వారి ఇంట్లోంచి పెద్దగా అరుపులు వినిపించడంతో ఇంటి యజమాని రింకూ వారిని చూసేందుకు టెర్రస్‌పైకి వెళ్లాడు. అక్కడ కనిపించిన దృశ్యం చూసి రింకూ షాక్‌కు గురయ్యాడు. రాజేశ్ రక్తపు మడుగులో పడి ఉండగా, అతని పొట్ట భాగం చీల్చి ఉంది. బయటకు వచ్చిన పేగులను విమల ఓ సంచిలో పెడుతుండటం అతను గమనించాడు. ఇంతలో తనను ఇంటి యజమాని చూశాడని గ్రహించిన విమల, కంగారుతో టెర్రస్‌పై నుంచి కిందికి దూకేసింది. గాయపడిన ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలానికి చేరుకుని



ఆధారాలు సేకరించారు. పోస్టుమార్టం నివేదికలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. రాజేశ్ పొట్టపై సుమారు 35 సెంటీమీటర్ల పొడవున కోసి ఉంది.

అతని శరీరం నుంచి కాలేయంలో కొంత భాగం, కుడివైపు కిడ్నీ మాయమైనట్టు వైద్యులు గుర్తించారు. ఘటనా స్థలంలో మూడు వేర్వేరు పరిమాణాల్లో ఉన్న కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విమల క్షుద్రపూజలు, చేతబడి వంటివి చేస్తుండేదని, ఈ విషయమై దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవని ఇంటి యజమాని పోలీసులకు తెలిపాడు. కొన్నేళ్ల క్రితం వివాహం చేసుకున్న ఈ దంపతులకు పిల్లలు లేరు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విమల కోలుకుని వాంగ్మూలం ఇస్తేనే ఈ హత్య వెనుక ఉన్న పూర్తి వివరాలు, అసలు కారణాలు తెలిసే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

# వచ్చేనెల 28 నుంచి మూడురోజులు బ్యాంకు ఉద్యోగుల సమ్మె





**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మరోసారి సమ్మె గంటలు మోగనున్నాయి. తమ ప్రధాన డిమాండ్లను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ) విఫలమయ్యాయని ఆరోపిస్తూ బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక అయిన యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. వారానికి ఐదు రోజుల పనిదినాలు, పనితీరు ఆధారిత ప్రోత్సాహకం (పిఎల్ఐ) విధానంలో మార్పులు వంటి కీలక అంశాలపై ఉద్యోగ సంఘాలు పట్టుబడుతున్నాయి. ఈ మేరకు దశలవారీ ఆందోళనల షెడ్యూల్‌ను ప్రకటించాయి. యుఎఫ్‌బియూ ప్రకటించిన వివరాల ప్రకారం, సెప్టెంబర్ 11న ఒక రోజు దేశవ్యాప్త సమ్మె, సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మె నిర్వహించనున్నారు. అప్పటికీ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే, అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని యూనియన్లు స్పష్టం చేశాయి. ఈ సమ్మెల కారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల సేవలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉంది. 2024 మార్చి 8న జరిగిన 12వ ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా, వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయడానికి ఐబీఏ అంగీకరించింది.

దీనికి బదులుగా సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజుకు 40 నిమిషాలు అదనంగా పనిచేయడానికి ఉద్యోగులు అంగీకరించారు. ఐబీఏ ఈ ప్రతిపాదనను ప్రభుత్వ ఆమోదం కోసం పంపినప్పటికీ, రెండేళ్లు దాటినా ఇప్పటికీ ఆమోదముద్ర పడలేదు. ఈ జాప్యంపై ఉద్యోగ సంఘాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ ఇటీవల సవరించిన పీఎల్ఐ విధానం తీవ్ర వివక్షాపూరితంగా ఉందని యూనియన్లు ఆరోపిస్తున్నాయి. కొత్త విధానం ప్రకారం, స్కేల్4, ఆపై స్థాయి అధికారులకు వారి వ్యక్తిగత పనితీరు ఆధారంగా గరిష్ఠంగా 365 రోజుల బేసిక్ పే వరకు ప్రోత్సాహకం లభిస్తుంది. అదే సమయంలో, స్కేల్3 వరకు ఉన్న అధికారులు, ఇతర సిబ్బందికి కేవలం 15 రోజుల బేసిక్ పే, డిఎ మాత్రమే అందుతుంది. ఇది ఐబిఏతో చేసుకున్న ఒప్పందానికి విరుద్ధమని యూఎఫ్‌బీయూ వాదిస్తోంది.

# సంక్షిప్త వార్తలు

## ట్రంప్ తనయుడికి ఇరాన్ టివిలో బెదరింపులు



**టెహ్రాన్, ఆగస్టు 24:** ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమారుడిపై టెహ్రాన్ ప్రత్యక్ష బెదరింపులకు పాల్పడింది. ట్రంప్ చిన్న కుమారుడు బారెన్ ట్రంప్‌ను హత్య చేస్తామని బెదరిస్తూ.. ఇరాన్ ప్రభుత్వ అనుబంధ మీడియా ఛానల్ ఓ విడియోను ప్రసారం చేసింది. అతడి తలపై 10 మిలియన్ డాలర్ల రివార్డును ప్రకటించింది. ఈ విడియోలో బారెన్ ఏ సమయంలో ఎక్కడ ఉంటారు? అతడిని లక్ష్యం చేసుకొనేందుకు సరైనచోటు ఏది? అనే విషయాలను గ్రాఫిక్స్‌లో చూపించింది. అంతేకాకుండా అతడి కదలికలపై నిఘా, ఆన్‌లైన్ కార్యకలాపాలు, చుట్టూ ఉండే వ్యక్తుల గురించి తెలియజేసింది.

## రష్యా 3లక్షల మంది సైనికులను సిద్ధం చేస్తోంది: జెలెన్‌స్కీ

**కీవ్, ఆగస్టు 24:** ఉక్రెయిన్-రష్యా మధ్య ఘర్షణ ఇటీవల మరింత తీవ్రమవుతోంది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమపై దాడులు మరింత పెంచేందుకు రష్యా సన్నాహాలు చేస్తోందని అన్నారు. దాదాపు 3 లక్షల మంది సైనికులను కొత్తగా సమీకరించేందుకు ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. డొనెట్స్క్ ప్రాంతాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవడమే మాస్కో ప్రధాన లక్ష్యమని, ఇందులో భాగంగానే కొత్తగా సమీకరించే బలగాలను అక్కడ మోహరించే అవకాశం ఉందని చెప్పారు. సెప్టెంబరులో రష్యా పార్లమెంటరీ ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ ప్రక్రియ మొదలయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు.

## బిచ్చగత్తె ఇంట్లో రూ.8.40 లక్షల నగదు

**మాండ్య, ఆగస్టు 24:** కర్ణాటకలో ఆశ్చర్యకర ఘటన వెలుగులోకి వచ్చింది. జీవితమంతా భిక్షాటన చేస్తూ గడిపిన 68 యేళ్ల మహిళ ఇంట్లో రూ.8.40 లక్షల నగదు బయటపడింది. 30కి పైగా బస్తాల్లో నోట్లను, నాణేలను దాచిపెట్టినట్లు గుర్తించారు. అయితే ఆ డబ్బు ఆమెకు ఉపయోగపడకుండానే కన్నుమూశారు. మాండ్యకు చెందిన హూర్ వృద్ధాప్య సంబంధ అనారోగ్యంతో నిన్న మృతి చెందారు. ఆమె మరణించిన తర్వాత స్థానికులు ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా బస్తాల్లో పెద్ద మొత్తంలో నగదు కనిపించింది. రూ.10, రూ.20, రూ.50 నోట్లు భారీగా ఉన్నాయి. వేల సంఖ్యలో నాణేలు కూడా బయటపడ్డాయి.

## పరందూర్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు వెనక్కి

**చెన్నై, ఆగస్టు 24:** తమిళనాడు రాజధాని చెన్నై సమీపంలో గతంలో ప్రతిపాదించిన విమానాశ్రయ ప్రాజెక్ట్ ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న టివికె, ప్రతిపక్ష డిఎంకె మధ్య తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. చెన్నైకి సుమారు 70 కిలో మీటర్ల దూరంలో ఉన్న పరందూర్ ప్రాంతంలో సారవంతమైన వ్యవసాయ భూములు, పర్యావరణ వ్యవస్థలు దెబ్బతింటాయని ఆందోళన చేపడుతున్న రైతులకు మొదటి నుంచీ మద్దతుగా నిలిచిన ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తాజాగా ఆ ప్రాజెక్ట్‌ను పూర్తిగా విరమిస్తున్నట్లు ప్రకటిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు.

## నెదర్లాండ్స్‌లో ఊబర్‌కు రూ.9245 కోట్ల జరిమానా

**ఆమ్‌స్టర్‌డామ్, ఆగస్టు 24:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిర్ణయంతో ఉద్యోగం కోల్పోవాల్సి వస్తే ఈ ప్రశ్న ఇప్పుడు యూరప్‌లో తీవ్రచర్చకు దారితీస్తోంది. డ్రైవర్ల ఖాతాలను నిలిపివేయడంలో ఆటోమేటెడ్ వ్యవస్థలను ఉపయోగించినందుకు ఊబర్‌కు భారీ జరిమానా పడింది. నెదర్లాండ్స్ డేటా ప్రొటెక్షన్ అథారిటీ ఊబర్‌పై 825 మిలియన్ యూరోల జరిమానా విధించింది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.9,245 కోట్లకు సమానం.

## వెంటిలేటర్ పేలి ముగ్గురు శిశువులు మృతి

**అమ్రావతి, ఆగస్టు 24:** మహారాష్ట్రలో ఘోర విషాదం చోటుచేసుకుంది. అమ్రావతిలోని జిల్లా మహిళా ఆసుపత్రిలో సోమవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. వెంటిలేటర్ పేలిన ఘటనలో నవజాత శిశువుల ఐసియులో చికిత్స పొందుతున్న ముగ్గురు పసికందులు దట్టమైన పొగకు ఊపిరాడక మృతి చెందారు. మరో ఆరుగురు శిశువులను రక్షించి, స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

MN 10 final:MN 10 final 01/01/2001 09:53 Page 1



# కుల గణన చేపట్టకుంటే జెన్ జీ తరహా ఉద్యమమే : కేసన శంకరరావు

**మంగళగిరి, ఆగస్టు 24, ప్రభాతవార్త :** జనగణనలో బీసీల కులగణన చేపడతామని కేంద్ర మంత్రిమండలి తీర్మానాన్ని ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోడీ, జనగణన ఫార్మేట్లో ఆ ఊసే లేకుండా బీసీల కుల గణన జరుపకుండా దేశంలోని 80 కోట్ల మంది బీసీలను మోసగించారని, ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో ఖిఖి జనగణనలో సమగ్ర కుల గణన




కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వ వైఖరి ఖిఖి అన్న అంశంపై మీడియా సమావేశం నిర్వహించారు. ఆగస్టు 14న కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ లోని 40 ప్రశ్నల్లో మీరు ఎస్సీలా/ ఎస్టీలా/ ఇతరులా అని అడిగారే తప్ప,ఓబీసీలా అని గాని/ ఓసీలా అని గాని/ అసలు మీదే కులం అని అడిగే కాలమ్ లు పెట్టలేదన్నారు. అందుకే తెలంగాణ,బీహార్ రాష్ట్రాలలో మాదిరిగా మీరు ఓబిసినా/ అయితే మీది ఏ కులం అని అడిగే కుల కాలమ్ తప్పక పెట్టాలన్నారు. ప్రతి కులానికి ఒక యూనిక్ నెంబర్ కేటాయించకుండా బీసీ కులాల లెక్కలు ఏ విధంగా తీస్తుందో కేంద్రం స్పష్టం చేయాలన్నారు. అందుకే కుల గణనపై కేంద్రం వైఖరిని నిరసిస్తూ ఈ నెల 24 నుండి దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు.

సెప్టెంబర్ 24 న హైదరాబాదులో ఓబీసీల జాతీయ స్థాయి ప్లీనరీ నిర్వహించి, నవంబర్లో పార్లమెంటు ముట్టడికి పిలుపునిచ్చేలా, కేంద్ర మోసపూరిత వైఖరిని కులగణనపై ఎండగడతామన్నారు.తక్షణమే కేంద్ర ప్రభుత్వం చేస్తున్న జాతీయ జన గణనను నిలిపివేసి, జాతీయస్థాయిలో అ ఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, సామాజిక న్యాయ నిపుణులు బీసీ సంఘాలతో చర్చించి, బీసీ కులగణన పై స్పష్టమైన విధివిధానాలు రూపొందించిన తర్వాత మాత్రమే జనగణన లో సమగ్ర కులగణన మొదలు పెట్టాలని కోరారు. ఓబీసీల సమగ్ర కుల గణన జరుపనిపక్షంలో కేంద్ర ప్రభుత్వంతో ఓబీసీ లు తాడోపేడో తేల్చుకునే సమయం ఆసన్నమైందని, ఆపై ఖిఖిజెన్ జీఖిఖితరహా ఉద్యమం చేపట్టక తప్పదంటూ శంకరరావు తీవ్ర స్వరంతో హెచ్చరించారు.

ఇంకా ఈ మీడియా సమావేశంలో యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షులు పారేపల్లి మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవళ్ల వెంకట్, రాష్ట్ర అధికార ప్రతినిధి శివరాం బాబాజీ, ఏలూరు నగర అధ్యక్షులు మార్గాని కిరణ్, దా నా గౌడ్ పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు

# ఎస్ఆర్ఎం వర్సిటీలో ఘనంగా ఫౌండర్స్ డే

## జెడ్పీ స్కూళ్ల విద్యార్థులకు ఎడ్యుకేషనల్ కిట్స్ పంపిణీ

**మంగళగిరి, ఆగస్టు 24, ప్రభాతవార్త :** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సోమవారం ఫౌండర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ వ్యవస్థాపక కులపతి డాక్టర్ టీఆర్ పారివేందర్ 85వ పుట్టిన రోజును పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళగిరి నియోజకవర్గంలోని 25 ప్రభుత్వ




జిల్లా పరిషత్, మునిసిపల్ స్కూళ్లల్లో పదో తరగతి చదివే 1673 మంది విద్యార్థులకు ఉచితంగా ఎడ్యుకేషనల్ కిట్స్ పంపిణీ చేశారు. ఉదయం 10 గంటలకు యూనివర్సిటీ ఆవరణలో వైస్ ఛాన్సలర్ ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ లు వర్సిటీ జెండాను ఊపి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏటా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆగస్టు 24న ఫౌండర్స్ డే సేవా కార్యక్రమాలను నిర్వహి ంచడం ఆనవాయితీ. ఈ ఏడాది ప్రభుత్వ హైస్కూళ్లలో పదో తరగతి చదివే విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్ను, పెన్సిల్, స్కేల్, జామెంట్రీ సెట్ బాక్సు, ఎగ్జామ్ ప్యాడ్లతో కూడిన కిట్లను అందజేయాలని వర్సిటీ మేనేజ్మెంట్ నిర్ణయించింది. జులై మాసంలో రాష్ట్ర విద్యా శాఖమంత్రి నారా లోకేష్ ను కలిసిన సందర్భంగా యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ పి సత్యనారాయణన్ విద్యార్థులకు కిట్స్ పంపిణీ గురించి ప్రస్తావించారు. వెంటనే మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారు. దీంతో నియోజకవర్గంలోని మంగళగిరి, దుగ్గిరాల, తాడేపల్లి ప్రాంతాల్లోని జిల్లా పరిషత్, మునిసిపల్ హైస్కూళ్ల జాబితాలను తెప్పించుకున్న యూనివర్సిటీ ఆయా స్కూళ్లలో చదివే పదో తరగతి విద్యార్థులకు కిట్సు రెడీ చేసింది. సోమవారం వీటిని ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ద్వారా ప్రభుత్వ స్కూళ్ల హెచ్ఎంలకు అందజేసింది.

**బహుముఖ ప్రజ్ఞాశీలి డాక్టర్ పారివేందర్...**

అంతర్జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్ విద్యను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఎస్ఆర్ఎం వర్సిటీని స్థాపించిన మాజీ ఎంపీ డాక్టర్ టీఆర్ పారివేందర్ బహుముఖ ప్రజ్ఞాశీలిగా పేరు గడించారని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సతీష్ కుమార్ కొనియాడారు. మంగళగిరి మండలం నిడమర్రు జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు వీసీ సతీష్ ఎడ్యుకేషనల్ కిట్సు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్, స్టూడెంట్స్ అఫైర్స్ విభాగం డైరెక్టర్ రేవతీ బాలక్రిష్ణన్, ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవాని పాల్గొన్నారు.

## చిర్రావూరు లూథరన్ చర్చ్ అభివృద్ధికి రూ.3 లక్షల ఆర్థిక సహాయం

**మంగళగిరి, ఆగస్టు 24, ప్రభాతవార్త :** మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో చిర్రావూరు గ్రామంలోని లూథరన్ చర్చ్ అభివృద్ధి పనులకు టీడీపీ మంగళగిరి నియోజకవర్గ నాయకులు,తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ (నాని) రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు.సోమవారం చర్చి పెద్దల సమక్షంలో పాస్టర్‌కు ఈ



మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా కొమ్మారెడ్డి కిరణ్ (నాని) మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ సేవా స్ఫూర్తితో చర్చి అభివృద్ధి పనులకు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.చిర్రావూరు గ్రామంలోని లూథరన్ చర్చి అభివృద్ధికి భవిష్యత్తులోనూ అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు. అనంతరం కొమ్మారెడ్డి కిరణ్ (నాని)ను చర్చి సంఘ పెద్దలు శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ చిర్రావూరు గ్రామ పార్టీ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాసరావు, గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి కొంక ముసలయ్య, ఉపాధ్యక్షులు మొక్కపాటి నాని, మొక్కపాటి యేసుప్రసాద్,దనేకుల సుబ్బారావు,పిల్లి రమేష్, జెట్టి రవీంద్ర, మానేపల్లి సురేష్, సంఘ పెద్దలు సంకూరు సారత్ బాబు,కొంక కోటేశ్వరరావు, మానేపల్లి ఏసుబాబు, సుదర్శన్, కూరపాటి శేషయ్య, జెట్టి అనిల్, రమణ, గురుంగి సాంబయ్య, బోజింగ్కి ఏసుబాబు తదితర గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## అర్జీలను త్వరగతిన పరిష్కరించాలి

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 24(ప్రభాతవార్త):** ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం(గ్రీవెన్స్)లో మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. స్వీకరించిన అర్జీలను సంబంధిత విభాగాధి పతులకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా పంపించారు.ప్రధానంగా ఇంజనీరింగ్ సెక్షన్ కు సంబంధించి, పాత గవర్నమెంట్ హాస్పటల్ ఎదురు ఉన్న కచేరి వద్ద



చేతి పంపు ఏర్పాటుచేయాలని,దుర్గ భవాని అనే మహిళ పొదుపు సంఘాల మీద చేసిన వినతి,అదేవిధంగా 32 వ వార్డు యద్దలింగయ్య కాలనీ మురుగు కాలువలు తీయవలసినదిగా వచ్చిన అర్జీ. ఈ సందర్భంగా గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

## రెండేళ్లలో కూటమి ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసింది

**చెరుకుపల్లి ,ఆగస్టు 24, ప్రభాతవార్త:** గత రెండు సంవత్సరాల్లో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నో ప్రజా సంక్షేమ మరియు పారిశ్రామిక అభివృద్ధిని సాధించిందని టిడిపి నాయకులు రమణ మాస్టర్ అన్నారు. ఇంటింటికి తెలుగుదేశం పార్టీలో భాగంగా సోమవారం ఏమి లేని వారి పాలెంలోని 246 బూత్ పరిధిలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు మంచి గత



రెండు సంవత్సరాల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని స్థానికులకు వివరించారు. రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలంటే ప్రజలంతా కూటమి ప్రభుత్వానికి అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## దేశం కోసం ప్రతి ఒక్కరు ధర్మ రక్షణలో పాలుపంచుకోవాలి

**చెరుకుపల్లి ,ఆగస్టు 24, ప్రభాతవార్త :** దేశం కోసం ధర్మం కోసం ప్రతి ఒక్కరు పాటుపడవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ పొన్నపల్లి సత్యనారాయణ అన్నారు. ఈనెల 23వ తేదీ నుండి 26వ తేదీ వరకు శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని ఆరంబాక ,గుల్లపల్లి ఎస్టీ కాలనీల్లో సోమవారం ధర్మ రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేను నీకు రక్ష నీవు నాకు రక్ష మనమిద్దరం దేశానికి, ధర్మానికి రక్ష అంటూ ధర్మరక్షణ



కంకణాలను ఆయా కాలనీవాసులతో ధరించారు. దేశంలోనే ధర్మం బాగుంటే దేశంలోని ప్రజలందరూ బాగుంటారని ప్రతి ఒక్కరు ధర్మ పరిరక్షణ కోసం తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు . ఈ సందర్భంగా ఆయా కాలనీవాసులతో ధర్మ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, చింతల మురళీకృష్ణ, మాతాజీ జయంపు కమల, స్థానిక కాలనీవాసులు పలువురు పాల్గొన్నారు.

## అర్హులకు ఓటు హక్కు కల్పించాం.. తప్పులు ఉంటే తెలియజేయండి

### -ఎంపీడీవో విజయలక్ష్మి

**కొల్లిపర,ఆగస్టు 24 ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే సంకల్పమని చెబుతూ ఓటర్ల జాబితాలో తప్పులు ఒప్పులు ఉంటే తెలియజేయాలని నాయకులను ఎంపీడీవో విజయలక్ష్మి కోరారు.సోమవారం




మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ స్టేషన్ల జాబితాపై వివిధ రాజకీయపార్టీ నాయ కులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వ హిం చారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ మండలంలో 20 గ్రామ పంచాయతీలు..200 వార్డులు..200 పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయని వాటి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రదర్శించటం జరిగిందని చెప్పారు.గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించిన జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 26 వ తేదీ లోపు సంభందిత అధికారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో వివిధ రాజకీయపార్టీ నాయకులు భీమవరపు చిన కోటిరెడ్డి,కళ్ళం వెంకటప్పారెడ్డి,మునగాల కృష్ణమూర్తి,వంగా సాంబిరెడ్డి,యర్రు వెంకయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## భూములు రీసర్వేతో రైతులకు మేలు

### -తహశీల్దార్ సిద్దార్ధ

**కొల్లిపర,ఆగస్టు 24 ప్రభాతవార్త:** భూములు రీసర్వేతో రైతులకు మేలు జరుగుతుందని తహశీల్దార్ గుమ్మడి సిద్దార్ధ పేర్కొన్నారు.సోమవారం స్థానిక మండల రెవిన్యూ కార్యాలయంలో వీఆర్వోలకు..విలేజ్ సర్వేయర్లకు ఆయన భూముల రీసర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించి వారు తీసుకోవలసిన జాగ్రతలపై తగిన సూచనలు..సలహాలు



ఇచ్చారు.ఈ సందర్భంగా సిద్దార్ధ మాట్లాడుతూ భూములు రీసర్వే జరుగుతుందని రైతులకు ముందస్తుగానే తెలపాలన్నారు, .క్షేత్రస్థాయిలో భూయజమానుల సమక్షంలో కొలతలు నిర్వహించాలన్నారు. భూవివాదాలకు తావులేకుండగా ఖచ్చితంగా హద్దులు నిర్ధారణ చేయాలని చెప్పారు.సమావేశంలో ఆర్ఐ వంశీకృష్ణ,మండల సర్వేయర హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు వెలుగుల ఆత్మీయ పురస్కారాలు

**గుంటూరు కల్చరల్,ఆగష్టు 24,ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా యువకళావాహిని,కళావిపంచి సంయుక్త నిర్వహణలో తెలుగు వెలుగుల పురస్కార సభ జరిగింది.సభాధ్యక్షులుగా యువకళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ,ముఖ్యఅతిథిగా ఛైర్మన్,ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్,మన్నవ మోహనకృష్ణ,గౌరవాతిథిగా ఛైర్మన్ నాటక అకాడమీ, ఆంధ్రప్రదేశ్,గుమ్మడి గోపాలకృష్ణ,ఆత్మీయ అతిధులుగా కళావత్రికా సంపాదకులు డాక్టర్ మహ్మద్ రఫీ,కళావిపంచి గౌరవాధ్యక్షులు,డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు,వేదిక అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య,సహ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు, పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు.అతిధులు ఆంధ్రకేసరిగా టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయుడని,ఆయన సేవలు మరువలేనివన్నారు.అనంతరం పలు రంగాల్లో నిష్ణాతులుగా ఎంపికైన పురస్కార గ్రహీతలు రచయిత,దర్శకులు జరుగుల రామారావు,కథక్ కళాక్షేత్ర అధ్యక్షులు కథక్ అంజిబాబు,ప్రముఖ



లలిత సంగీత గాయకులు భాగీ కృష్ణమూర్తి,పౌరాణిక నటులు మువ్వా పెదబాపిరెడ్డి లను తెలుగు వెలుగుల పురస్కారాలతో సత్కరించారు.తొలుత కార్యక్రమాలను డాక్టర్ అంజిబాబు శిష్యబృందం నిర్వహించిన కథక్ నృత్యం ఆకట్టుకుంది తదుపరి మానవత ఎడ్లపాడు వారి పి.వి.భవానిప్రసాద్ రచించి జరుగుల రామారావు దర్శకత్వం వహించిన బావా ఎప్పుడు వచ్చితీవు నాటిక ఆహుతులను అలరించింది.లంక లక్ష్మీనారాయణ,కళావిపంచి అధ్యక్షులు బొప్పన్న నారసింహారావు,డి.తిరుమలేశ్వరరావు,భాగి శంకరశాస్త్రి, జి.మల్లికార్జునరావు, జానీ భాషా తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## జాబితాను ప్రదర్శించాం..తప్పులు ఉంటే తెలపండి

### -ఎంపీడీవో విజయలక్ష్మి

**కొల్లిపర,అగష్టు 24 ప్రభాతవార్త:** ఎస్సీ..ఎస్టీ,బిసి ఓటర్ల జాబితాను గ్రామ పంచాయతీలలో ప్రదర్శన చేపట్టామని పంచాయతీ కార్యదర్శులు ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి



పేర్కొన్నారు.సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్ష సమావేశంనిర్వహించారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఎస్సీ..ఎస్టీ..బిసి జాబితాలో అభ్యంతాలు ఏమైనా ఉంటే ఈ నెల 26 వ తేదీ నుండి 28 వ తేదీ లోపు సంభందిత పంచాయతీ కార్యదర్శులకు తెలియజేస్తే తగిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.సమావేశంలో డిప్యూటి ఎంపీడీవో లు భార్గవ్,దానయ్య తదితరులు పాల్గొన్నారు.

## రెండు లక్షల రూపాయల విరాళమును అందజేత

**చిలకలూరిపేట,ఆగస్టు24,ప్రభాతవార్త :** రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన బిఓడి మీటింగ్‌లో క్లబ్ డైరెక్ట్ అయినటువంటి రవీంద్ర బాబు మన క్లబ్బు బిల్డింగ్ ఫండ్ నిమిత్తము రెండు లక్షల రూపాయల విరాళమును ప్రకటించినారు. వారిని మన క్లబ్ డైరెక్టర్స్ తేళ్ల సుబ్బారావు, ముత్తినేని వెంకటేశ్వర్లు, జాస్తి రంగారావు, కందిమళ్ల అంజి బాబు, టి వెంకటనారాయణ,



డాక్టర్ కందిమల్ల సాంబశివరావు గారు, చిలుకూరి శ్రీనివాసరావు, కారుమంచి శివరావు, వై యశ్వంత్ రెడ్డి,కరణంశివ,టి.వెంకటేశ్వరరావు, ఎం లక్ష్మీనారాయణ, క్లబ్ ట్రెజరర్ గట్టా హేమ్ కుమార్, కె.సాంబయ్య, దేవినేని శ్రీనివాసరావు,హారిదాసుల శ్రీనివాస్ అధ్యక్షులు బి రామ సుబ్బారావు, కార్యదర్శి మ్మాన శ్రీనివాసరావు, పి పూర్ణచంద్రరావు మరియు ఇతర రోటరీ సభ్యులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.

## ఘనంగా ముగిసిన కావటి అంకమ్మ తల్లి కొలుపుల జాతర

**యడ్లపాడు, అగస్టు 24, ప్రభాతవవార్త :** యడ్లపాడు గ్రామంలోని శ్రీ కావటి అంకమ్మ తల్లి కొలుపుల జాతర సోమవారంతో ఘనంగా ముగిసింది. గత మూడు రోజులుగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, విశేష అలంకరణలు నిర్వహించడంతో పాటు గ్రామంలో భారీ ఊరేగింపులు చేపట్టారు. జాతర ముగింపు సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి బ్రహ్మోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా గ్రామంలో భక్తి సందడి నెలకొంది.



## కుటుంబ సభ్యులను పరామర్శించిన మర్రి

**చిలకలూరిపేట,ఆగస్టు24,ప్రభాతవార్త :** స్వర్గీయ శ్రీ సోమేపల్లి సాంబయ్య ముఖ్య అనుచరులు కీ. శే.అనంత వీరరాఘవులు మేస్త్రీ చిన్నల్లుడు మేకా సురేష్ నిన్న స్వర్గస్తులైనారు. ఈ విషయం తెలుసుకొని వారి స్వగృహం వద్ద ఉన్న వారి పార్థివదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి



తమ ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేసిన శాసనమండలి సభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్, తోట రాజా రమేష్ , కాకుమాను వెంకట్, అచ్చుకోల మురళీకృష్ణ ఈ కార్యక్రమంలో వారివెంట కస్తూరి వెంకటేశ్వర్లు,గిరి మేస్త్రీ గ్యాస్ వెంకన్న, గోలి సురేష్, జంజనం వెంకటరావు తదితరులున్నారు.

## పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

**యడ్లపాడు, అగస్టు 24, ప్రభాతవార్త :** మండల కేంద్రం యడ్లపాడు గ్రామంలో జరుగుతున్న పంట నమోదు ప్రక్రియను జిల్లా వ్యవసాయ అధికారి ఎం జగ్గారావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంట నమోదు పురోగతిని పరిశీలించారు. వచ్చే నెల 15వ తేదీ నాటికి పంట



నమోదు ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా పూర్తిచేయాలని గ్రామ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మండలంలో పంట నమోదు శాతం తక్కువగా ఉందని, ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. రైతులు తాము సాగు చేసిన పంటలను స్వయంగా ఏపీఏఐఎంఎస్ 2.0 (ఫార్మర్ యాప్) ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ విషయంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని గ్రామ వ్యవసాయ అధికారులకు సూచించారు.అనంతరం గ్రామంలో సాగులో ఉన్న వివిధ పంటలను పరిశీలించి, వాటి పరిస్థితి, సాగు విధానం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. పంట నమోదు ప్రక్రియలో రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ హరి ప్రసాద్, ఏఈఓ జీవన్ నాయక్, వ్యవసాయ సహాయకులు బిలాల్ తదితరులు, రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

**చిలకలూరిపేట,ఆగస్టు24,ప్రభాతవార్త :** (శుక్రవారం) విజయవాడలో జరుగనున్న ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర సదస్సు-ఉద్యమ శంఖారావం"కు పల్నాడు జిల్లా నుండి భారీ సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు, మహిళా ప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు తరలిరావాలని ఏపీజేఏసీ అమరావతి పల్నాడు జిల్లా తరపున జిల్లా అధ్యక్షులు శ్రీ నాంపల్లి నాగమల్లేశ్వరరావు చిలకలూరిపేట తహాశీల్దారు వారి కార్యాలయ ప్రాంగణములో సన్నాహక సమావేశము నిర్వహించారు.

ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన, ఆర్థిక సమస్యల పరిష్కారం, అన్ని శాఖల ఉద్యోగుల ఐక్యత చాటడం, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణకు దిశానిర్దేశం చేయడం మరియు ప్రభుత్వానికి ఉద్యోగుల బలమైన స్వరాన్ని వినిపించడం లక్ష్యంగా ఈ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు వారు



వివరించారు.రెవెన్యూ, ఆర్టీసీ తదితర కొన్ని శాఖలకే పరిమితం కాకుండా, ప్రతి ప్రభుత్వ శాఖ నుంచి ప్రాతినిధ్యం ఉండేలా సమీకరణ చేపట్టాలని, పల్నాడు జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు, అనుబంధ సంఘాల సభ్యులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు, మహిళా ఉద్యోగ ప్రతినిధులు, జిల్లా/డివిజన్ కార్యవర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశములో నరసరావుపేట డివిజన్ అధ్యక్షులు శ్రీ ఎ.సి.హెచ్.వెంకటేశ్వర్లు, పల్నాడు జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు శ్రీమతి షేక్ రమీజా, పల్నాడు జిల్లా గ్రామ రెవిన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీ ఆర్.రామారావు మరియు చిలకలూరిపేట తహాశీల్దారు వారి కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవిన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవిన్యూ సహాయకులు మరియు ఇతర శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

## మైదవోలు వీఆర్ఏ అంబటి నాగేశ్వరరావు మృతి

**యడ్లపాడు, ఆగస్టు 24, ప్రభాతవార్త :** మైదవోలు గ్రామ రెవెన్యూ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అంబటి నాగేశ్వరరావు (58) (బాబు) సోమవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో ఇంట్లో గుండెపోటుతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న మండల రెవెన్యూ అధికారి జే విజయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ అనురాధ, వీఆర్వో అనూష, రెవెన్యూ అసిస్టెంట్ సహచరులు నాగేశ్వరరావు



పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది మాట్లాడుతూ నాగేశ్వరరావు కుటుంబానికి అండగా ఉంటామని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. నాగేశ్వరరావు భార్య కరోనా సమయంలో మృతి చెందగా, ఆయనకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొని నాగేశ్వరరావుకు నివాళులర్పించారు.

## రేపు చిలకలూరిపేటలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**చిలకలూరిపేట,ఆగస్టు24,ప్రభాతవార్త :** చిలకలూరిపేట పట్టణ పరిధిలోని సుబ్బయ్యతోట 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో బ్రేకర్ మరమ్మతుల కారణంగా మంగళవారం (25082026) ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు విద్యుత్ సరఫరానిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ ఆర్. అశోక్ కుమార్ తెలిపారు.దీనివల్ల సుబ్బయ్య తోట, గాంధీపేట, ఎంఆర్వో కార్యాలయం రోడ్డు, గడియారస్తంభం



సెంటర్, బోస్ రోడ్డు, మార్కెట్ సెంటర్, మెయిన్ బజార్, పార్క్ రోడ్డు, కళామందిర్ సెంటర్, మేదర బజార్, సుభాని నగర్, రాగన్నపాలెం, ఆవుల దొడ్డి, గుండయ్య తోట, వడ్డెరపాలెం, బొందిలిపాలెం, కేబీ రోడ్డు గడియారస్తంభం నుండి కళ్యాణి హోటల్ వరకు ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలగనుంది. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని అధికారులు కోరారు.

## వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, ఆగస్టు24,ప్రభాతవార్త :** హైదరాబాద్, ఈవెంటరా ఫంక్షన్ హాల్ నందు సీనియర్ ఐఏఎస్ సివిల్ సప్లై కమిషనర్ కన్నా బాబు కుమారుడు రితేష్ సూర్య వివాహ రిసెప్షన్ వేడుకలో హాజరై



నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు.

## నేత్ర చర్మవ్యాధుల పట్ల అవగాహనే ప్రధానం

**గుంటూరు కల్చరల్,ఆగష్టు 24,ప్రభాతవార్త :** స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆరోగ్యసభ జరిగింది.ఆరోగ్యసభకు నేత్రవైద్యులు డాక్టర్ వై.శ్రీనివాస్ పవన్‌కుమార్,చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ సౌమ్య హర్షిత లు నేత్ర చర్మవ్యాధుల పట్ల అవగాహనే ప్రధానం అన్నారు.తొలుత నేత్రవైద్యులు డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అంటారని,అవయవాల్లో ప్రధానమైనవి నేత్రములని అలాంటి నేత్రాల విషయంలో నిర్లక్ష్యం చేస్తే జీవితం అంతా అంధకారంతో అలమటించాల్సి వస్తుందన్నారు.చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ సౌమ్య హర్షిత మాట్లాడుతూ చర్మం మన శరీరంలో అతిపెద్దదని,మన శరీరానికి ఇన్ఫెక్షన్లు,వైరస్‌లు సోకకుండా చర్మం కాపాడుతుందన్నారు.ఆరోగ్య సభానంతరం నేత్ర మరియు చర్మ సంబంధిత సమస్యలపై లేవనెత్తిన సందేహాలను డాక్టర్లు నివృత్తిచేశారు.అనంతరం డాక్టర్ వై శ్రీనివాస్ పవన్‌కుమార్,డాక్టర్ సౌమ్య హర్షితలను అవగాహన సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు.

## ప్రతిభే కొలమానంగా జాబ్ కేలెండర్ ద్వారా
# పోస్టులు భర్తీ: డిసిఎం పవన్



**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** యువతరం ప్రతిభే కొలమానంగా జాబ్ క్యాలెండర్ ద్వారా పోస్టులు భర్తీ చేస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీకి కట్టుబడి కూటమి ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధికి ఇదొక నిదర్శనంగా అభివర్ణించారు. ఈ జాబ్ క్యాలెండర్ ప్రకారం గ్రూప్1లో 149 పోస్టులు, గ్రూప్2లో 673 ఉద్యోగాలు, డీఎస్సీ ద్వారా 2,991 ఉపాధ్యాయ పోస్టులతో పాటు పోలీస్, ఫైర్, జైళ్లు, అటవీ, పశుసంవర్ధక శాఖలు, ఎక్సైజ్, ఇంజినీరింగ్, విద్యుత్ శాఖలలో ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. మొదటి దశలో ఉన్నత విద్యాశాఖకు చెందిన 1,523 పోస్టులకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. ఉన్నత విద్యాశాఖ ద్వారా మే 15నే నోటిఫికేషన్ జారీ చేసి భర్తీ ప్రక్రియ ప్రారంభించారు. మిగిలిన మూడు దశల నోటిఫికేషన్ల కోసం ఆర్థికశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రెండో దశ నోటిఫికేషన్ సెప్టెంబర్ 15 విడుదల కానుంది. ఈ దశలో మొత్తం 3,231 పోస్టులకు నోటిఫికేషన్లు రానున్నాయి.ఇందులో 149 గ్రూప్1 పోస్టులు ఉన్నాయి. డిప్యూటీ కలెక్టర్లు 11, డీఎస్పీ సివిల్ 36, పంచాయతీ రాజ్ డీడీవోలు 35 పోస్టులతో పాటు మున్సిపల్ కమిషనర్, కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ పోస్టులు ఇందులో ఉన్నాయి. ఇక ఇదే దశలో పోలీస్, ఫైర్, జైళ్ల శాఖలో భారీగా కొలువులు భర్తీ చేయనున్నారు. 542 సివిల్ కానిస్టేబుల్స్, 205 ఏఆర్ కానిస్టేబుల్స్, 182 సివిల్ ఎస్సై, 116 ఏఆర్ ఎస్సై పోస్టులు నోటిఫై కానున్నాయి. ఫైర్ మెన్, జైలు వార్డర్ పోస్టులు, 164 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు ఈ ఫేజ్ లోనే భర్తీ కానున్నాయి.మూడో దశ అక్టోబర్ 15న నోటిఫికేషన్ రానుంది. ఈ దశలో మొత్తం 2,311 పోస్టులను భర్తీ చేస్తారు. ప్రధానంగా గ్రూప్2 అభ్యర్థులకు ఇది కీలకమైన దశ. 673 గ్రూప్2 పోస్టుల్లో రెండు వందలు డిప్యూటీ తహసీల్దార్, 176 డిప్యూటీ ఎంపీడీవో, 40 జీఎస్టీ ఆఫీసర్ (తిదిగివీ) పోస్టులు ఉన్నాయి.ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్లు 25, ఎక్సైజ్ కానిస్టేబుళ్లు 400 పోస్టులు భర్తీ చేయనున్నారు. అలాగే ఇంజనీరింగ్, విద్యుత్ శాఖల్లో ఏఈఈ పోస్టుల భర్తీ కూడా ఇదే దశలో ఉండబోతోంది. ఇరిగేషన్‌లో 224, పంచాయతీరాజ్‌లో 173, రోడ్లుభవనాల శాఖలో 79 ఏఈఈ పోస్టులతో పాటు ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో ఏకంగా 629 ఏఈఈ పోస్టుల భర్తీకి అక్టోబర్ 15న ప్రకటన వెలువడనుంది. నాలుగో దశ అక్టోబర్ 15న నోటిఫికేషన్ రానుంది. ఈ దశ పూర్తిగా ఉపాధ్యాయ కొలువులకు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ ద్వారా 2,995 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ తదితర ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ వ్యవస్థలను మరింత బలోపేతం చేయడమే జాబ్ క్యాలెండర్ లక్ష్యమని తెలిపారు. ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారు ఈ క్యాలెండర్‌కు అనుగుణంగా సిద్ధం కావాలన్నారు. కష్టపడి చదివి తమ ప్రతిభను నిరూపించుకునే వారికి ఈ నియామకాలు మంచి అవకాశంగా నిలుస్తాయని పవన్ తెలిపారు. మెరిట్ ఆధారంగా పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు.





సోమవారం గన్నవరం విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్

# గన్నవరం విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతికి ఘనస్వాగతం

**గన్నవరం, ఆగస్టు24, ప్రభాతవార్త:** భారత ఉపరాష్ట్రపతి సీపి.రాధాకృష్ణన్‌కు పలువురు ప్రముఖులు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికారు. ఏలూరుజిల్లా ముసునూరులో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉపరాష్ట్రపతి వాయుసేన ప్రత్యేక విమానంలో సోమవారం ఉదయం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. రాష్ట్రగవర్నర్ అబ్దుల్ నజీర్, ఐటిశాఖా మంత్రి నారా లోకేష్, సమాచారశాఖామంత్రి కొలుసు పార్థసారథి, ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, శాసనమండలి ఛీఫ్‌విప్ పంచుమర్తి అనురాధ, ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజ, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, బోడే ప్రసాద్, ఎమ్మెల్సీ ఆల పాటి రాజా తదితరులు విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతికి పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.

వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, జిల్లాకలెక్టర్ డికె.బాలాజీ, ఏలూరురేంజ్ ఐజి అశోక్‌కుమార్, జిల్లాఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జాయింట్ కలెక్టర్ నవీన్, సహాయకలెక్టర్ నమ్రత, తది తరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన గవర్నర్‌తో కలిసి ప్రత్యేక కాన్వాయ్‌లో రోడ్డుమార్గాన ముసునూరు తరలి వెళ్ళారు.

**ఉపరాష్ట్రపతికి వీడ్కోలు**

ముసునూరులో కార్యక్రమం అనంతరం గన్నవరం విమానాశ్రయా నికి చేరుకున్న ఉపరాష్ట్రపతికి గవర్నర్ అబ్దుల్ నజీర్, ఐటిశాఖామంత్రి నారా లోకేష్, వైద్య ఆరోగ్యశాఖామం త్రి సత్యకుమార్ యాదవ్, ప్రభు త్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్, శాసనమండలి ఛీఫ్‌విప్ పంచుమర్తి అనురాధ, పలువురు అధికా రులు విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతికి వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన వాయుసేన ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీ

# కడప బేసిన్‌లో లక్షల కోట్ల విలువైన ఖనిజ నిక్షేపాలు: మంత్రి రవీంద్ర
## సిఎస్ఐఆర్- ఎన్‌జిఆర్ఐతో ఎపి ప్రభుత్వం చరిత్రాత్మక ఒప్పందం

**విజయవాడ,ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని కడప ప్రాంతం దేశ ఇంధన, పారిశ్రామిక రంగాల భవిష్యత్తును మార్చే ప్రధాన ఖనిజ కేంద్రంగా అవతరించబోతోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు హైదరాబాద్ సీఎస్ఐఆర్ –నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిటికల్ మినరల్స్ రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఇంటరాక్షన్ సమావేశంలో పాల్గొన్నారు. ఆర్ అండ్ డి కేంద్రంలోని సీఎస్ఐఆర్– ఎన్‌జీఆర్ఐ ల్యాబ్స్ పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కడప వెంపల్లె పరిధిలో ముఖ్యంగా తుమ్మలపల్లె ప్రాంతంలో అత్యంత విలువైన వ్యూహాత్మక ఖనిజాలైన లిథియం, గాలియం నిక్షేపాలు భారీగా ఉన్నట్లు శాస్త్రవేత్తల పరిశోధనల్లో వెల్లడైంది. ఈ నిక్షేపాల అధునాతన అన్వేషణ కోసం ఆంధ్రప్రదేశ్ గనులు, భూగర్భ వనరుల శాఖ.. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పరిశోధనా సంస్థ నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌తో చారిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. సుమారు రూ. 13 లక్షల కోట్లకు పైగా విలువైన నిక్షేపాలు కడప బేసిన్ వెంపల్లె ఫార్మేషన్‌లో ఉన్నట్లు గుర్తించారు. అక్కడి భూగర్భంలో 1000 పిపిఎం వరకు లిథియం, 250 పిపిఎం వరకు గాలియం ఉన్నట్లు గుర్తించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం.. సుమారు రూ.2 లక్షల కోట్ల విలువైన లోహాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ నిక్షేపాలను పూర్తిగా వెలికితీసేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తోంది. 2027లో ప్రారంభమయ్యే ఈ ప్రాజెక్టు



క్రిటికల్ మినరల్స్ రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఇంటరాక్షన్ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర

2032 నాటికి పూర్తి కానుంది. ఈ ఐదేళ్ల అన్వేషణ కార్యక్రమానికి అయ్యే వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్ భరిస్తుంది. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్‌పై ఎలాంటి అదనపు ఆర్థిక భారం పడదు. కడప బేసిన్ పరిధిలో ఖనిజాలు ఎక్కడెక్కడ విస్తరించి ఉన్నాయో గుర్తించడానికి, లోతైన భూగర్భ పరిశోధనల కోసం అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగించనున్నారు. వైమానిక భూభౌతిక సర్వేలు, శాటిలైట్ రిమోట్ సెన్సింగ్, ఖనిజ లక్ష్యకరణ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ త్రీడీ సబ్ సర్ఫేస్ మోడలింగ్ చేపట్టనున్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా విద్యుత్ వాహనాలు, సెమీకండక్టర్లు, అధునాతన ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్ మరియు రక్షణ రంగాలకు లిథియం, గాలియం వంటి క్రిటికల్ మినరల్స్ అత్యంత కీలకం. ప్రస్తుతం భారతదేశం వీటి కోసం ఇతర దేశాల దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఖినేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌ఖి లో భాగంగా ఈ ప్రాజెక్టు దేశానికి వ్యూహాత్మక ఆస్తిగా మారబోతోంది. కేవలం ఖనిజాల తవ్వకమే కాకుండా, ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న విస్తారమైన తీరప్రాంతం, ఓడరేవులు మరియు అనుకూల పారిశ్రామిక విధానాలను సద్వినియోగం చేసుకుని రాష్ట్రంలోనే ఖనిజ ప్రాసెసింగ్, రిఫైనింగ్, మరియు బ్యాటరీల తయారీ వంటి దిగువశ్రేణి పరిశ్రమలను కూడా పెద్ద ఎత్తున ప్రోత్సమిస్తాం. తద్వారా స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డా.ప్రకాశ్ కుమార్ నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ శాస్త్రవేత్త డా.బి.శ్రీనివాస్ గారు, ఇతర మైన్స్ అండ్ జియాలజీ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.



హుండీ లెక్కింపులు పరిశీలిస్తున్న చైర్మన్

# సెప్టెంబర్ 4న సామూహిక వరలక్ష్మి వ్రతాలు, శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 24, ప్రభాతవార్త :** సెప్టెంబర్‌న దుర్గమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఉదయం 7 నుండి 9 వరకు సామూహిక ఉచిత వరలక్ష్మి వ్రతాలు, ఉద యం 10 నుండి 11 వరకు ఉభయ దాతలు రు.1,500 ల టికెట్‌పై వరలక్ష్మి వ్రతాలు జరిపిస్తామన్నారు.

**సెప్టెంబర్4న శ్రీకృష్ణాష్టమి వేడుకలు:** దుర్గమ్మవారి ఆలయంలో సెప్టెంబర్ 4న శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. సాయంత్రం 6.30కు ఉట్టికొట్టడం కూడా నిర్వహిస్తామన్నారు. శ్రీ మహాలక్ష్మి దేవిగా అలంకరిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. శ్రావణ శుక్రవారం పూజలు శ్రీ అమ్మవారికి అర్చకస్వాములు ఏకాంతంగా నిర్వహిస్తారని ఇఓ తెలిపారు. టికెట్లు కావాల్సిన భక్తులు పాల్గొనాలనుకునే భక్తులు ముందస్తుగా అధికారిక మనమిత్ర వాట్సాప్ సేవలు ద్వారా లేదా దేవస్థానం కౌంటర్ల వద్ద టికెట్లు పొందవచ్చునని ఇఓ తెలిపారు.

**27 నుండి పవిత్రోత్సవాలు:** దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 27 నుండి 29 వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

**హుండీ లెక్కింపుల్లో రు.3కోట్ల 91లక్షలు:** దుర్గమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రు.3,91,17,684 ల నగదు తో పాటు యుఎస్ఎ డాలర్స్ 663, మలేషియా రింగేట్స్ 107, యుఎఇ దిర్హామ్స్ 840, సింగపూర్ డాలర్స్ 28, యూరోలు 85, సౌదీ రియాల్స్ 21, కువైట్ దినార్లు 15.25, ఖతార్ రియాల్స్ 2, ఒమని రియాల్స్ 6, ఒమని బైసాలు 4100, హాంకాంగ్ డాలర్స్ 20, కెనడా డాలర్స్ 90, న్యూజిలాండ్ డాలర్స్ 20, సౌతాఫ్రికా రౌండ్స్ 200, బహ్రైనీ దినార్లు 11, బంగారం 306 గ్రాములు, వెండి 4కెజిల 170 గ్రాములు లభించినట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి రు.1,00,116ల విరాళాన్ని కడపకు చెందిన చల్ల లక్ష్మిరెడ్డి సోమవారం అందించారు. పశ్చిమగోదావరికి చెందిన రేణుక స్వాతి రు.2,11,116 విరాళం నిత్యాన్నదాన పథకానికి అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



లలిత (ఫైల్) చంద్రకళ (ఫైల్) నాగరాజు (ఫైల్)

# అకస్మాత్తుగా అంగన్‌వాడీ టీచర్ మృతి
## అంత్యక్రియలకు వస్తూ ప్రమాదంలో కోడలు, అల్లుడు దుర్మరణం

**లింగాల, ఆగస్టు 24, ప్రభాతవార్త :** విధులు నిర్వర్తించడానికి వస్తూ కూర్చున్న చోటనే కుప్పకూలి మృతి చెందిన అంగన్‌వాడీ టీచర్ లలిత (40) అంత్యక్రియల్లో పాల్గొనడానికి వస్తూ మార్గమధ్యంలోనే రోడ్డు ప్రమాదంలో మృతురాలి అల్లుడు నాగరాజు(35), కోడలు చంద్రకళ (32) మృతి చెందగా కొడుకు శ్రీకాంత్ పరిస్థితి విషమంగా ఉన్నది. మండల పరిధిలోని రాయవరం గ్రామానికి చెందిన లలిత అంగన్‌వాడీ టీచర్‌గా అదే గ్రామంలో విధులు నిర్వర్తిస్తున్నారు. అచ్చంపేటలో ఉంటున్న ఆమె సోమవారం ఉదయం విధులకు హాజర య్యేందుకు రాయవరం రావడానికి బస్టాండ్‌కు చేరుకున్నారు. అయితే అక్కడ కొద్దిసేపటి తర్వాత ఆమెకు కళ్లు తిరగడంతో పక్కనే కూర్చున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కూర్చున్నచోటే ఆమె మృతి చెందినట్లు పేర్కొన్నారు. లలిత మృతి చెందిన విషయం కుటుంబసభ్యులకు తెలియడంతో హైదరాబాద్‌లో ఉంటున్న ఆమె కుమారుడు శ్రీకాంత్, కోడలు చంద్రకళ (32), అల్లుడు నాగరాజు (35) అచ్చంపేటకు బయలుదేరారు. ముగ్గురూ ఒకే బైక్‌పై అచ్చంపేటవైపు వస్తుండగా నల్గొండ జిల్లా డిండి సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. అచ్చంపేట నుంచి వెళ్తున్న కారు బైక్‌ను బలంగా ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో చంద్రకళ, నాగరాజు మృతి చెందగా శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. లలిత మృతి పట్ల తోటి అంగన్వాడీ టీచర్లు తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేసి, ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# సౌదీఅరేబియా సమీపంలో ట్యాంకర్‌కు నిప్పు
## గుర్తుతెలియని క్షిపణి దాడి

**జెడ్డా, ఆగస్టు 24:** సౌదీ అరేబియాలోని ఎర్ర సముద్ర తీరానికి సమీపంలో సోమవారం ఓ చమురు ట్యాంకర్‌ను గుర్తుతెలియని క్షిపణి ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ట్యాంకర్‌లోని సిబ్బంది అందరూ సురక్షిగా ఉన్నారని బ్రిటన్‌కు చెందిన సముద్ర రవాణా సంస్థ యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ తెలిపింది. మంటల కారణంగా ఎలాంటి పర్యావరణ ముప్పు ఏర్పడినట్లు సమాచారం లేదని పేర్కొంది.సౌదీ అరేబియాలోని యన్బు నగరానికి 63 నాటికల్ మైళ్ల పశ్చిమాన ఈ ఘటన జరిగినట్లు యుకెఎంటివో వెల్లడించింది. యెమెన్‌కు వందల కిలోమీటర్ల దూరంలో ఉత్తరంగా యెన్బు ఉంది. ఇరాన్ మద్దతుతో పనిచేస్తున్న హౌతీల నుంచి ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలకు భద్రతా ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో తాజా ఘటన చోటుచేసుకుంది.ఈ నెల ప్రారంభంలోనూ సౌదీ సంబంధాలున్న ఓ ట్యాంకర్‌పై దాడి చేసినట్లు హౌతీ గ్రూప్ ప్రకటించింది. ఎర్ర సముద్రంలో జరిగిన ఆ దాడిలో కనీసం ఆరుగురు మరణించగా, మరో 10 మంది గాయపడినట్లు సమాచారం. తొలిదాడిలో ముగ్గురు పాకిస్థానీలు, ఒక ఇండోనేషియా వ్యక్తి సహా నలుగురు సిబ్బంది మృతి చెందారు. అనంతరం నౌకలోని వారిని తరలించేందుకు వచ్చిన సహాయక బృందాన్ని లక్ష్యంగా చేసుకుని రెండో క్షిపణి దాడి జరిగిందని యెమెన్ కోస్ట్ గార్డ్ తెలిపింది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్‌లు ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన తర్వాత ఓ నౌకపై హౌతీలు జరిపిన తొలి ప్రాణాంతక దాడి ఇదే. జూలై 29న కూడా హౌతీలు ఓ సౌదీ చమురు ట్యాంకర్‌పై దాడి చేశారు. అంతకుముందు జూలైలో ఎర్ర సముద్రం మీదుగా సౌదీ అరేబియా నుంచి, సౌదీ అరేబియాకు వెళ్లే నౌకా రవాణాను దిగ్బంధిస్తామని హౌతీలు ప్రకటించారు. మరోవైపు, మార్చి నుంచి ఇరాన్ హోర్ముజ్ జలసంధిని ఇరాన్‌దిగ్బంధించడంతో సౌదీ అరేబియా తన చమురు ఎగుమతుల కోసం ఎర్ర సముద్రంలోని నౌకాశ్రయాలపై మరింతగా ఆధారపడాల్సి వస్తోంది.యెమెన్‌లోని ఎర్ర సముద్ర తీరప్రాంతంలో, ముఖ్యంగా బాబ్ అల్‌మందబ్ జలసంధి సమీపంలోని ప్రాంతాల్లో హౌతీలకు నియంత్రణ ఉంది. ఎర్ర సముద్రాన్ని హిందూ మహాసముద్రంతో అనుసంధానించే ఈ మార్గం ప్రపంచంలోని అత్యంత రద్దీగా ఉండే సముద్ర రవాణా మార్గాల్లో ఒకటి. ఇక్కడ నౌకా రవాణాకు దీర్ఘకాలిక అంతరాయం ఏర్పడితే ఆసియా మార్కెట్లకు వెళ్లే సరకు రవాణాపై ప్రభావం పడటంతో పాటు, నౌకలు మరింత సుదీర్ఘమైన ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

# సంగంబండ రైట్ హైకెనాల్ కాల్వకు గండి
## చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
## సాగునీటి కోసం రైతుల ఎదురుచూపు
## పట్టించుకోని సంబంధిత అధికారులు

**మాగనూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త :** సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ రైట్ హై లెవెల్ కాల్వకు సోమవారం తెల్లవారుజామున నేరడగం శివారులో గండి పడింది. నీటి ప్రవాహానికి వర్కూర్ శివారులో ఉన్న దాదాపు 30 ఎకరాల పొలంలోకి నీరు చేరి పంటలకు నష్టం కలిగించిందని రైతులు వాపోతున్నారు. కాలువలు అస్తవ్యస్తంగా మారడంతో నీటి ప్రవాహం ముందుకు పోకుండా మధ్యలో ఇలా గండ్లు పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. రైతులు మాట్లాడుతూ రిజర్వాయర్ రైట్ హై లెవెల్ కెనాల్ కాల్వకు గత కొన్ని సంవత్సరాలుగా మరమ్మత్తులు చేయడం లేదని, నామమాత్రంగా పెరిగిన తుంగను అక్కడక్కడ తీసి వదిలేస్తున్నారని అన్నారు. పూర్తిస్థాయిలో కాలువ పూడిక తీయకపోవడంతో పంటలకు సరిపడా సాగు నీరు అధికారులు విడుదల చేసినప్పుడు కాల్వలలో చెత్త చెదారం అడ్డు పడడంతో కాల్వ కోతకు గురై గండ్లు పడుతున్నాయని రైతులు అస హనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాలపై పలుమార్లు సంబంధిత అధికా రుల దృష్టికి తీసుకెళ్లిన ఏ ఒక్కరు పట్టించు కోవడంలేదని కాలువల వెంబడి బండి తోవలు కూడా చేసుకున్న సంఘటనలు ఉన్నాయని ఈ విషయాలపై ఏ ఒక్క అధికారి పట్టించుకోవడంలేదని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా గండిలను సరిచేసి సాగునీరు వృధాగా పారకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కాలువలు పూడికలు తీసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని రైతన్నలు ఆకాంక్షి స్తున్నారు.



కాల్వకు గండి పడడంతో పొలాల్లోకి భారీగా నీరు చేరిన దృశ్యం

# రైతు నాయకుడు, సిపిఎం సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి కన్నుమూత

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఆగస్టు 24, ప్రభాతవార్త:** అఖిల భారత కిసాన్ సభా ఉపాధ్యక్షుడు, సిపిఎం సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి (90) సోమవారం తెల్లవారుజామున కన్ను మూశారు. వయోభారంతోపాటు శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన, గత నాలుగు రోజులుగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆరోగ్యం మరింత క్షీ ణించడంతో వైద్యులు అత్యవసర చికిత్స అందించి నప్పటికీ ఫలితం లేకపోయింది. సోమవారం తెల్ల వారుజామున 3.30 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచి నట్లు నిమ్స్ వైద్యులు ధ్రువీకరించారు. జీవితాంతం వ్యవసాయరంగ పరిరక్షణ, రైతాంగ హక్కుల కోసం పోరాడారు. అఖిల భారత కిసాన్ సభా ఉపాధ్యక్షుడిగా దేశవ్యాప్తంగా రైతు ఉద్యమాలను ఏకీకృతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. సిపిఎం పార్టీలో సుదీర్ఘకాలం పనిచేస్తూ, సామాజిక, రాజకీయ పోరాటాల్లో నిత్యం ముందుభాగాన నిలిచారు. కార్మిక, గిరిజన సమస్యలు, రైతుల సమస్యలతోపాటు కౌలు రైతులు, వ్యవ సాయ కార్మికుల హక్కుల కోసం ఎన్నో ఆందోళన కార్యక్రమాలకు నాయకత్వం వహించారు.

# జీవితాన్ని రైతుల సంక్షేమానికి అంకితం చేసిన నాయకుడు
## సారంపల్లి మల్లారెడ్డి మరణంపై తెలంగాణ సిఎం సంతాపం

**పభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు24:** రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడిన రైతు నాయకుడు, కమ్యూనిస్టు నేత సారంపల్లి మల్లారెడ్డి మరణించారని తెలిసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.రైతుల హక్కులు, వ్యవసాయ సమస్యల పరిష్కారం కోసం ముందుండి అనేక ఉద్యమాలు నడిపిం చారని గుర్తుచేశారు. రైతు సంఘం నేతగా, అఖిల భారత కిసాన్‌సభ ఉపాధ్యక్షుడిగా ఆయన అందిం చిన సేవలు చిరస్మరణీయమని పేర్కొ న్నారు. భూమి హక్కులు, సాగునీరు, వ్యవసాయ రుణా లు, విత్తనాలు వంటి వ్యవసాయ రంగానికి సంబంధించిన విస్తృత అంశాలపై నిరంతరం కృషి చేస్తూ జీవితాన్ని రైతుల సంక్షేమం కోసం అంకితం చేసిన నాయకుడు మల్లారెడ్డి అని పేర్కొన్నారు.

# ఉద్యోగం రాలేదని డిప్రెషన్‌లోకి..
## అమెరికాలో హైదరాబాద్ యువకుడి ఆత్మహత్య

**హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త :** అమెరికా (యుఎస్ఏ)లో ఉన్నత విద్య పూర్తిచేసి మంచి భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న హైదరా బాదీ యువకుడు సాయిప్రదీప్ జీవితం విషాదాంతమైంది. హైదరాబాద్‌లోని దమ్మాయిగూడ శ్రీనివాస నగర్ కాలనీకి చెందిన సాయిప్రదీప్ 2024 లో ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లాడు. టెక్సాస్ రాష్ట్రంలోని శాన్ ఆంటోనియోలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు. చదువు పూర్తయిన తర్వాత అక్కడే ఉద్యోగం సాధించి స్థిరపడాలని భావించాడు.అయితే గత నాలుగు నెలలుగా ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నా ఆశించిన ఫలితం దక్కలేదు. వరుసగా అవకాశాలు చేజారడంతో తీవ్ర ఒత్తిడికి లోనైన సాయిప్రదీప్ మానసికంగా కుంగిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ఈనెల 21న శాన్‌ఆంటోనియోలోని తన గదిలో సాయిప్రదీప్ ఆత్మహత్య చేసుకున్నాడు.



# కేన్సర్ కణాల్లోనే పనిచేసే స్మార్ట్ డ్రగ్
## కిమోథెరపీకి ప్రత్యామ్నాయంగా కొత్త ఆశలు


**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** కేన్సర్ కణాల్లోకి ప్రవేశించిన తర్వాత మాత్రమే యాక్టివేట్ అయి, ఆరోగ్యకరమైన కణాలకు హాని కలిగించకుండా పనిచేసే కొత్త స్మార్ట్ కేన్సర్ ఔషధాన్ని భారత శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. సంప్రదాయ కిమోథెరపీలో కేన్సర్ కణాలతోపాటు ఆరోగ్యకరమైన కణాలు కూడా దెబ్బతినడం వల్ల అనేక దుష్ప్రభావాలు ఎదురవుతాయి.

ఈ నేపథ్యంలో సాధా రణ కణజాలాల్లో నిష్క్రియంగా ఉండి, కేవలం కణితి ప్రాంతంలోనే క్రియాశీలమయ్యే చికిత్సల అభివృద్ధికి ఈ పరిశోధన కీలక ముందడుగుగా భావిస్తున్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ ఆధ్వర్యంలోని స్వయం ప్రతిపత్తి సంస్థకు చెందిన డాక్టర్ అసిస్ బాలా, ఐఐటీ గువాహటి పరిశోధకుడు డాక్టర్ కె.పి భబక్ నేతృత్వంలోని సంయుక్త బృందం ఆర్‌కె-251 అనే కొత్త స్మార్ట్ కేన్సర్ డ్రగ్‌ను అభివృద్ధి చేసింది. కేన్సర్ కణాల్లోనే యాక్టివేట్ అయి కేన్సర్ కణాల్లో.. సాధారణ కణాలతో పోలిస్తే రియాక్టివ్ ఆక్సిజెన్ స్పెసీస్ ఆర్వోఎస్ అనే హానికర అణువులు అధిక స్థాయిలో ఉంటాయి.

ఆర్‌కె-251 కేన్సర్ కణంలోకి చేరినప్పుడు అక్కడి అధిక ఆర్వోఎస్ స్థాయి ఔషధాన్ని యాక్టివేట్ చేస్తాయి. దీంతో ఎన్బీడిహెచ్ఇఎక్స్ అనే శక్తివంతమైన యాంటీకేన్సర్ సమ్మేళనం విడుదలవుతుంది. ఈ సమ్మేళనం కేన్సర్ కణాలు జీవించ డానికి, చికిత్సను తట్టు కోవడానికి ఉపయోగించుకునే కీలక టార్గెట్ ప్రోటీన్లను అడ్డుకుంటుంది. తద్వారా కేన్సర్ కణాలపై ప్రభావం చూపేలా ఈ ఔషధాన్ని రూపొం దించారు. ప్రాథమిక దశ ప్రయోగాల్లో ఆర్‌కె-251 దూకుడైన ట్రిపుల్ నెగెటివ్ బ్రెస్ట్ కేన్సర్ కణాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపించింది.

అదే సమయంలో ఆరోగ్యకరమైన కణాలపై దీని ప్రభావం చాలా తక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తిం చారు. జీబ్రాఫిష్ పిండాలపై నిర్వహించిన ప్రవర్తనా అధ్యయనంలోనూ ఔషధం వల్ల స్పష్టమైన విషపూరిత లక్షణాలు కనిపించలేదు. అలాగే ఆర్వోఎస్ సమక్షంలో అవసరమైన ఫ్లోరోసెన్స్‌ను ప్రదర్శించింది. ఈ ఫలితాలు ఆర్‌కె-251 మరింత పరిశోధన, భద్రతా ధ్రువీకరణకు అనుకూలంగా ఉండవచ్చనే సూచనలు ఇస్తున్నాయి.

ఈ ఔషధాన్ని మనుషులపై పరీక్షించే దశకు చేరుకోవడానికి ముందు మరిన్ని ప్రయోగాలు, భద్రతా పరీక్షలు అవసరం. ఈ పరిశోధన ఎసిఎస్ జర్నల్ ఆఫ్ మెడికల్ కెమిస్ట్రీలో ప్రచురితమైంది.



ఆట



## వరల్డ్ కప్ సెమీఫైనల్స్‌కు.. భారత్ పురుషుల హాకీ జట్టు అగ్నిపరీక్ష

**న్యూఢిల్లీ:** వర్ల్డ్ కప్ సెమీఫైనల్స్ అర్హత సాధించడం భారత పురుషుల హాకీ జట్టుకు అగ్నిపరీక్ష అయింది. ప్రస్తుతం బెల్జియంలోని వావ్రే, నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టెల్వీన్‌లలో సంయుక్తంగా నిర్వహిస్తున్న 2026 ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచ కప్‌లో పోటీపడుతోంది. తమ గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచిన భారత్, ఫేజ్ 2కు చేరుకుంది. వేల్స్‌పై 3-1 తేడాతో గెలుపుతో ప్రారంభించిన భారత్, ఆ తర్వాత ఇంగ్లాండ్ చేతిలో 2-4 తేడాతో ఓటమి చవిచూసింది. అనంతరం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 5-3 తేడాతో విజయం సాధించి పుంజుకున్న భారత్, ఫేజ్ 2లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఫేజ్ 2లో భారత్ ఇప్పుడు నెదర్లాండ్స్, అర్జెంటీనా, ఇంగ్లాండ్‌లతో పూల్ ఈ లో ఉంది. రెండో రౌండ్‌ను భారత్ నెదర్లాండ్స్‌తో 1-3 తేడాతో ఓటమితో ప్రారంభించింది. ఈ ఓటమి సెమీఫైనల్స్‌కు మరింత కష్టతరం చేసినా, అవకాశాలు ఇంకా సజీవంగా ఉన్నాయి. సెమీఫైనల్స్‌కు అర్హత సాధించడానికి భారత్ ముందు మూడు అవకాశాలు ఉన్నాయి. వీటిలో భారత్ ముందుగా అర్జెంటీనాను ఓడించి, వీలైనన్ని ఎక్కువ గోల్స్ చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలి. ఒకవేళ భారత్ అర్జెంటీనాను 2 గోల్స్ తేడాతో ఓడించి, సెమీఫైనల్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే నెదర్లాండ్స్ ఇంగ్లాండ్‌ను 3 గోల్స్ తేడాతో ఓడించాల్సి ఉంటుంది. భారత్ అర్జెంటీనాను 3 గోల్స్ తేడాతో ఓడిస్తే, నెదర్లాండ్స్ ఇంగ్లండ్‌ను 2 గోల్స్ తేడాతో, 4 గోల్స్ తేడాతో ఓడిస్తే, నెదర్లాండ్స్ ఇంగ్లండ్‌ను ఒక గోల్ తేడాతో ఓడించాల్సి ఉంటుంది. అర్జెంటీనాపై భారత్ సాధించే విజయ మార్జిన్ ఎంత ఎక్కువగా ఉంటే, ఇంగ్లాండ్‌పై నెదర్లాండ్స్‌కు అవసరమయ్యే మార్జిన్ అంత తక్కువగా ఉంటుంది. జట్టు ఇప్పుడు నెదర్లాండ్స్ ఇంగ్లాండ్ మ్యాచ్‌పై దృష్టి సారిస్తూనే, అర్జెంటీనాపై అవసరమైన ఫలితాన్ని సాధించడంపై దృష్టి పెట్టాలి. ఫలితంతో పాటు, గెలుపు అంతరం కూడా అంతే ముఖ్యం. ఇవన్నీ జరిగితేనే పురుషుల జట్టు హాకీ ప్రపంచ కప్ సెమీఫైనల్స్‌కు చేరుకునే అవకాశం ఇంకా ఉంది.



## వరల్డ్ బ్యాడ్మింటన్ క్వీన్‌గా అన్‌సే యంగ్

**న్యూఢిల్లీ:** దక్షిణ కొరియాకు చెందిన ప్రపంచ నంబర్ 1 క్రీడాకారిణి ఆన్ సేయంగ్ న్యూఢిల్లీలో జరిగి బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుని ప్రపంచ బ్యాడ్మింటన్ క్వీన్‌గా నిలిచింది. ఆమె జపాన్‌కు చెందిన అకానె యమగుచిని ఫైనల్‌లో కేవలం 49 నిమిషాల్లోనే 21-17, 21-14 తేడాతో ఓడించింది. పాదపు గాయంతో బాధపడుతూ ఆడినప్పటికీ, ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా ఆరు మ్యాచ్‌లనూ గెలిచి, (2023 విజయం తర్వాత) తన రెండవ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఆరంభ పోరు తర్వాత, 7-7తో సమంగా ఉన్న స్కోరు నుండి సేయంగ్ ఊపు అందుకుని, వరుసగా పాయింట్లు సాధిస్తూ విరామ సమయానికి 11-8 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే, యమగుచి ఆమెను అంత సులభంగా గెలవనివ్వలేదు. 15-15 స్కోరు వద్ద, జపనీస్ క్రీడాకారిణి కొద్దిసేపు ఊపుతో ఆడించి. అయితే 17-17 స్కోరుతో ఆట సమంగా ఉన్నప్పుడు, కొరియన్ నిర్ణయాత్మక విజృంభణ చేసి వరుసగా నాలుగు పాయింట్లుతో 21-17తో ఆధిక్యంకి వచ్చింది. రెండవ సెట్‌లో, యమగుచి 6-5 ఆధిక్యంతో ప్రారంభించినప్పటికీ, సేయంగ్ నిలకడగా ఆడి 7-7తో సమం చేసింది. తర్వాత 8-7 స్కోరు వద్ద, సేయంగ్ వేగంగా డౌన్‌దిలైన్ స్మాష్‌ను కొట్టింది. యమగుచి తన రాకెట్‌ను షటిల్‌కు తగిలించగలిగింది, కానీ తేరుకునే ప్రయత్నంలో ఆమె కోర్టులో కుప్పకూలిపోయింది. సేయంగ్ మళ్ళీ డౌన్ ది లైన్ స్మాష్‌కు ప్రయత్నించి విరామ సమయానికి, ఆమె 11-7 ఆధిక్యంలో ఉంది. అదృష్టవశాత్తూ నెట్ కార్డ్ తగలడంతో యమగుచి స్కోరు అంతరాన్ని 11-9కి, ఆపై 11-10కి తగ్గించగలిగింది. 13-11 వద్ద సేయంగ్ తడబడినా 16-11 స్కోరు వద్ద యమగుచి కొట్టిన షాట్ గురితప్పింది. సేయంగ్ ఆ తర్వాతి మూడు పాయింట్లను 18-14. 19-14. 20-14తో విజయాన్ని కైవసం చేసుకుంది.

## మహిళల ఛాంపియన్స్.. గ్రూప్‌స్టేజ్‌కు అర్హత సాధించిన బెంగాల్

**న్యూఢిల్లీ:** వరుసగా రెండుసార్లు ఏఎఫ్‌సి మహిళల ఛాంపియన్స్ లీగ్ గ్రూప్ స్టేజ్‌కు అర్హత సాధించి ఈస్ట్ బెంగాల్ చరిత్ర సృష్టించింది. మ్యాచ్‌లో మలేషియా క్లబ్ సబా ను 2-0 తేడాతో ఓడించిన ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సి, ఎఎఫ్‌సి మహిళల ఛాంపియన్స్ లీగ్ గ్రూప్ దశలో వరుసగా రెండుసార్లు ఆడిన తొలి భారతీయ క్లబ్‌గా నిలిచింది. కోట కినాబాలులోని లికాస్ స్టేడియంలో రెండవ అర్ధభాగంలో ఒలివియా అనోక్యే (67వ నిమిషం) మరియు సౌమ్య గుగులోత్ (87) చేసిన గోల్స్‌తో హోరాహోరీగా సాగిన పోరు ముగిసింది. దీంతో ఈస్ట్ బెంగాల్ గరిష్ఠ పాయింట్లతో గ్రూప్ ఎ లో అగ్రస్థానంలో నిలిచింది. ఐడబ్ల్యూఎల్ ఛాంపియన్లు అంతకుముందు రాజ్‌షాహి స్టార్స్ (బంగ్లాదేశ్)ను 4-0తోను, రోవర్స్ (గ్వామ్)ను 12-0తో ఓడించారు. ఆట ఉత్కంఠభరితంగా ప్రారంభమైన తర్వాత, 21వ నిమిషంలో మిసాకి నకయామా కొట్టిన హాఫ్‌వాలీ గోల్ పోస్ట్ పైనుంచి వెళ్ళిపోవడంతో సబా అవకాశాలను



సృష్టించడం మొదలుపెట్టింది. మైలిసా అటిస్ ఫస్ట్‌టైమ్ క్రాస్‌ను అందించగా, ఎంజీ బ్రౌసార్డ్ ప్రయత్నాన్ని విఫలం చేసింది. రెండవ అర్ధభాగంలో ఆట మరింత సమంగా సాగింది. జూలియానా బారెక్ స్లాలోమింగ్ చేస్తూ బాక్స్‌లోకి దూసుకెళ్లింది, కానీ అది విఫలమైంది. 55వ నిమిషంలో సౌమ్య దూసుకెళ్లి బంతిని అందించగా, సులంజనా రౌల్ బలంగా హెడర్ చేయగా, సబా గోల్ కీపర్ జునైదీ దానిని అడ్డుకున్నాడు. ఈస్ట్ బెంగాల్ ఊపందుకుంటున్న తరుణంలో, స్టెఫీ నుండి తప్పించుకుంటూ ముందుకు దూసుకెళ్తున్న ఒలివియాకు తర్వాతి అవకాశం లభించగా, జునైదీ చేసిన ధైర్యమైన బ్లాక్ ఆమెను అడ్డుకుంది.

సులంజన ఇచ్చిన త్రూ పాస్‌ను అందుకున్న ఒలివియా వేగంతో సితి నుర్ఫైజాను అధిగమించి, రెండవ ప్రయత్నంలో గోల్ చేసింది. సబ్‌స్టిట్యూట్ రింపా హాల్దార్ అందించిన క్రాస్‌ను సౌమ్యగోల్‌గా మలచడంతో మోషల్‌గర్ల్స్ విజయాన్ని ఖాయం చేసుకుంది.











## తొలి రెండు టెస్టుల తర్వాత.. అత్యధిక వికెట్లు తీసిన భారత్ బౌలర్లు

### టాప్ 5లో నరేంద్ర హిర్వానీ

**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో టెస్ట్ కెరీర్‌ను ఘనంగా ప్రారంభించడం చాలా అరుదు. తొలి రెండు మ్యాచ్‌లలోనే అత్యధిక వికెట్లు తీయడం మరింత అరుదు. గత కొన్నేళ్లుగా భారత బౌలర్లు కొన్ని అద్భుతమైన ఆరంభ ప్రదర్శనలు కనబరిచారు. కేవలం రెండు టెస్టుల తర్వాత అత్యధిక వికెట్లు తీసిన వారి జాబితాలో 1980ల చివర్లో ఆడిన ఒక లెగ్ స్పిన్నర్ అగ్రస్థానంలో ఉండగా, ఇటీవలి స్టార్లు కూడా ఈ జాబితాలో ఉన్నారు. భారత్ స్టార్ ప్లేయర్ నరేంద్ర హిర్వానీ 24 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ యువ లెగ్ స్పిన్నర్ 1988 జనవరిలో చెన్నైలో వెస్టిండీస్ మ్యాచ్‌లో టెస్ట్ చరిత్రలోనే అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనలలో ఒకటి కనబరిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో 61 పరుగులు ఇచ్చి 8 వికెట్లు, ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో 75 పరుగులకు 8 వికెట్లు పడగొట్టాడు. దీంతో అరంగేట్రంలోనే ఒకే టెస్టులో 16 వికెట్లు తీసిన అతని రికార్డు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. ఆ ఏడాది చివర్లో బెంగళూరులో న్యూజిలాండ్‌తో జరిగిన రెండవ టెస్టులో, హిర్వానీ మరో 8 వికెట్లు పడగొట్టాడు. ఇందులో రెండవ ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్ల ప్రదర్శన కూడా ఉంది. రెండు మ్యాచ్‌ల తర్వాత అతను తీసిన మొత్తం 24 వికెట్లు అత్యధికంగా నిలిచింది. ఇక అక్షర్ పటేల్ 18 వికెట్లతో ఈ జాబితాలో రెండవ స్థానంలో ఉన్నాడు. ఈ ఎడమచేతి వాటం స్పిన్నర్ 2021 ప్రారంభంలో ఇంగ్లాండ్‌తో స్వదేశంలో జరిగిన టెస్ట్ సిరీస్‌లో 11 వికెట్లు పడగొట్టాడు. ఇందులో మొదటి ఇన్నింగ్స్‌లో 38 పరుగులకు 6 వికెట్లు, ఆ తర్వాత రెండవ ఇన్నింగ్స్‌లో 32 పరుగులకు 5 వికెట్లు ఉన్నాయి. తదుపరి ఇంగ్లాండ్ టెస్టులో అతను మరో 9 వికెట్లు పడగొట్టాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను అతను 27 వికెట్లతో ముగించాడు. అలాగే 17 వికెట్లతో ఎడమచేతి వాటం స్పిన్నర్ మానవ్ సుతార్ జూన్ 2026లో ముల్లన్‌పూర్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు, రెండవ ఇన్నింగ్స్‌లో మరో వికెట్ పడగొట్టాడు. 2026 ఆగస్టులో గాలేలో శ్రీలంక రెండవ టెస్టులో, అతను మొదటి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు, రెండవ ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు తీసి, మ్యాచ్ గణాంకాలను 131 పరుగులకు 10 వికెట్లతో ముగించాడు. 1980 లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆఫ్ స్పిన్నర్ నందలాల్ యాదవ్ తన మొదటి రెండు మ్యాచ్‌లలో 13 వికెట్లు పడగొట్టాడు. పొడగరి అయిన కుడిచేతి మీడియం పేసర్ వెంకటేష్ ప్రసాద్ తన తొలి రెండు టెస్ట్ మ్యాచ్‌ల తర్వాత 13 వికెట్లు కూడా పడగొట్టాడు. బంతిని స్వింగ్ చేయగల సామర్థ్యానికి, క్రమశిక్షణతో కూడిన లైన్ అండ్ లెంగ్త్‌ను పాటించగలగడానికి అతను గుర్తింపు పొందాడు.

## శ్రీలంకతో 2వ టెస్ట్: భారీస్కోర్ 503 వద్ద భారత్ డిక్లేర్డ్!

**కొలంబో:** శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా భారీ స్కోర్ చేసింది. ధ్రువ్ జురెల్(115 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 503/9 భారీ స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసింది. రిషభ్ పంత్(63) హాఫ్ సెంచరీతో రాణించాడు. 300/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు సోమవారం ఓవర్‌నైట్ బ్యాటర్ సారాన్ష్ జైన్(6) రెండు పరుగులు మాత్రమే చేసి అసితా ఫెర్నాండో బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. దాంతో రిషభ్ పంత్ బ్యాటింగ్‌కు దిగి



ధ్రువ్ జురెల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ముఖ్యంగా పంత్ భారీ షాట్లతో లంకబౌలర్లపై విరుచుకుపడి 81 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకోగా, ధ్రువ్ జురెల్ 97 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. దాంతో భారత్ 419/6 స్కోర్ వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. తర్వాత పంత్ భారీ సిక్సర్లతో విరుచుకుపడగా, అతన్ని కుశార నువాంత క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో 7వ వికెట్‌కు నమోదైన 112 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి మానవ్ సుతార్ రాగా జురెల్ తన జోరును కొనసాగించాడు. మానవ్ (18)ను ప్రభాత్ జయసూర్య పెవిలియన్ చేర్చగా, సిరాజ్‌తో కలిసి ధ్రువ్ రెండో సెషన్‌ను ముగించాడు. ఆఖరి సెషన్‌లో ధ్రువ్ 171 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకోగా, సిరాజ్(3) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. దూకుడుగా ఆడిన ధ్రువ్ వేగంగా పరుగులు రాబట్టి స్కోర్‌ను 500 దాటించడంతో భారత్ తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. అనంతరం శ్రీలంక బ్యాటింగ్‌కు దిగగా 2 బంతులు పడగానే వర్షం అంతరాయం కలిగించింది. ఆ తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా, శ్రీలంక 3 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 8 పరుగులు చేసింది. లాహిరు ఉడారా(1) ప్రసిధ్ కృష్ణ ఔట్ చేయగా, ప్రభాత్ జయసూర్య(2)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. వర్షం కారణంగా రెండో రోజు 56 ఓవర్ల ఆటనే సాధ్యమైంది.



వాణిజ్యం

## మరో 9దేశాలతో వాణిజ్య ఒప్పందాలకు చర్చలు!

### 75% ప్రపంచ వాణిజ్యంలో భారత్‌కు వాటా

### జపాన్‌లో కేంద్ర మంత్రి పియూష్ గోయల్

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** ప్రపంచ వాణిజ్యంలో భారత్ తన భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు కృషి చేస్తోందని మరో 8-9 దేశాల సమూహాలు, వ్యక్తిగత దేశాలతో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల కోసం చర్చలు జరుపుతోందనికేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. 15 ట్రిలియన్ డాలర్ల జీడీపీ కలిగిన ఆర్థిక వ్యవస్థలతో మార్కెట్ ప్రాప్యత లభిస్తుందని చెప్పారు. భారత్ గత నాలుగేళ్లలో 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని గోయల్ పేర్కొన్నారు. ఈ ఒప్పందాలు కలిపి సుమారు 60 ట్రిలియన్ డాలర్ల జీడీపీ కలిగిన 38 అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలను కవర్ చేస్తున్నాయని వివరించారు. జపాన్, కొరియా, ఆసియాన్ ప్రాంతంతో గతంలో కుదిరిన వాణిజ్య ఒప్పందాలను కలుపుకుంటే మరో 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలకు భారత్ ప్రాధాన్య మార్కెట్ లభిస్తోందన్నారు. దీంతో ప్రస్తుతం భారత్ సుమారు 70 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలకు ప్రాధాన్య మార్కెట్ ప్రాప్యత కల్పించే ఒప్పందాలను కలిగి ఉందని గోయల్ చెప్పారు. కొత్తగా చర్చలు జరుగుతున్న ఒప్పందాలు పూర్తయితే ప్రపంచ వాణిజ్యంలో దాదాపు 75 శాతం భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల పరిధిలోకి వస్తుందని తెలిపారు. జపాన్ పర్యటనలో భాగంగా భారత్, జపాన్ వ్యాపార ప్రతినిధులను ఉద్దేశించి గోయల్ మాట్లాడుతూ, భారత్‌కు భారీ దేశీయ మార్కెట్ ఉందని, అదే సమయంలో ప్రపంచానికి తన మార్కెట్లను తెరిచి ఉంచుతోందని అన్నారు. పీయూష్ గోయల్ 27 వరకు జపాన్‌లో పర్యటిస్తున్నారు. భారత్ నుంచి ఇప్పటివరకు వెళ్లిన అతిపెద్ద వ్యాపార ప్రతినిధి బృందానికి ఆయన నేతృత్వం వహిస్తున్నారు. టోక్యో, నాగోయా, ఒసాకా నగరాల్లో ఆయన పర్యటన కొనసాగనుంది. ఈ ప్రతినిధి బృందంలో 200 మందికి పైగా వ్యాపార ప్రతినిధులు పాల్గొంటున్నారు. తయారీ, సెమీకండక్టర్లు, క్లీన్ ఎనర్జీ, ఉక్కు, ఆటోమొబైల్, ఆర్థిక సేవలు, ఆరోగ్య సంరక్షణ, స్టార్టప్‌లు తదితర రంగాలకు చెందిన ప్రతినిధులు ఇందులో ఉన్నారు. భారత్‌లో వచ్చే పదేళ్లలో జపాన్ నుంచి 10 ట్రిలియన్ యెన్‌ల పెట్టుబడులు వచ్చేలా ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గోయల్ తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత్-జపాన్ ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 27.5 బిలియన్ డాలర్లుగా ఉందని, అయితే ఇరు దేశాల మధ్య ఉన్న వాణిజ్య సామర్థ్యంతో పోలిస్తే ఇది చాలా తక్కువేనని ఆయన పేర్కొన్నారు. జపాన్ నుంచి భారత్‌కు వచ్చిన సమీకృత పెట్టుబడులు 48 బిలియన్ డాలర్లను మించాయి. ప్రస్తుతం భారత్‌లోని వివిధ పారిశ్రామిక కేంద్రాల్లో 1,400కు పైగా జపాన్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.



## గోధుమ పిండి ఉత్పత్తుల ఎగుమతులపై నిషేధం ఎత్తివేత

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** గోధుమ పిండి, దానికి సంబంధించిన ఉత్పత్తుల ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం విధించిన నిషేధాన్ని సోమవారం తక్షణమే ఎత్తివేసింది. ఈ మేరకు గోధుమ పిండి ఎగుమతి విధానంలో సవరణలు చేసినట్లు కేంద్రం అధికారిక ప్రకటనలో వెల్లడించింది. గతంలో నిషేధిత కేటగిరీలో ఉన్న గోధుమ పిండి, సంబంధిత ఉత్పత్తులను ఇకపై స్వేచ్ఛా ఎగుమతి కేటగిరీలోకి మార్చినట్లు విదేశీ వాణిజ్య విధానాల డైరెక్టరేట్ జనరల్ నోటిఫికేషన్ జారీ చేసింది.

ఈ మార్పులు వెంటనే అమల్లోకి వస్తాయి. సవరించిన విధానం కింద మైదా, సెమోలినా రవ్వ/సూజీ, సంపూర్ణ గోధుమ పిండి హోల్‌మీల్/ఆట్టా, రిజల్టెంట్ ఆట్టా తదితర ఉత్పత్తులు ఎగుమతి చేసుకోవచ్చు. అయితే సాధారణ ఎగుమతి నిబంధనలు వర్తిస్తాయి. నాలుగేళ్ల తర్వాత పూర్తి స్థాయిలో అనుమతిదే శంలో గోధుమ, ఆట్టా ధరలు భారీగా పెరగడంతో కేంద్ర ప్రభుత్వం 2022 జూలై 12న గోధుమ ఎగుమతులపై నిషేధం విధించింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లలో గోధుమ ధరలు దాదాపు 40 శాతం పెరగడంతో భారత్ నుంచి ఎగుమతులు కూడా భారీగా పెరిగాయి. దీంతో దేశీయంగా గోధుమ, పిండి ధరలు పెరగకుండా ఎగుమతులపై ఆంక్షలు విధించారు.

## రూ.19,400 కోట్లతో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ భారీ విస్తరణ

**న్యూఢిల్లీ,ఆగస్టు 24:** దేశీయ విమానయాన రంగంలో ప్రయాణికుల సంఖ్య వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ భారీ విస్తరణ ప్రణాళికలను చేపడుతోంది. న్యూఢిల్లీ, హైదరాబాద్ విమానాశ్రయాల విస్తరణ, ఆధునికీకరణ కోసం రాబోయే ఐదేళ్ల నుంచి ఏడేళ్లలో సుమారు రూ.19,400 కోట్లు పెట్టుబడి పెట్టాలని సంస్థ నిర్ణయించిందని సంస్థ ఫైనాన్స్, స్ట్రాటజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సౌరభ్ చావ్లా వెల్లడించారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా విమానాశ్రయాల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు మౌలిక వసతులను ఆధునికీకరించేందుకు ఈ పెట్టుబడులు వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం విస్తరణకు సుమారు రూ.13,800 కోట్లు, న్యూఢిల్లీ విమానాశ్రయానికి రూ.5,600 కోట్లు కేటాయిస్తున్నట్లు చావ్లా చెప్పారు. ఆయా విమానాశ్రయ సంస్థలు రుణం, ఈక్విటీ కలయికతో ఈ పెట్టుబడులను సమకూర్చుకుంటాయని, ఇవి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్ కంపెనీకి నేరుగా సంబంధించిన పెట్టుబడులు కావని వివరించారు. ప్రస్తుతం అమెరికా, చైనా తర్వాత ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా



భారత్ ఉంది. ప్రభుత్వ అంచనాల ప్రకారం వచ్చే 14 ఏళ్లలో దేశంలో విమాన ప్రయాణికుల సంఖ్య ఆరు రెట్లు పెరిగి సుమారు 110 కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. వాణిజ్య విమానాల సంఖ్య కూడా 2014లో ఉన్న 400 నుంచి 2040 నాటికి 2,350కి పైగా పెరుగుతుందని అంచనా. విస్తరణ పూర్తయిన తర్వాత హైదరాబాద్ విమానాశ్రయం ఏడాదికి సుమారు 8 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని చావ్లా తెలిపారు. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ పరిధిలో ప్రస్తుతం భారత్‌లో ఆరు విమానాశ్రయాలు, ఫిలిప్పీన్స్‌లో ఒక విమానాశ్రయం ఉన్నాయి. గ్రీస్‌లో మరో విమానాశ్రయం నిర్మాణంలో ఉంది. ఈ నేపథ్యంలో న్యూఢిల్లీ, హైదరాబాద్‌లో చేపడుతున్న విస్తరణ సంస్థ ఆధునికీకరణ కార్యక్రమాలకు ఆరంభం మాత్రమే కావచ్చని చావ్లా పేర్కొన్నారు.



## రివ్వున ఎగసిన పసిడి, వెండి ధరలు!

### బంగారం రూ.880, వెండి రూ.5వేలు పెరుగుదల

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** దేశీయంగా బంగారం ధరలు సోమవారం స్వల్పంగా పెరిగాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో బంగారం ధర 0.4 శాతం లాభపడి, 10 గ్రాములకు రూ.1.62 లక్షల స్థాయిలో ప్రారం భమైంది. మార్కెట్ గణాంకాల ప్రకారం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1. 62-1.64 లక్షల పరిధిలో కొనసాగుతోంది. దేశీయ మార్కెట్లో 24 క్యారెట్ల (99.9 శాతం స్వచ్ఛత) బంగారం గ్రాము ధర రూ.16,397గా, 22 క్యారెట్ల (91.6 శాతం స్వచ్ఛత) బంగారం గ్రాము ధర రూ.15,030గా ఉంది. 18 క్యారెట్ల (75%స్వచ్ఛత) బంగారం గ్రాము ధర రూ.12,293గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లోనూ బంగారం ధరలు మూడు నెలలకు పైగా గరిష్ఠ స్థాయికి చేరాయి. బలహీనంగా ఉన్న అమెరికా డాలర్, కీలకమైన అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలపై మార్కెట్ దృష్టి, ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ కెవిన్ వార్ష్ ఈ వారం చేయనున్న ప్రసంగం వంటి అంశాలు పసిడి ధరలకు మద్దతునిస్తున్నాయి. సోమవారం అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఔన్స్ ధర 4,649.08 డాలర్లకు చేరింది. దేశంలోని ముంబయిలో పదిగ్రాముల 24 కేరట్ల బంగారా రూ.1,63.397గానను, 22కేరట్లు రూ.1,50, 030 గాను, 18 కేరట్లు రూ.1,22,930గానున నడుస్తోంది. అదే హైదరాబాద్‌లో రూ.163. 970, 22 కేరెట్లు రూ.1, 50,030, 18 కేరట్లు రూ.1,22,930గాను ఉన్నాయి.

## స్టాక్ మార్కెట్లకు గ్లోబల్ ఎఫెక్ట్!

### నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఆగస్టు 24:** బలహీనమైన అంతర్జాతీయ సంకేతాల నేపథ్యంలో దేశీయ ఈక్విటీ సూచీలు సోమవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. దీంతో వరుసగా రెండు సెషన్ల లాభాలకు బ్రేక్ పడింది. నిఫ్టీ 24,250 మార్క్ దిగువన ముగిసింది. పీఎస్‌యూ బ్యాంక్, మీడియా, బ్యాంకింగ్ షేర్లు నష్టపోగా మెటల్, రియల్టీ, ఐటీ షేర్లు లాభపడ్డాయి. సెన్సెక్స్ 171.72 పాయింట్లు నష్టపోయి 77,369.11 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 32.95 పాయింట్లు తగ్గి 24,219.05 వద్ద ముగిసింది. గత రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 0.82 శాతం, నిఫ్టీ 0.72 శాతం చొప్పున లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.01 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.17 శాతం క్షీణించాయి. బీఎస్ఈలో మొత్తం 2,041 షేర్లు లాభపడగా, 2,393 షేర్లు నష్టపోయాయి. మరో 254 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 0.93 శాతం తగ్గి 8,539.75 వద్ద ముగిసింది. పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లలో బ్యాంక్ ఆఫ్ బరోడా 2.55 శాతం, కెనరా బ్యాంక్ 2.29 శాతం, ఎస్‌బీఐ 1.20 శాతం, బ్యాంక్ ఆఫ్



ఇండియా 1.18 శాతం, ఇండియన్ బ్యాంక్ 1.17 శాతం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 1 శాతం చొప్పున నష్టపోయాయి. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ 0.90 శాతం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 0.39 శాతం, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 0.26 శాతం తగ్గాయి. హెరాన్బా ఇండస్ట్రీస్ షేరు 8.99 శాతం దూసుకెళ్లింది. అర్బన్ కంపెనీ 6.05 శాతం లాభపడింది. విశాల్ మెగా మార్ట్ 9.31 శాతం పెరిగింది. కెల్టన్ టెక్ సొల్యూషన్స్ 1.18 శాతం ఎగిసింది. మరోవైపు క్యాప్లిన్ పాయింట్ ల్యాబొరేటరీస్ 2.70 శాతం పడిపోయింది. టాటా పవర్ 0.76 శాతం తగ్గింది. సీగల్ ఇండియా 2.69 శాతం లాభపడింది. లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్అండ్‌టీ) 0.07 శాతం నష్టపోయింది. ఎల్అండ్‌టీకి సంబంధించి ˇఅల్ట్రామెగా కేటగిరీ కింద వచ్చిన కాంట్రాక్ట్ విలువ రూ.15,000 కోట్లకు పైగా ఉన్నట్లు పేర్కొంది. డాలరుతో రూపాయి మారకం విలువలు 97.74వద్ద ముగిసింది.




## పదేళ్లలో 13 వేల రెట్లు పెరిగిన యుపిఐ లావాదేవీలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** దేశంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ యుపిఐ లావాదేవీలు గత పదేళ్లలో భారీగా పెరిగింది. పదేళ్లక్రితం 1.78 కోట్లుగా ఉన్న వార్షిక యూపీఐ లావాదేవీలు.. ప్రస్తుతం 24,162 కోట్లకు పైగా చేరుకున్నాయని కేంద్ర ఆర్థిక శాఖ సోమవారం వెల్లడించింది. దాదాపు 13 వేల రెట్లు పెరిగినట్లు తెలిపింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 2016 ఆగస్టు 25న యూపీఐని ప్రారంభించింది. అప్పటి నుంచి ఇది దేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకు వెన్నెముకగా మారడంతో పాటు ఆర్థిక సేవలను మరింత విస్తృత ప్రజలకు చేరువ చేయడంలో కీలక పాత్ర పోషిస్తోంది. యూపీఐ ద్వారా జరిగే లావాదేవీల విలువ కూడా గణనీయంగా పెరిగింది. పదేళ్ల క్రిందట రూ.0.07 లక్షల కోట్లుగా ఉన్న మొత్తం లావాదేవీల విలువ ప్రస్తుతం రూ.314 లక్షల కోట్లకు చేరుకుంది. దశాబ్ద కాలంలో 4,000 రెట్లకు పైగా పెరిగింది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో యూపీఐ కీలకంగా మారింది. వివిధ బ్యాంకులు, చెల్లింపు సంస్థల మధ్య అనుసంధానాన్ని కల్పిస్తూ తక్షణ చెల్లింపులకు అవకాశం కల్పిస్తోంది. వ్యక్తి నుంచి వ్యక్తికి (పి2పి), వ్యక్తి నుంచి వ్యాపారికి సులభంగా చెల్లింపులు చేసే వెసులుబాటు కల్పిస్తోంది. లావాదేవీల పరంగా ప్రపంచంలోనే అతిపెద్ద రియల్‌టైమ్ పేమెంట్ వ్యవస్థగా యూపీఐని అంతర్జాతీయ ద్రవ్య నిధి గుర్తించింది. ఒక్క మే నెలలో తొలిసారిగా నెలవారీ లావాదేవీల సంఖ్య 2,300 కోట్ల మార్కును దాటింది. ఆ నెలలో 2,320 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. జూలైలో ఈ సంఖ్య మరో రికార్డును సృష్టించి 2,366 కోట్లకు చేరింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14